

రిమ్స్ వద్ద నిరసన తెలుపుతున్న సురేష్, వెంకయ్య

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైసీపీ నేతలు వీరంగం సృష్టించారు. బాలికపై అత్యాచార ఘటనను తమ రాజకీయ లబ్ధికి వాడుకునేందుకు నానా హంగామా చేశారు. బాధితులకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి ఆవరణలో కేకలు వేస్తూ పోలీసులపై రెచ్చిపోయారు. ఆవేశంతో ఊగిపోయారు. దళిత మంత్రులైన స్వామి, అనితలపై విమర్శలు చేశారు. ఇళ్లలో తలుపులు వేసుకుని కుర్చున్నారని, ఘటన జరిగి నాలుగు రోజులైనా నేటికీ పరామర్శించ లేదన్నారు. 'వీళ్లు అసలు దళిత మంత్రులేనా? సిగ్గులేదా? దోషులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు' అని ఆరోపించారు. పనిలో పనిగా కలెక్టర్, డీఈవోలు ఏంచేస్తు న్నారు? అంటూ ప్రశ్నించారు. వారి చేష్టలతో రోగులు, బంధువులు ఇబ్బందులు పడ్డారు.



డీఎస్పీ రాయపాటితో వాగ్వివాదం చేస్తున్న సురేష్, వెంకయ్య, అశోక్‌బాబు

- సఖీ సెంటర్ వద్ద బైఠాయించి నిరసన
- పోలీసులపై రెచ్చిపోయిన వెంకయ్య, వరికూటి
- రాజకీయ లబ్ధి కోసం నానా అవస్థలు
- నిబంధనలకు విరుద్ధంగా బాధితురాలి సందర్శన
- ఇబ్బందిపడిన రోగులు, వారి బంధువులు

జీజీహెచ్‌లో వీరంగం

పరామర్శ పేరుతో వైసీపీ నేతల ఓవరాక్షన్

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేదల ప్రభుత్వ ఆసుపత్రి అయిన జీజీహెచ్‌లో వైసీపీ నేతలు వీరంగం సృష్టించారు. ఓ అత్యాచార బాధిత చిన్నారి పరామర్శ పేరుతో ఆసుపత్రిలో ఓవర్ యాక్షన్ చేశారు. పద్ధతి కాదని నచ్చజెప్పిన పోలీసులపై రెచ్చిపోయారు. నిబంధనలకు విరుద్ధమని చెప్పినా వినకుండా బాధిత చిన్నారి ఉండే గది వద్దకు వెళ్లేందుకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ సఖీ సెంటర్ ఆవరణలో బైఠాయించారు. దీంతో ఆస్పత్రిలో గందరగోళం నెలకొంది. అక్కడ చికిత్స పొందుతున్న రోగులు ఇబ్బంది పడ్డారు. వివరాల్లోకెళితే.. టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక అత్యాచారానికి గురైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. సదరు చిన్నారి జీజీహెచ్‌లోని సఖీ కేంద్రంలో వైద్యుల సంరక్షణలో ఉంది. పూర్తి వివరాలతో ఫిర్యాదు రాకపోవడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. మహిళా వైద్యుల సంరక్షణలో బాధిత బాలికను ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. అయితే పరామర్శ పేరుతో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైసీపీ నేతలు మాదాసు వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు శనివారం తమ అనుచరులతో జీజీహెచ్‌కు చేరుకుని నేరుగా బాలిక ఉండే గదిలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే నిబంధన ప్రకారం అత్యాచారానికి గురైన బాధితుల దగ్గరకు ఇతరులెవ్వరినీ అనుమతించకూడదు. అయితే అందరూ వేరు, మేము వేరు అంటూ వాళ్లతోపాటు మరికొంతమంది వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వారికి నచ్చజెబుతున్నప్పటికీ వినిపించుకోకుండా ఆయనపైనా నోరుపారేసుకున్నారు. గంటసేపు ఆసుపత్రిలో ఓవరాక్షన్ చేశారు. డీఎస్పీకి వేలు చూపిస్తూ... నాటకాలాడుతున్నావా? అంటూ వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు రెచ్చిపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

డీఎస్పీపై ఎదురుదాడి

మాజీ మంత్రి సురేష్, వైసీపీ నేతలు వరికూటి అశోక్‌బాబు, మాదాసు వెంకయ్యలు

మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయుడే కానీ.. ఆయనెవరో తెలియదు!

6

- ఫొటో చూపిస్తే గుర్తుపడుతుంది
- పోలీసులకు అత్యాచార బాధితురాలి తల్లి స్టేట్‌మెంట్
- గుర్తు తెలియని టీచర్‌గా కేసు నమోదు

న్యాయం జరిగే వరకు పోరాటం

- పెద్దల ఒత్తిడితోనే కేసు నమోదులో మీనమేషాలు
- మాజీ మంత్రి సురేష్
- విచారణ చేస్తున్నందునే జాప్యం : ఒంగోలు డీఎస్పీ

6

వైసీపీ స్వార్థ రాజకీయాలు సిగ్గుచేటు

- పోలీసు అధికారులను బెదిరించడం సరికాదు
- కారుమంచి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ
- మంత్రి స్వామి

జిల్లాకు మళ్లీ ప్రాధాన్యం

మలి విడతలో నలుగురికి చాన్స్

- కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియామకం
- జీవీరెడ్డి, మర్రెడ్డి, తేజస్వినిలకు అవకాశం
- ప్రతిపక్షంలో ఉండగా క్రియాశీలకంగా పనిచేసిన వారికి సముచిత స్థానం
- జనసేన నుంచి విజయకుమార్‌కు అవకాశం



మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జీవీరెడ్డి, పొడపాటి తేజస్విని, విజయ్‌కుమార్

ఒంగోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో మలివిడత ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల జాబితాలోనూ ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. ముగ్గురు టీడీపీ నేతలకు అవకాశం లభించింది. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న గత ఐదేళ్లలో వైసీపీ పాలకుల నుంచి తీవ్ర నిర్బంధాన్ని, ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో వారు వివిధ వేదికలపై పార్టీగళాన్ని బలంగా వినిపించారు. అలాగే జనసేనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని పర్చూరు సమన్వయకర్త విజయ్‌కుమార్‌కు చైర్మన్ గిరి లభించింది. నిబద్ధతతో పనిచేసిన టీడీపీ అధికార ప్రతినిధి జీవీరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, సాంకేతిక నిపుణుల విభాగం అధ్యక్షురాలు పొడపాటి తేజస్వినిలకు కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు నెలలుగా నామినేటెడ్ పదవులపై విస్తృత కసరత్తు జరుగుతోంది. తొలివిడత సెప్టెంబరు ఆఖరులో 14మంది కీలక నేతలను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించారు. అందులో జిల్లా నుంచి ముగ్గురికి స్థానం లభించింది. పలు ఉపకులాలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, ఇతర పలు సంస్థలు కలిపి మొత్తం 59 కార్పొరేషన్‌లకు

మిగతా 6వ పేజీలో



పొదిలి నిర్మమహేశ్వర ఆలయం వద్ద స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

కోటి సోమవారాన్ని ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే శైవక్షేత్రాలు, శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలువురు ఉసిరి కాయతో దీపాన్ని వెలిగించి, స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఇక ఆయా దేవాలయాలలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, స్వామివారికి విశేష అలంకరణలు జరిగాయి.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్



ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు నలుగురి ఎంపిక

- 11న విజయవాడలో ప్రదానం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. వీరిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈనెల 11న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేసి సత్కరించనున్నారు. గిద్దలూరు మండలం పొదలకుంటపల్లి జడ్పీ హైస్కూలులో స్కూలు అసిస్టెంట్ (హిందీ)గా పనిచేస్తున్న ఎం.పిచ్చయ్య మద్దిపాడు మండలం బసవన్నపాలెం జడ్పీ హైస్కూలులో ఎస్ఏ (హిందీ)గా పనిచేస్తున్న ఎస్‌కేఎం.బీబీ, సింగరాయకొండ మండలం మల్లికార్జుననగర్ ఎంపీపీఎస్ స్కూలులో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న కె.రాంబాబు, జరుగుమల్లి మండలం బిట్రగుంట కేజీబీవీ స్కూలులో వ్యాయామ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న హెప్సిబా ఈ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో డాక్టర్ మొర్రి పిచ్చయ్య విద్యార్థులకు అత్యాధునిక ఉపకరణాలను ఉపయోగించి విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులకు సొంత నిధులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. హెప్సిబా శిక్షణలో బిట్రగుంట కేజీబీవీకి చెందిన పలువురు విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆమె 2018లో సావిత్రిబాయి పూలే అవార్డును అందుకు న్నారు. సింగరాయకొండ మండలంలోని సోమరాజు పల్లి గ్రామానికి చెందిన రాంబాబు ఏడేళ్ల నుంచి గిరి జన కాలనీ అయిన మల్లికార్జుననగర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.



పిచ్చయ్య, ఎస్‌కేఎం బీబీ, హెప్సిబా, రాంబాబు



హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

భావజాల ప్రచారం మారాలి

మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా హేతువాద ఉద్యమ భావజాల ప్రచారం కూడా మారాల్సిన అవసరం ఉందని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం జరిగిన హేతువాద సంఘ రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

7

'సోషల్' సైకోలపై ఉక్కుపాదం

- ఇష్టారీతిన పోస్టింగుల ఫలితం
- ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌పై కేసు
- గొంతు నొక్కేందుకే అంటూ ఆయన ఆరోపణలు

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా వైసీపీ ప్రేరేపిత సైకోలు రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులపై చేస్తున్న పోస్టింగులపై పోలీసులు దృష్టి సారించారు. సామాజిక మాధ్యమాల వేదికగా సైకోలు హద్దులు దాటి శ్రుతిమించుతుండటంతో వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇష్టారీతిన ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం తదితరాల్లో అనుచితమైన వ్యాఖ్యలను పోస్టింగ్ చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడాన్ని సహించలేని వైసీపీలోని సైకో కార్యకర్తలు హద్దులుదాటి పోస్టింగులు పెడుతుండటంపై ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదుతో పెడబొబ్బలు

ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఎక్స్ వేదికగా రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్‌పై అనుచిత పోస్టు పెట్టారు. రాష్ట్రంలోని పేకాట క్లబ్‌ల నుంచి వారంవారం కమీషన్లు వసూలు చేస్తున్నట్లు నిరాధారమైన

మిగతా 6వ పేజీలో

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు!

- ప్రకృతి వ్యవసాయంతో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న విశ్రాంత తహసీల్దార్
- అందరికీ ఆదర్శం

వివరాలు 7వ పేజీలో



సచివాలయాల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో

- ఉషారాణిని తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

7



రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

నిధులే ప్రధానం...

గళం విప్పితేనే ఫలితం

ఒంగోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కీలకమైన అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. తొలుత జూన్ ఆఖరులో రెండు రోజులపాటు నిర్వహించి ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక ప్రక్రియలను ముగించారు. జూలై ఆఖరులో మరోసారి ఐదు రోజులపాటు నిర్వహించి రెండో ఓటాన్ అకౌంట్ ఆమోదం, ఇతర అంశాలపై చర్చించారు. ఈసారి ఈనెల 11 నుంచి నిర్వహించే సమావేశాలలో వార్షిక బడ్జెట్ ఆమోదం, పలు కీలక అంశాలపై చర్చతోపాటు బిల్లులను ఆమోదించనున్నారు. అందుతున్న సమాచారం ప్రకారం ఈసారి రెండు వారాలపాటు సమావేశాలు జరగనున్నాయి. తొలిరోజైన సోమవారం బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టనున్నారు. సాధారణంగా బడ్జెట్ సమావేశాల సమయంలోనే శాఖల వారీ నిధుల కేటాయింపు, అభివృద్ధి, సంక్షేమ అంశాలు, కీలక ప్రజాసమస్యలపై

మిగతా 6వ పేజీలో

- తొలిరోజు బడ్జెట్ ప్రతిపాదనలు
- వివిధ అంశాలపై చర్చకు అవకాశం
- సాగు, తాగునీరు, విద్య వైద్యం, రోడ్లు, పారిశ్రామిక, ఉపాధి రంగాలు కీలకం
- మార్కాపురం జిల్లా ఏర్పాటు, ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ అత్యవసరం

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ జమున

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి.జమున శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆమెను ప్రభుత్వం ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ దుర్గాదేవి తన సొంత స్థానమైన రిమ్స్ మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న జమునను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, డాక్టర్ బాలాజీనాయక్‌తోపాటు ఆర్ఎంవో, ఇతర వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



జమునకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు చెప్తున్న నామినేని కిరణ్, బాలాజీ నాయక్

రేషన్‌షాపుపై విజిలెన్స్ దాడులు


ఒమ్మెవరంలో రేషన్‌బియ్యం పట్టుకొన్న అధికారులు

నాగులుప్పలపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒమ్మెవరం గ్రామంలోని 43 నంబరు రేషన్‌షాపుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. డీటీ రాజ్యలక్ష్మి, ఎఫ్ఐ బి.గుణవంశీ ఆధ్వర్యంలో రేషన్‌దుకాణంలో తనిఖీలు చేపట్టగా ఉండాల్సిన నిల్వల కన్నా 11 బస్తాలతో పాటు డీలర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 50 బస్తాలు మొత్తం వెరసి 61 బస్తాలు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్‌డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐ గుణవంశీ తెలిపారు.

జీజీహెచ్‌లో వీరంగం

(5వ పేజీ తరువాయి)

ఒకానొక దశలో అదుపుతప్పి నోటికొచ్చినట్లు మాట్లాడారు. స్వయంగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావుతో వాగ్వాదానికి దిగడం, అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. అత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే ఎవరూ కూడా ఫిర్యాదు ఇవ్వలేదని డీఎస్పీ తెలిపారు. వారి తల్లిదండ్రుల్లో ఒకరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించే ప్రయత్నం చేశారు. అయినా ఏమాత్రం వినిపించుకోకుండా గందరగోళం సృష్టించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ చెప్పడంతో 'నాటకాలు ఆపు, ఏమనుకుంటున్నావు. చట్టాలు మాకు తెలియవా? మేము చదువుకున్నాం' అంటూ వెంకయ్య రెచ్చిపోయారు. ఇదేక్రమంలో వరికూటి అశోక్‌బాబు తన అనుచరులతో సఖీ కేంద్రంలోకి దూసుకుళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా పోలీసులు, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.

బాధిత కుటుంబానికి భరోసా ఏదీ?

సాధారణంగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు ఎవరైనా సరే బాధితులకు అండగా ఉండాల్సిందే. బాధితురాలి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, వారి కుటుంబ ప్రతిష్టకు భంగం కలగకుండా సున్నితంగా వ్యవహరించాలి. గతంలో బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఓ మహిళపై అత్యాచారం జరగడంతో ఆమెను ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా ఉన్న స్వామి పరామర్శకు వస్తే పోలీసులు అడ్డుకుని, చట్టప్రకారం వీలు పడదని తెలిపారు. దీంతో స్వామి చట్టాన్ని గౌరవిస్తూ వెనుదిరిగారు. కానీ నేడు పరామర్శ పేరుతో వచ్చిన వైసీపీ నేతలు రాద్ధాంతం చేశారు. చట్టప్రకారం జరగాల్సిన ప్రక్రియను రాజకీయ లబ్ధి కోసం నానా యాగీ చేసిన వారు చివరికి బాధిత కుటుంబానికి ఎలాంటి భరోసా ఇవ్వలేదు. కనీసం ఆర్థికంగా కూడా సహాయపడకుండానే వెనుదిరిగారు. కేవలం కూటమి ప్రభుత్వాన్ని నిందించేందుకు ఈ ఘటన వైసీపీ నేతలకు ఉపయోగపడిందని పలువురు చర్చించుకున్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ఘటనలు వాడుకోవడం వైసీపీకి సహజమేనంటూ పలువురు చర్చించుకోవడం గమనార్హం.

న్యాయం జరిగే వరకు పోరాటం

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

కారుమంచి గ్రామానికి చెందిన నాల్గో తరగతి బాలికపై అత్యాచారం చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ప్రభుత్వానికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని, అత్యాచార బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం చేస్తుందని మాజీ మంత్రి సురేష్ తెలిపారు. శనివారం స్థానిక జీజీహెచ్‌లోని సఖీ సెంటర్‌లో వైద్యం పొందుతున్న బాలికను సురేష్‌తోపాటు, వైసీపీ నేతలు డాక్టర్ మాదాసు వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 92 అత్యాచార, హత్యలు, భౌతిక దాడులు కేసులు నమోదయ్యాయన్నారు. ప్రజాస్వామం ఎటుపోతుందో తెలియడం లేదన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. మాదాసు వెంకయ్య మాట్లాడుతూ దళిత మంత్రులుగా చెప్పుకుంటున్న జిల్లాకు చెందిన డాక్టర్ స్వామి, హోంమంత్రి అనిత నేటికీ బాధితురాలిని పరామర్శించలేదన్నారు. కలెక్టర్ కానీ, డీఈవో కానీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ కారుమంచిలో చోటుచేసుకున్న ఘటనపై ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నదన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. అలాగే మీడియా సమావేశంలో ఐద్వా నాయకురాలు సుబ్బరావమ్మ పాల్గొని అత్యాచార బాధిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతకముందు సఖీ సెంటర్ ఎదురుగా కూర్చుని వారు నిరసన తెలియజేశారు. పోలీసుల తీరును, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు.

విచారణ జరుగుతున్నందునే జాప్యం

- డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

కారుమంచిలో జరిగిన అత్యాచార ఘటనపై విచారణ చేస్తున్నామని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. కాగా అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడి వివరాలు తెలియజేయాలని మూడు రోజులుగా బాలిక కుటుంబ సభ్యులను కోరామన్నారు. అయితే పూర్తి వివరాలు బాలిక చెప్పలేకపోతుందన్నారు. వారి తల్లిదండ్రులైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని తెలిపారు. శనివారం వారి కుటుంబసభ్యులతో మాట్లాడామని, అలాగే బాలికకు రక్షణ కల్పించేందుకు మహిళా పోలీసులను ఉంచామని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదుకు సరైన ఫిర్యాదు, వివరాలు అందించనందువలననే జాప్యం జరిగిందన్నారు. పోలీసులను నిందించడం సరికాదన్నారు. ప్రస్తుతం వారు చెప్పిన వివరాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, విచారణ చేసి, నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుడే కానీ.. ఆయనెవరో తెలియదు!

ఫొటో చూపిస్తే గుర్తుపడుతుంది

పోలీసులకు అత్యాచార బాధితురాలి తల్లి స్టేట్‌మెంట్

గుర్తు తెలియని టీచర్‌గా కేసు నమోదు చేసిన పోలీసులు

టంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుమంచికి చెందిన పదేళ్ల బాలికపై లైంగిక దాడి విషయమై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అఘాయిత్యానికి పాల్పడింది ఉపాధ్యాయుడేనని అంటున్న బాధితురాలు ఆయన ఎవరన్నది మాత్రం చెప్పలేకపోతోంది. దీంతో గుర్తు తెలియని టీచర్ లైంగిక దాడి చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కారుమంచి జడ్పీ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక ఆరోగ్యం బాగోలేదని చెప్పి బుధవారం స్కూల్‌కు వెళ్లలేదు. గురువారం కూడా ఇంట్లోనే పడుకుంది. దీంతో తల్లి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యుడు వెంటనే ఒంగోలు రిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. దీంతో ఆమె బాలికను రిమ్స్‌లో చేర్పించింది. అక్కడి వైద్యులు పరీక్షలు చేశారు. ఏం జరిగిందని బాలికను ప్రశ్నించగా పాఠశాల టీచర్ తనపట్ల అనుచితంగా వ్యవహరించాడని చెప్పింది. సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు వైద్యశాలకు వెళ్లి విచారించగా వారికి రెండు రకాల స్టేట్‌మెంట్స్ ఇచ్చింది. అంతా టీచరే చేశాడని అంటూనే సహచర విద్యార్థినిపైనా ఇలాగే చెప్పింది. దీంతో ఏమి చేయాలో అర్థంకాక పోలీసులు కేసు నమోదు చేయడంలో కొంత జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో మరోసారి శనివారం బాలిక తల్లి వద్ద స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తమ కుమార్తెపై ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డాడని, అయితే ఆయనెవ్వరో తమకు తెలియదని.. ఫొటో చూపిస్తే తమ కుమార్తె గుర్తుపడుతుందని తల్లి వాగ్మూలం ఇచ్చింది. దీని ఆధారంగా గుర్తు తెలియని ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

హరోంహర

- భక్తిశ్రద్ధలతో కోటి సోమవార పూజలు
- శివాలయాలకు పోటెత్తిన మహిళలు
- దీపాలు వెలిగించి నైవేద్యాలు



ఒంగోలు (కల్చరల్), నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కోటి సోమవారాన్ని మహిళలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కార్తీకమాసంలో శనివారం, శ్రవణా నక్షత్రం కలిసివచ్చిన రోజును కోటి సోమవారంగా పిలుస్తూ ఆ రోజు ఇళ్లలో, శివాలయాల్లో మహిళలు ఉసిరి దీపాలను వెలిగించటం ఆనవాయితీ. ఆ విధంగా దీపాలు వెలిగించి, ఉపవాసం ఉంటే కోటి సోమవారాలు ఉపవాసం చేసిన ఫలితం వస్తుందని పురాణాలు చెబుతున్నందున దానిని కోటి సోమవారంగా పిలుస్తారు. ఇక కోటి సోమవారం సందర్భంగా జిల్లాలోని పలు ప్రముఖ శివాలయాల్లోనే కాకుండా గ్రామాల మొదలు పట్టణాల వరకు అన్ని శివాలయాలు శనివారం మహిళలతో కిటకిటలాడాయి. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, అంజయ్యరోడ్ పంచముఖ శివాలయం, సంతపేట, లాయర్‌పేటలోని సాయిబాబా మందిరాల్లో ఉన్న శివాలయాలు, రంగారాయుడు చెరువుదగ్గర ఉన్న అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండ్ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఇలా పలు శివాలయాలలో సోమవారం ఉదయం మహిళలు ఉసిరి కాయతో దీపాన్ని వెలిగించి, స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఇక ఆయా దేవాలయాలలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, స్వామివారికి విశేష అలంకరణలు జరిగాయి.

గేదె కళేబరాన్ని ఢీకొట్టి కారు బోల్తా

మహిళ మృతి


బోల్తా పడిన ఇన్నోవా కారు


మృతి చెందిన పార్వతి

టంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారు ఢీకొని బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సూరారెడ్డిపాలెం-నాయుడుపాలెం మధ్య శుక్రవారం రాత్రి పొద్దుపోయాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుపతి బయల్దేరింది. అందులో 8 మంది ప్రయాణిస్తున్నారు. వీరి కారు సూరారెడ్డిపాలెం-నాయుడుపాలెం మధ్య అప్పటికే గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉన్న గేదెను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒరుసు పార్వతి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేతల స్వార్థ రాజకీయాలు సిగ్గు చేటు

● మంత్రి స్వామి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కారుమంచి ఘటనలో బాలిక భవిష్యత్ దృష్ట్యా గోప్యంగా, నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మీడియాకు ఓ వీడియో ద్వారా వెల్లడించారు. కానీ వైసీపీ నేతలు పరామర్శ పేరుతో ఒంగోలులోని జీజీహెచ్ వద్ద చట్టాన్ని చేతిలోకి తీసుకునేలా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. విచారణ చేస్తున్న అధికారులను బెదిరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైసీపీ హయాంలో మహిళలపై 2లక్షలకు పైగా అఘాయిత్యాలు జరిగితే ఏమి చర్యలో తీసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. లేని దిశ చట్టం పేరుతో మహిళలను మోసం చేసింది జగన్ కాదా అని ప్రశ్నించారు. మొన్న చిత్తూరు జిల్లాలో తన కూతురిపై అత్యాచారం జరగలేదని బాలిక తల్లిదండ్రులు చెబుతున్నా, వైసీపీ నేతలు మాత్రం అఘాయిత్యం జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేశారని మంత్రి ఆరోపించారు. వైసీపీ నేతలు తమ స్వార్థ రాజకీయ లబ్ధి కోసం బాలికల గౌరవానికి భంగం వాటిల్లేలా తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గ చర్యన్నారు. వైసీపీ ఇకనైనా ఇలాంటి అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ నేతలు మాదిరిగా తప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం టీడీపీ కూటమి ప్రభుత్వానికి లేదని, ఆదిమూలపు సురేష్‌ను నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టినా తన తీరు మార్చుకోలేదని విమర్శించారు. కొండపిలో తనపై ముగ్గురు వ్యక్తులు పోటీ చేసి ఒక్కరు కూడా గెలవలేకపోయారని, ఇప్పుడు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి పదవి కోసం వారిలో వారే పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎవరొచ్చినా కొండపిలో వైసీపీకి చోటుల లేదని మంత్రి స్పష్టం చేశారు.

'సోషల్' సైకోలపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు. 'పేకాట ఆడేవారికి వసతులు ఏర్పాటు చేస్తారా..?' అంటూ మంత్రిని ప్రశ్నించారు. ఈ విషయంపై గత నెలలోనే టీడీపీ కార్యకర్త చేదూరి కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్రగొండపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రెస్‌మీట్లు పెట్టి టీడీపీపై విమర్శలు గుప్పిస్తున్నారు. 'ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కేసేందుకు కేసులు నమోదు చేస్తారా' అంటూ ఆరోపణలు చేశారు. అయితే ఎలాంటి ఆధారాలు లేకపోయినా రాష్ట్ర మంత్రులపై ఇష్టంవచ్చినట్లు ఆరోపణలు చేయడమేగాక మళ్లీ తాము సుద్దపూసలమంటూ ప్రెస్‌మీట్లు పెట్టడం గమనార్హం. అదేవిధంగా సత్తెనపల్లికి చెందిన కల్లి నాగిరెడ్డి అనే వైసీపీ సైకో కూడా ఇదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు విజయవాడ వరద సహాయం మాటున రూ.534 కోట్లు లూటీ చేశారని గత నెలలో ఎక్స్ వేదికగా అనుచిత పోస్టింగు పెట్టారు. దీనిపై మార్కాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త యశ్వంత్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాడేపల్లిలో దాక్కున్న వైసీపీ సైకోను అరెస్ట్ చేసేందుకు పోలీసులు వెళ్లారు. ఆపార్టీ నాయకులు మళ్లీ ఇష్టారీతిన తమ కార్యకర్తను కిడ్నాప్ చేశారంటూ సామాజిక మాధ్యమాల ద్వారా విషప్రచారం చేశారు. అంతేకాక పొదిలి, కొత్తపట్నం, ఒంగోలు, చీరాల తదితర ప్రాంతాల్లో కూడా సామాజిక మాధ్యమాల్లో వైసీపీ సైకోలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదులు చేస్తే పోలీసులు అరెస్టులు చేస్తున్నారు. తీరుమార్చుకోకుంటే భవిష్యత్తులో కూడా అరెస్టుల పరంపర కొనసాగుతుందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

విచారణకు పిలిచిన పోలీసులు

రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌పై తీవ్ర పదజాలంతో పోస్టు పెట్టిన ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు రావాలంటూ ఆయనకు వారం క్రితం నోటీసు ఇచ్చారు. కానీ ఆయన హాజరుకాలేదు. దీంతో నేరుగా ఎమ్మెల్యేకు శుక్రవారం ఎర్రగొండపాలెం ఎస్సై చౌడయ్య ఫోన్ చేసి శనివారం విచారణకు స్టేషన్‌కు రావాలని కోరారు. చంద్రశేఖర్ హాజరుకాకపోగా తాను డీజీపీని కలుస్తానని మీడియా సమావేశం ఏర్పాటు చేసి చెప్పారు. పైగా కేసుల పేరుతో తమ గొంతు నొక్కుతున్నారంటూ గగ్గోలు పెట్టారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య

- పామూరు ప్రజలకు తప్పని కష్టాలు
- ఆక్రమణలతో కుంచించుకుపోయిన రోడ్లు
- విస్తరణ పనులు చేపట్టి ఇబ్బందులను

తొలగించాలని వినతి

పామూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. దాంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా మమ్మీడాడి, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డుతో పాటు విరువూరు రోడ్డు ఏరియాల్లో రోడ్ల మార్జిన్లు సైతం దుకాణం దారులు ఆక్రమించుకోవడంతో ఇరుకుగా మారాయి. రోడ్లపైనే ద్విచక్రవాహనదారులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తుంది. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోగా విశాలంగా ఉన్న రోడ్లు సైతం కుంచించుకుపోతున్నాయి. దుకాణాలముందు ఉన్న స్థలాలను ఆక్రమించుకొని బాడుగులు ఇస్తూ సొమ్ము చేసుకొంటున్నా అడ్డుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలంగా తయారైంది.

మమ్మీడాడి సెంటర్, సీఎస్‌పురం, కనిగిరి రోడ్లలో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఎక్కడికక్కడ ఆగిపోవల్సిందే. గతంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టిందుకు అధికారులు సర్వే చేపట్టి మార్కింగ్ కూడా ఇచ్చారు. అయితే, రాజకీయ ఒత్తిడులతో విస్తరణ పనులకు గ్రహణం పట్టింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక పోలీస్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్ల మార్జిన్‌లను సైతం దుకాణం దారులు రోడ్డు కన్నా ఎత్తుగా మెరక పనులు చేపడుతున్నా అడిగేవారే కరువయ్యారు. ఆక్రమణలను తొలగించినా కొంతమేర ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

24న కమ్మ వారి కార్తీక వన సమారాధన

ఒంగోలు (కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఈ నెల 24న జరుగుతుందని అధ్యక్షులు మండవ మురళీకృష్ణ తెలిపారు. సంఘ సమావేశం శనివారం స్థానిక నిర్మల్‌నగర్‌లోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రాజుపాలెం వద్ద హైవే సిటీ ఆవరణలో వన భోజన మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో భోజన ఏర్పాట్లు, భవిష్యత్ కార్యాచరణ, అతిథులకు స్వాగత ఏర్పాట్లు గురించి చర్చించామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 20వ తేదీన స్థానిక కర్నూల్‌రోడ్‌లోని లాస్య గ్రాండ్ రెస్టారెంట్‌లో సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు పావులూరి బాపయ్యచౌదరి, అబ్బూరి నవీన్, వడ్లమూడి లింగయ్య పాల్గొన్నారు.

గెలాక్సీ గ్రానైట్ గనుల్లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

● 17న ఒంగోలులో బహుమతి ప్రదానోత్సవ సభ

చీమకుర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : గెలాక్సీ గ్రానైట్ గనుల్లో గతవారం రోజులుగా నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రామతీర్థం పరిసర ప్రాంతాల్లోని 31 క్వారీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలచే తనిఖీలు నిర్వహించారు. అంతకుముందు దాదాపు వారం రోజులపాటు ట్రేడ్ పరీక్షలను క్వారీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, ముగింపు సభను ఈనెల 17వతేదీ సాయంత్రం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్నారు. కాగా చివరిరోజు గోల్డెన్ గ్రానైట్ క్వారీలో తనిఖీ బృందాలు పరిశీలించారు. వీరికి మేనేజర్ ఎ.గిరి ఘనస్వాగతం పలికారు. అనంతరం టీంలీడర్ మురళికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు.

19 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 19 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా శివకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా మద్యం అక్రమంగా విక్రయిస్తుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గళం విప్పితేనే ఫలితం

(5వ పేజీ తరువాయి)

విస్తృత చర్చ సాగుతుంది. ఒకవైపు పద్దుల వారీ, మరోవైపు ప్రశ్నల రూపంలో జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై మాట్లాడి నిధులు రాబట్టుకొనే అవకాశం ఉంటుంది. అలాంటి కీలక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లాకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు సమావేశాలను సద్వినియోగం చేసుకొని గళం విప్పాలని ప్రజానీకం కోరుతున్నారు.

నిధులు సాధనే లక్ష్యం

ప్రధానంగా ఆయా శాశ్వత అభివృద్ధి, ఉపాధి రంగాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సాధించడంతోపాటు వైసీపీ పాలనలో అదుపులేకుండా సాగిన అవినీతి, అక్రమాల అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. కీలకమైన వెలిగొండ, గుండ్లకమ్మతోపాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులు, జలజీవన్ మిషన్‌తోపాటు ఇతర తాగునీటి పథకాలు, యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, డ్రైవింగ్ స్కూలు, మార్కాపురం మెడికల్ కాలేజీ వంటి నిర్మాణాలు చేపట్టాలి. రోడ్లు, పారిశ్రామిక అభివృద్ధి రంగాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కీలకమైన ఒంగోలు డెయిరీని ఏకంగా మూసేయగా అడ్డగోలుగా జిల్లాను విభజించి పశ్చిమ ప్రాంతవాసులను ఇబ్బంది పెట్టారు. వాటన్నింటిపై చర్చించి పరిష్కారం సాధించాలి.

ప్రభుత్వం దృష్టికి సమస్యలు

ఈసారి అసెంబ్లీ సమావేశాలు బడ్జెట్ ప్రధాన అంశంగా నిర్వహిస్తున్న తరుణంలో జిల్లా అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకురావాల్సిన అవసరం ఎమ్మెల్యేలపై ఉంది. ప్రధానమైన వెలిగొండకు నిధులు లేక కదలడం లేదు. తొలిదశ పూర్తిచేయాలన్నా రూ.1,420కోట్లు కావాలి. గుండ్లకమ్మ గేట్లు, కాలువల పనులకు రూ.200 కోట్లు, ఇతర సాగునీటి వనరులకు మరో రూ.300 కోట్లు అవసరం. తాగునీటి సరఫరా పరిస్థితి జిల్లాలో దారుణంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ మిషన్, పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం పనులు పడకేశాయి. సుమారు రూ.250 కోట్ల వరకు వాటికి అవసరం. కాగా జిల్లాలోని 27 సామూహిక నీటి పథకాల పరిధిలో పూర్తిస్థాయి నీటి సరఫరాకు అవసరమైన పనులకు రూ.159.92కోట్లు కోరుతూ కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు.

చాలా పనులు పెండింగ్

టీడీపీ ప్రభుత్వ కాలంలో శంకుస్థాపన చేసిన ఏకేయూ యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటీ, డ్రైవింగ్ స్కూల్‌తోపాటు వైసీపీ చేపట్టిన మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలు ముందుకు పడలేదు. దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్ పరిస్థితీ అంతే. కీలకమైన రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. సాగర్ కాలువల్లో నీరు పారే పరిస్థితి లేకపోగా, నీరు-చెట్టు, ఉపాధి అనుసంధాన, మైక్రో ఇరిగేషన్ పథకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. దాదాపు రూ.1,500 కోట్ల విలువైన ఆ సంస్థ ఆస్తులు నిరుపయోగంగా మారాయి. అధికారంలోకి వస్తే డెయిరీని పునరుద్ధరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రకటించారు. పలుసభల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు.

మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలి

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటును పలుసార్లు స్పష్టంగా చెప్పారు. ఈ అంశాలను అసెంబ్లీలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వం నుంచి మరింత స్పష్టత, అలాగే త్వరితగతిన వాటి ప్రక్రియ సాగేలా ఈ సమావేశాల్లోనే ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాల్సి ఉంది. అలాగే డీసీసీబీ, డ్వామా, జగనన్న కాలనీలు, ఇతరత్రా పలు శాఖల పరిధిలో అవినీతి, అక్రమాలపై విచారణలు జరుగుతున్నా ఆశించిన స్థాయిలో లేవు. అలాంటి వాటిపై ఉన్నతస్థాయి చర్యలపై చర్చపెట్టడం ద్వారా వేగవంతం చేయాలి. ఇదిలాఉండగా జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా మంత్రి స్వామి మరో ఐదుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు వైసీపీ ప్రకటించడంతో వారిరువురూ అసెంబ్లీకి వెళ్లే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పాత్రలు రెండింటినీ టీడీపీ ఎమ్మెల్యేలు కొనసాగించి జిల్లా ప్రజల గళం వినిపించాల్సి ఉంది.

జిల్లాకు మళ్లీ ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

చైర్మన్లను కూటమి ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఆ జాబితాలోనూ జిల్లాకు ప్రాధాన్యం లభించింది. మూడు కార్పొరేషన్ చైర్మన్లు దక్కాయి. ముగ్గురూ తమతమ విభాగాలు, బాధ్యతలతో రాష్ట్రస్థాయిలో కీలకంగా పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులకు సుపరిచితులైనవారే. టీడీపీ అధికార ప్రతినిధిగా నిరంతరం గళంవిప్పుతూ వైసీపీ అరాచక పాలనపై ఐదేళ్లు అలుపెరగని రీతిలో మీడియా వేదికగా పోరాడిన జిల్లాకు చెందిన జీవీరెడ్డిని రాష్ట్ర ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. మార్కాపురానికి చెందిన జీవీరెడ్డి ఉన్నత విద్యావంతుడు. వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్. అనంతరం న్యాయ విద్య కూడా పూర్తిచేశారు. హైదరాబాద్‌లో సీఏగా పనిచేస్తూ జీవీరెడ్డి తొలుత కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలో 2019లో టీడీపీ ఓటమి తర్వాత ఆ పార్టీలో చేరారు. బలంగా పార్టీ వాయిస్‌ను వినిపిస్తూ వచ్చారు. వైసీపీ నుంచి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకొని నిలిచారు.

తెలుగు రైతుకు మరింత గుర్తింపు

మరో నేత మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలుగురైతు అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థి, యువజన రంగాల్లో సీపీఎంలో క్రియాశీలకంగా పనిచేసిన మర్రెడ్డి ముండ్లమూరు మండల వాసి. కాగా రైతు సమస్యలపై పనిచేస్తూ గుర్తింపు పొందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముండ్లమూరు మండల జడ్పీటీసీ సభ్యురాలిగా శ్రీనివాసరెడ్డి భార్య రమణమ్మ గతంలో పనిచేశారు. 2014లో టీడీపీలో చేరిన ఆయన అప్పటి నుంచి కొనసాగుతున్నారు. 2019లో పార్టీ ఓటమి అనంతరం తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. చురుగ్గా పనిచేస్తున్న మర్రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైర్మన్‌గా నియమించారు.

భూమి ఫౌండేషన్‌తో జాతీయ స్థాయిలో గుర్తింపు

చిన్న వయస్కురాలైన పొడపాటి తేజస్వినిది ఒంగోలు సమీపంలోని మంగమూరు. చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. భూమి ఫౌండేషన్ పేరుతో ఒంగోలు కేంద్రంగా పారిశుధ్యం, పరిశుభ్రత, పర్యావరణ అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ, రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన తేజస్విని 2014 ఎన్నికలకు ముందు నుంచి తెలుగు సాంకేతిక నిపుణుల విభాగంలో చురుగ్గా పనిచేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మరింత క్రియాశీలకంగా పనిచేశారు రాష్ట్రంలోనే కాక హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేసి వైసీపీ పాలనలోని అరాచకాలపై చైతన్యవంతం చేశారు. చంద్రబాబు అరెస్టు సమయంలో పలుప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ యువతతో సమావేశాలు నిర్వహించి మద్దతుగా నిలిచేలా పనిచేశారు. ఆమెకు ప్రస్తుత జాబితాలో ఏపీ కల్చరల్ కమిషన్ చైర్మన్‌గా అవకాశం దక్కింది. విధులు, నిధులు ఏమిటి, ఆయా రంగాల్లో వారు ఏమేరకు సంబంధిత ప్రజలకు ఉపకరించేలా పనిచేస్తే అవకాశాలు ఎంతమేర అన్న విషయాలు పక్కనపెడితే జిల్లాకు నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం ఈ విడత దక్కిందనే చెప్పాలి.

హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ హేమలత



చీరాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా చీరాలకు చెందిన టీడీపీ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత నియమితులయ్యారు. శనివారం కూటమి ప్రభుత్వం రెండో విడత విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ఆమెకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నేతన్నల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా...

పెద్దపూడి విజయ్ కుమార్



పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో పర్చూరు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కింది. ఆయనను కూటమిలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన పెద్దపూడి విజయ్‌కుమార్ హైదారాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. విద్యార్థి దశలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు. 2018 నుంచి జనసేన పార్టీలో ఉండి క్రియాశీలక నాయకునిగా తనదైన శైలిలో ముందుకు సాగుతూ ఆపార్టీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నారు. రాజనీతి శాస్త్ర విభాగం నుంచి సంక్షేమ రాజ్యం, దళితుల విద్య - ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాత్ర అనే అశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. ఉన్నత విద్యతోపాటు, రాజకీయ రంగంలో సానుకూల దృక్పథంతో ప్రజాదరణ పొందుతూ ముందుకు సాగుతున్నారు.



సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లతో గిరిజారెడ్డి

పంచ్ కొడితే పతకమే!

కఠోర శ్రమతో తైక్వాండోలో రాణిస్తున్న యువతి

- గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారిణి
- ఇప్పటికే పలు చాంపియన్‌షిప్‌లలో మెడల్స్

ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించిందామె. శ్రమ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చని రుజువు చేసింది. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ఔరా అనిపించింది. ఆమే.. చినగంజాం మండలం కొత్తపాలెం పంచాయతీ మూలగానివారిపాలేనికి చెందిన తైక్వాండో క్రీడాకారిణి కుంచాల గిరిజారెడ్డి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఉన్నత స్థాయికి చేరిన ఆమెపై ఆంధ్రజ్యోతి ప్రత్యేకం..

చినగంజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలేనికి చెందిన కుంచాల గిరిజారెడ్డి ఇటీవల ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో జరిగిన అండర్-55 విభాగంలో ప్రథమ స్థానంలో సత్తాచాటి ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. చిన్నతనం నుంచి తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం దగ్గర శిక్షణ పొందుతోంది. ప్రస్తుతం ఒంగోలు హర్షిణి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. గిరిజా రెడ్డి తల్లిదండ్రులు రామాంజనేయులురెడ్డి, నాగులకోటేశ్వరి. చెల్లెళ్లు దేవిశ్రీరెడ్డి, ప్రాదిత్య రెడ్డి. తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి చినగంజాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి లోని పెదగంజాం గ్రామంలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. గిరిజారెడ్డి చెల్లెలు కూడా తైక్వాండోపై ఉన్న ఆసక్తితో శిక్షణ పొందుతోంది. మహిళలకు తైక్వాండో ఆత్మరక్షణ కోసం ఉపయోగపడడమే కాకుండా బాలికలు ఎందులో తీసిపోరనే సందేశాన్ని ఇస్తున్నారు. ముగ్గురు ఆడపిల్లలకు ఆత్మరక్షణగా ఉంటుందని, బయటకు వెళ్లినప్పుడు ధైర్యంగా ఉండేందుకు తైక్వాండో శిక్షణ ఇప్పిస్తున్నట్లు గిరిజారెడ్డి తల్లిదండ్రులు తెలిపారు. ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ ఖర్చులో వెనకడుగు వేయకుండా ముగ్గురికీ శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తిని గమనించి శిక్షణ ఇచ్చా



తైక్వాండోపై గిరిజారెడ్డికి ఉన్న ఆసక్తిని గమనించి శిక్షణ ఇచ్చాను. చిన్నప్పటి నుంచి మెలకువలు నేర్పుతూ పోటీలకు తీసుకొని వెళ్లేవాడిని. పోటీలకు వచ్చిన వారిలో ఉన్న ప్రతిభను గుర్తిస్తూ నేర్చుకుంది. పోటీలకు వెళ్లిన ప్రతిసారీ ప్రతిభ కనబరిచి బహుమతి సాధించేది.

- వాటుపల్లి సుబ్రహ్మణ్యం, కోచ్

సాధించిన విజయాలెన్నో..

- చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2019 సెప్టెంబరు 15న జరిగిన 6వ ఓపెన్ సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ బాల బాలికల జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్-2019 పోటీల్లో 55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.
- నంద్యాల శ్రీ రామకృష్ణ పీజీ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరిగిన 2వ ఏపీ ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్-2022 పోటీల్లో అండర్-59 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది.
- కందుకూరు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్పోర్ట్సు అకాడమీలో జరిగిన 11వ సబ్ జూనియర్ క్యాడెట్ జూనియర్, సీనియర్ బాలికల జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్-2021 పోటీల్లో 59 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది.
- నంద్యాలలో 2023 నవంబరు 21న జరిగిన రాష్ట్ర ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ మెడల్, పుదుచ్చేరిలోని ఉప్పలంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 2024 ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగిన ఖేలో ఇండియా మహిళల తైక్వాండో లీగ్ 2023-24 పోటీల్లోనూ, కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-2022-23 అంతర జిల్లాల తైక్వాండో పోటీల్లోనూ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ పోటీల్లో గిరిజారెడ్డి రెడ్-1గా పాల్గొని బహుమతులు సాధించింది.
- ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జాతీయ స్థాయిలో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో గిరిజారెడ్డి గోల్డ్ మెడల్ సాధించాలని ఆశిద్దాం.

బంగారు పతకం సాధించడమే ధ్యేయం



జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించడమే న్యా ధ్యేయం. తైక్వాండో కోచ్‌గా తయారై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తాను. తల్లిదండ్రులతో పాటు గురువులు, పెద్దలు నన్ను ప్రోత్సహించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

- గిరిజారెడ్డి



ప్రకృతి వ్యవసాయంతో సాగైన దానిమ్మ తోట

వ్యవసాయం ఎంతో సంతృప్తినిస్తోంది

రైతు కుటుంబంలో జన్మించిన నాకు వ్యవసాయం ఎంతో సంతృప్తినిస్తుంది. ఖాళీగా కూర్చోకుండా నాకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్ల తోటలను పెంచాలనే ఆలోచనతో దానిమ్మతోట సాగు చేశాను. అక్కడే కొంత పొలంలో కూరగాయలు, పూల మొక్కలు వేస్తున్నాం. చేనుకు చుట్టూ కంచెగా శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను నాటాం. అవి కూడా ఏపుగా పెరిగాయి. దానిమ్మతోట ఎకరాకు ఏడు టన్నుల ప్రకారం దిగుబడి వస్తోంది. సగటున ఎకరాకు రూ.5 లక్షలు ఆదాయం వస్తోంది. ఒక్క ఏడాది తెగుళ్ల వల్ల పంట సరిగా రాక నష్టం వచ్చింది. మిగిలిన మూడు కోతల్లో దిగుబడి బాగా వచ్చింది.

- గోగు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ తహసీల్దార్

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు!

- ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రిటైర్డ్ తహసీల్దార్
- ఉద్యోగ విరమణ తర్వాత వ్యవసాయంలోకి అడుగు
- సాగులోనూ ఆదర్శం

దర్శి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఒక రిటైర్డ్ తహసీల్దార్. 35 ఏళ్లు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. స్వతహాగా రైతు కుటుంబానికి చెందిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉద్యానవన పంటలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఆయనే దర్శికి చెందిన గోగు వెంకటేశ్వర్లు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సివిల్‌సప్లై గోడౌన్ ఇన్‌చార్జిగా, సీనియర్ అసిస్టెంట్‌గా డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్‌గా అనేక సంవత్సరాలు విధులు నిర్వహించారు. 2018లో పామూరు తహసీల్దార్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పింఛన్‌తో హాయిగా జీవించే అవకాశం ఉన్నప్పటికీ అలా ఖాళీగా కూర్చోలేదు. ఆయనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వినూత్న పంటలు సాగు చేయాలనే సంకల్పంతో దానిమ్మతోట వేశారు. అందులో పూలచెట్లు, కూరగాయల సాగు కూడా చేశారు. పొలంలో బోరు వేస్తే ఒక ఇంచు నీరు మాత్రమే పడింది. నేరుగా మొక్కలకు పారించేందుకు ఆ నీరు సరిపోలేదు. పొలంలో నీటి కుంట ఏర్పాటు చేసి బోరు ద్వారా నీరు కుంటకు నింపి డ్రిప్ ద్వారా మొక్కలకు నీరు అందించే ఏర్పాటు చేశారు. దీంతో కొద్దిపాటి నీటితో నాలుగు ఎకరాల పంటకు నీరు అందించే వీలు కలిగింది. రసాయన ఎరువులు వాడితే నాణ్యత తగ్గుతుందని ప్రకృతి సేద్యం చేస్తున్నారు. ఆవుపేడ, ఆవు మూత్రం తదితర పదార్థాలతో జీవామృతం తయారు చేసి ఎరువుగా వాడుతూ దానిమ్మ తోటను ఇతర పైర్లు పెంచుతు న్నారు. దానిమ్మతోట నాటిన మూడవ సంవత్సరం నుంచి కాపు వస్తోంది. ఒక సంవత్సరం మినహ మిగిలిన మూడేళ్లు సిరులు కురిశాయి.



పొలంలో ఏర్పాటు చేసిన నీటి కుంట

భూమి ఫౌండేషన్ నుంచి

కల్చరల్ కమిషన్ వరకు..

ఏపీ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్‌గా పొడపాటి తేజస్వి



ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ఒంగోలుకు చెందిన తేజస్వి పొడపాటిని నియమిస్తూ తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం శనివారం ప్రకటించింది. తేజస్వి స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం హైదరాబాదులోని టెక్ మహీంద్ర కంపెనీలో బిడ్ మేనేజరుగా ఉద్యోగం చేస్తున్నారు. ఆమె తండ్రి వెంకట్రావు చౌదరి ఒంగోలులో ఆటోమొబైల్ విడిభాగాల వ్యాపారంలో ఉండగా, తల్లి సుజాత గృహిణిగా ఉన్నారు. తేజస్వి భర్త రఘుకుమార్ ఇండిగో పైలట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నగరాలను పోస్టర్ రహితాలుగా 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించడంతో అందులో భాగంగా 2015లో ఆమె భూమి ఫౌండేషన్‌ను స్థాపించారు. మొదట ఐదుగురుతో మొదలై సుమారు 2వేల మందికి పైగానే సభ్యులు కలిగి, పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ పథకాలను బొమ్మల రూపంలో గీసి, అందరినీ ఆకర్షించారు. మూడుసార్లు స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైన తేజస్వీని ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, పలువురు సినీ ప్రముఖులు అభినందించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపిన క్రమంలో హైదరబాదులో ఐటీ ఉద్యోగులతో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు కొత్తగా పదివేల మంది యువతను ఓటర్లుగా చేర్చారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం



ఒంగోలులోని పోలింగ్ కేంద్రంలో సూచనలు ఇస్తున్న డీఆర్వో ఓబులేశు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులపై శనివారం స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) నేతృత్వంలో కొత్తగా ఓటు హక్కు నమోదుకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఓటర్ల జాబితాలో పేర్లు మార్పులు, చేర్పులు చేసేందుకు ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించారు. శనివారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేశు పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులను అడిగి తెలుసుకోవడంతో పాటు బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. సెయింట్ థెరిసా స్కూలులోని 108, 110, 111 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు రిజిస్టర్‌ను సరిగా అమలు చేయకపోవడంపై డీఆర్వో అగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడు కేంద్రాల బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఎన్నికల సూపరిటెండెంట్‌ను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఓబులేశు హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ స్పెషల్ డ్రైవ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదన్ ఉన్నారు.

ఒకొక్కటిగా...

మాజీ ఆర్ఐ అక్రమాలు వెలుగులోకి..

- మొదలైన విచారణ
- తాగునీటి కొళాయిలకు నకిలీ వర్క్ ఆర్డర్లు



ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ ఖజానాకు చెందాల్సిన సొమ్మును కాజేసిన మాజీ ఐఆర్ఐ భాగోతం ఒకొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. గతంలో ఆయన ఆర్ఐగా పనిచేసిన క్రమంలో అంజయ్య రోడ్‌లోని ఓ భవనానికి రూ.72 వేలు పన్ను ఉండగా, వాటిని కార్పొరేషన్‌కు చెల్లించకుండా నకిలీ రసీదులిచ్చి అటు యజమానికి, ఇటు కార్పొరేషన్‌కు కుచ్చుటోపీ పెట్టిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో భవన యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో కమిషనరు డాక్టర్ కే.వెంకటేశ్వరరావు విచారణ ప్రారంభించారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ తుమ్మల భోపాల్ రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. ఆర్ఐగా ఉన్న సమయంలో తన వార్డుల పరిధిలోని అస్సెస్‌మెంట్‌లు, వాటి పన్నుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. దాంతోపాటు, అనుమానం ఉన్నచోట మరోసారి భవనాల కొలతలు వేయాలని ఆదేశించారు. అందిన సమాచారం మేరకు గత వైసీపీ హయాంలో అప్పటి నాయకుల అండదండలతో భారీగా ఇంటి పన్నులు, ఇంటి పన్ను పేరు మార్పులు, ఖాళీ స్థలాల పన్నులు, అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి భారీగా చేతివాటం చూపినట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఆ మాజీ ఆర్ఐ అఖండ్ బాధితులు ఎవరైనా ఉంటే కార్పొరేషన్ కార్యాలయంలో నేరుగా వివరాలు తెలియజేస్తూ, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని విచారణ అధికారులు వెల్లడిస్తున్నారు. దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో షాపుల అద్దెలు, పన్నుల మందింపు, కుదింపులలో అవకతవకలు ఉన్నట్లుగా సమాచారం ఉండటంతో కమిషనరు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

తాగునీటి కొళాయిల్లోనూ నకిలీ వర్క్ ఆర్డర్లు

మాజీ ఆర్ఐ చేసిన అవినీతి కేవలం రెవెన్యూ సెక్షన్‌లోకి రాకముందు ఇంజనీరింగ్ సెక్షన్‌లో తాగునీటి కొళాయిల మంజూరు విభాగంలో పనిచేసినపుడు కూడా చేతివాటం చూపారని సమాచారం. కొత్తగా ఇంటికి కొళాయి వేయించుకోవాలంటే చలానా నుంచి రోడ్ కటింగ్ ఖర్చులు, పైపుల ఖర్చులతోపాటు, కార్పొరేషన్‌కు డిపాజిట్ సొమ్ము వేలల్లోనే చెల్లించాల్సి ఉంది. వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్‌లకు అయితే లక్షల్లో చెల్లించాల్సి ఉంది. సదరు మాజీ ఆర్ఐ వాటిని తన జేబులోకి వేసుకుని కార్పొరేషన్‌కు చెల్లించకుండా ఇంటి యజమానులకు నకిలీ వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్లు సమాచారం. ఇదే విషయాన్ని అప్పట్లో ఇంజనీరింగ్ అధికారులు గుర్తించి, అధికారులకు తెలియజేయడంతోపాటు, విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. అయితే నేటికి ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం వల్లే ఇలాంటి అవినీతి వ్యవహారాలు కొనసాగుతున్నాయని పలువురు ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. కమిషనర్ కే.వెంకటేశ్వరరావు కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై సీరియస్‌గా దృష్టి సారించారు. మొత్తంగా మాజీ ఆర్ఐ అఖండ్ అవినీతిపై కార్పొరేషన్‌లో చర్చనీయాంశం కాగా, మరికొందరు అవినీతి ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

కాలానికి అనుగుణంగా భావజాల ప్రచారం మారాలి

- ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కే శ్రీనివాస్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలమాన పరిస్థితుల్లో అందుకు తగిన విధంగా హేతువాద ఉద్యమ భావజాల ప్రచారం కూడా మారాల్సిన అవసరం ఉందని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కే శ్రీనివాస్ అన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో కే శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే తరాలపై నమ్మకం, విశ్వసనీయత ఉండాలన్నారు. నేటి యువత ఆలోచనపరులుగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, అందుకు తగ్గట్లుగా అవగాహనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విధంగా ముందుకు పోయినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు దోహపదడుతుందని తెలిపారు. పౌరసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ పౌర హక్కులు దేశంలోని ప్రజలందరికి సమానంగా ఉన్నాయన్నారు. కానీ వాటిపై ప్రజల్లో అవగాహన లేని కారణంగా హేతువాద ఉద్యమంపై ఆ బాధ్యత ఉందన్నారు.

మానవ వికాస వేదిక నాయకుడు బి.సాంబశివరావు మాట్లాడుతూ మతం, భక్తి అనేవి పూర్తిగా వ్యక్తిగత విషయాలని, ఎవ్వరికి ఇష్టమైన వాటిని వారు ఇతరులకు ఇబ్బంది లేకుండా అనుసరించాలే తప్ప రాజ్యం, పరిపాలనాది అంశాల్లో వీటి ప్రమేయం ఉండరాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ భావవాద జాడ్యం అంటువ్యాధిలా ప్రబలుతున్న ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో హేతువాద భావజాల అవశ్యకత పెరిగిందన్నారు. ప్రముఖ ఉద్యమ నాయకురాలు కృష్ణప్రియ, డాక్టర్ బీరం సుందరరావు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీ కృష్ణయ్య, షర్మిల, డాక్టర్ దాసరి తిరుపతి, చంద్రశేఖర్, రంగారెడ్డి, నరసింహరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో

- ఉషారాణిని తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ఒంగోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో చిరంజీవిని నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతల్లో ఉన్న డీఎల్‌డీవో ఉషారాణిని తొలగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 584, పట్టణ ప్రాంతాల్లో 135 సచివాలయాలు ఉన్నాయి. వాటి పర్యవేక్షణను జిల్లాస్థాయిలో డీఎల్‌డీవో ఉషారాణికి గతంలో ఉన్న అధికారులు అప్పగించారన్నారు. ఇటీవల ఉషారాణి ఇన్‌చార్జి డీపీవోగా ఉండి ఉద్యోగుల బదిలీల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు కలెక్టర్ నియమించిన విచారణ కమిటీ తేల్చింది. దీంతో ఉషారాణిని ఇక్కడి నుంచి తొలగించడంతో పాటు సస్పెండ్ కూడా చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై చర్యలు ఇంకా రావాల్సి ఉండగా సచివాలయాల నోడల్ అధికారిగా కూడా ఉషారాణి ఉండటంతో ఆ బాధ్యతల నుంచి ఆమెను తప్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇక నుంచి జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ బాధ్యతలను చూడాలని జడ్పీ సీఈవో చిరంజీవికి ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

వైభవంగా గిరిప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భంగా కోటి సోమవారమైన శనివారం రోజు ఒంగోలులో శ్రీగిరి గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ గోసంరక్షణ శాలలో పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించిన వాహనంపై స్వామి, అమ్మవార్ల ప్రతిమలను ఉంచి భక్తులు సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణ చేశారు. రాజాపానగల్ రోడ్డు, కేశవస్వామిపేట, సీతారాంపురం, గద్దలగుంట కొణిజేడు బస్టాండు ద్వారా ఈ గిరిప్రదక్షిణ కొనసాగింది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు ధనిశెట్టి రామునాయుడు, నిర్వాహకులు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పౌరాణిక రంగ శిఖరం డీవీ.సుబ్బారావు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పౌరాణిక నాటక రంగంలో తిరుగులేని మహానటుడు డీవీ.సుబ్బారావు అని పలువురు కళాకారులు కొనియాడారు. డీవీ.సుబ్బారావు 35వ వర్ధంతి సందర్భంగా శ్రీవీరాంజనేయ నాట్యమండలి ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు బస్టాండ్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాటక అకాడమీ మాజీ డైరెక్టర్ ధేనువకొండ సుబ్బయ్య మాట్లాడుతూ సత్య హరిశ్చంద్ర పాత్రకు డీవీ.సుబ్బారావు పెట్టింది పేరని, ఆ పాత్ర ద్వారా ఆయనకు ఎంతో పేరుప్రఖ్యాతులు లభించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పౌరాణిక రంగస్థల నటులు ఏసురత్నం, కట్ట వెంకటేశ్వర్లు, కనుమాల రాఘవులు, మిట్నసల శాంతారావు, వెంకటరత్నం, మాకా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీ పరీక్షలకు శిక్షణ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే లోయర్, హయ్యర్ డ్రాయింగ్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు తిమ్మిరి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి పూర్తి చేసిన వారు లోయర్ పరీక్షకు, లోయర్ పూర్తి చేసిన వారు హయ్యర్ పరీక్షకు అర్హులన్నారు. 4 రోజులు 8 పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పాట్రన్ డిజైన్, ఆబ్జెక్ట్ డ్రాయింగ్, స్టిల్ లైఫ్ పెయింటింగ్, నేచర్ పెయింటింగ్, జామెట్రికల్ డ్రాయింగ్, డెకరేటివ్ లెటరింగ్ మొదలైన వాటిలో పరీక్షలు ఉంటాయన్నారు. తూనుగుంట నాగమణి, శిరీష ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని, వివరాలకు 8297090007 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ఒంగోలులో రాష్ట్రస్థాయి అండర్-11 బాల, బాలికలకు మినీ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లార్డ్ కృష్ణ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు స్థానిక మంగమూరురోడ్‌లోని లార్డ్‌కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొనదలచిన క్రీడాకారులు తమ వివరాలను ఎం. రఘురామ్, ఎ.శశిధర్‌లను 9905756789. 9398260109 సెల్‌ఫోన్ నెంబర్లలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలి

● జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై వికృత పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఈమేరకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి సతీమణి భారతిరెడ్డిపై టీడీపీ సోషల్ మీడియా అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆమె వెంట మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వెంకయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల (1970-72 బ్యాచ్) ఆత్మీయసమ్మేళనం శనివారం జరిగింది. అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి డి.రవీంద్ర ప్రస్తుత విద్యాసం వత్సరంలో ఇంటర్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థికి రూ.10వేల బహుమతిని ప్రకటించారు. ఎంఎస్.రవికుమార్, జయశీలరావు, ప్రిన్సిపాల్ శ్రావణి, ధనరాజ్, జాన్‌విల్సన్, స్రవంతి, ప్రతాప్, మాధవ, అరుణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు

మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అభివృద్ధికి రూ.43.83లక్షలు విడుదల

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిన ప్రభుత్వం



మద్దిపాడు మండలం కోవివారిపాలెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

సంతనూతలపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగనవాడీ కేంద్రాల్లో మౌలికవసతులపై దృష్టిపెట్టింది. చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోంది. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న చోట మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్టు పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల్లో మొత్తం 286 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో సొంతభవనాలు 135 ఉండగా, అద్దెభవనాలు 101 ఉన్నాయి. అద్దె లేని ప్రభుత్వభవనాలు 50 ఉన్నాయి. 9 నూతనభవనాలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. 17 భవనాలకు చిన్నచిన్న మరమ్మతుల కోసం ప్రతిపాదన పంపారు. ఈక్రమంలో తొలివిడతగా పక్కా భవనాలు ఉన్న అంగనవాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఏర్పాట్లుపై చర్యలు తీసుకుంది. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 181 చోట్ల పనుల కోసం దాదాపు రూ.42.83లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇందులో 74 కేంద్రాలకు మరుగుదొడ్లు, 107 కేంద్రాలకు తాగునీటి వసతులను కల్పించేందుకు చర్యలు మొదలయ్యాయి.

ఆర్‌డబ్ల్యూఎస్‌కు అప్పగింత

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పన పనుల ఏర్పాట్ల బాధ్యతలను ప్రభుత్వం గ్రామీణ నీటిసరఫరా శాఖకు అప్పగించింది. ఒక్కో మరుగుదొడ్డికి రూ.36వేల చొప్పున 74 పనులకు రూ.24.64లక్షలు, తాగునీటి వసతి కల్పన పనులకు రూ.18.19లక్షల మేర కేటాయించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

పనులు గుర్తించారు.. ఇక ప్రారంభించాలి
- పి.ఇవాంజిలిన్, సీడీపీవో

పక్కా భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వసతులను కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆయా పనులు వేగవంతంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి నాలుగు మండలాల్లో మరుగుదొడ్లు లేని అంగన్‌వాడీ సెంటర్లు, తాగునీటి వసతి లేని అంగనవాడీ కేంద్రాలలో పనులను ఆర్‌డబ్ల్యూస్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు గుర్తించారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. వచ్చే నెల 31వ తేదీ నాటికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యం.

మెరుగైన వైద్యసేవలను అందించాలి

● కలెక్టర్ అన్సారియా



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలు నగరం) నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం కొత్తపట్నం మండలం ఈతముక్కలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రతి నెలా కాన్పుల కోసం వచ్చే గర్భిణుల వివరాలు, వారికి వాడుతున్న మందులను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. హైరిస్కు ప్రెగ్నెన్సీ విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులకు వైద్యాధికారులే బీపీని చెక్ చేయాలన్నారు. ఆసుపత్రిలో అందించే వైద్యసేవల గురించి బోర్డు ఏర్పాటు చేసి అందరికీ తెలిసేలా ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబొరేటరీ, కాన్పుల గది, ఆఫీసు గదులను పరిశీలించారు. హాజరు పట్టీలో సంతకం చేసిన సిబ్బంది అందరూ ఉన్నారా అనే దిశగా పరిశీలన చేశారు. సిబ్బంది విధులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ గురించి తెలుసుకుని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో రికార్డుల నిర్వహణకు సంబంధించి ఏకరూపత ఉండాలని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ సూరిబాబు, తహసీల్దార్ మధుసూదనరావు, వైద్యాధికారులు శివపార్వతి, నవ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఆశశ్రీ

● అసోసియేషన్ అభినందన



ఆశశ్రీకి జ్ఞాపికను అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఒంగోలుకు చెందిన దండు ఆశశ్రీ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇటీవల విజయవాడలో జరిగిన అండర్-13లలో పాల్గొని విజయం సాధించడంతోపాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. దండు శ్రీనివాస్, ప్రమోద దంపతుల కుమార్తె ఆశశ్రీ బ్యాడ్మింటన్‌లో ఇప్పటికే పలు పతకాలు సాధించి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారు. తమ కుమార్తె జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జమ్మూ అండ్ కశ్మీర్‌లో జరిగే సబ్ జూనియర్స్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆశశ్రీ పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఒంగోలుకు చెందిన ఆశశ్రీ ఎంపిక కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. శనివారం స్థానిక లార్డ్ కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, కోచ్ అమ్మన్ గౌడ్, అకాడమీ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

విజయ్‌కుమార్ నియామకంపై హర్షం



విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో రాష్ట్ర మాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎం.ముప్పాళ్ల గ్రామానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్ నియామకం పట్ల గ్రామ సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ, తెలుగుదేశం పార్టీ నాయకులు వైకుంఠ వీరాంజనేయులు, గ్రామస్థులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ముప్పాళ్లలోని అంబేడ్కర్‌కాలనీలో పేద కుటుంబానికి చెందిన పూర్ణచంద్రరావు, అక్కాయమ్మ దంపతులకు జన్మించిన పెదపూడి విజయ్‌కుమార్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకొన్నారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ స్థాపించిన తరువాత పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మాల కార్పొరేషన్ చైర్మన్‌గా విజయ్‌కుమార్ నియామకం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళిత ఉద్యోగుల యునైటెడ్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు విజయరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సెల్వరాజ్, సుధీర్, పాలపర్తి విజేష్‌రాజ్, తిమోతి, రవికుమార్, రాయజాటి జగదీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మురళీకృష్ణకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కమ్మవారి సేవా సంఘం నూతన అధ్యక్షులుగా నియమితులైన ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణను ఏపీ విద్యార్థి యువజన జేఏసీ, దళిత యువజన జాగృతి, బహుజన విద్యార్థి సంఘం నాయకులు సత్కరించారు. స్థానిక నిర్మల్‌నగర్‌లోని మురళీకృష్ణ కార్యాలయంలో ఆయనను జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కలిసి మాట్లాడారు. శ్రీదివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ఎంతో మందికి ఆసరాగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఆర్.ప్రేమ్‌కుమార్, రాజీవ్, బత్తుల సుబ్రహ్మణ్యం, కరుణాకర్, దుడ్డు మార్క్, కార్తీక్, సూర్య, కృష్ణ, శ్రీనివాస్, లోకేష్, బొద్దులూరి ఆంజనేయులు, మండవ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

టంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, సంగమేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ టి.రాము డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 14న తలపెట్టిన ప్రజాపోరు వాల్‌పోస్టర్లను శనివారం ఆయన టంగుటూరులో ఆవిష్కరించారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.మోజస్, కె.శ్రీనివాసరావు, ఎం.యానాది, టి.పాపారావు, జి.సాల్మన్ తదతరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కోసం పోరాడాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో సమసమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో శనివారం చంద్రపుల్లారెడ్డి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. దేశంలో జమిలి ఎన్నికలు రాష్ట్రాల హక్కులను హరించడమేనని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి సీఎస్.సాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.పద్మ, చొప్పర జాలన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 26న మహాధర్నా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో శనివారం రైతు సంఘాల సమన్వయ సమితి, ట్రేడ్‌యూనియన్ జేఏసీల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ మహాధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్.లలితకుమారి, జి.వెంకటేశ్వర్లు, శ్రీను, ఎస్‌కే.మాబు, శ్రీకాంత్, కె.నాంచార్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి గ్రామోత్సవం



స్వామివారిని ఊరేగిస్తున్న స్వాములు

ఒంగోలు(రూరల్), నవంబరు9(ఆంధ్రజ్యోతి): త్రోవగుంటలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి అయ్యప్ప మాలాధారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకుడు ఉదయభాస్కర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాలధారులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల బాలికపై వృద్ధుడి అసభ్యప్రవర్తన

● పోక్సో కేసు నమోదు

కొత్తపట్నం(ఒంగోలు నగరం)నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై ఎనభై ఏళ్ల వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కొత్తపట్నంలో జరిగింది. చిన్నారిని ప్రతిరోజూ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నారు. అయితే శుక్రవారం కేంద్రానికి తీసుకుపోయిన బాలికను అక్కడే ఉన్న నాటారు కోటేశ్వరావు తన ఒళ్లో కూర్చోబెట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిని గమనించిన బాలిక బాబాయి, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టి స్కూటరిస్టు మృతి

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును ఢీకొట్టి స్కూటరిస్టు మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు శివారులోని త్రోవగుంట వద్ద శనివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక సుజాతనగర్‌కు చెందిన గుంజి పవన్‌కుమార్(45) తన స్నేహితురాలితో స్కూటర్‌పై వెళుతూ ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. ఈమేరకు రిమ్స్‌కు తరలించగా మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తాలుకా సీఐ అజయ్‌కుమార్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయాల్లో కోటిసోమవారం పూజలు



కొండపిలోని పూజలు చేస్తున్న భక్తులు

కొండపి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు శనివారం వేకువ జామునుంచే ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించారు. కొండపిలోని శ్రీగంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, కె.ఉప్పలపాడులోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వెన్నూరు, ముప్పవరం, పెరిదేపి, అనకర్లపూడి, పెట్లూరు, పెదకండ్లగుంట, ఇలవర గ్రామాల్లోని శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.

యువకుడు అదృశ్యంపై కేసు

సంతనూతలపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మైనంపాడుకు చెందిన బొట్లా ఉమేష్‌చంద్ర అదృశ్యమయ్యాడు. చీమకుర్తిలోని ప్రభుత్వహైస్కూల్లో ప్యూన్‌గా పని చేస్తున్న ఆయనకు అప్పుడప్పుడు మతి స్థిమితం సరిగా ఉండకపోవడంతో చికిత్స తీసుకుంటున్నాడు. దీనికి తోడు తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. ఈక్రమంలో ఈ నెల 4న అమ్మమ్మగారి ఊరు చలప్పాలెం వెళ్లి స్వగ్రామం వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. అయితే ఆయన తన ఇంటికి చేరలేదు. బంధువులు ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తాత పోతినేని చినఆంజనేయులు సంతనూతలపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టేషన్ రైటర్ భాస్కరరావు శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అఘాయిత్యం కేసులో పోలీసుల నిర్లక్ష్యం

● ఎట్టకేలకు కేసు నమోదు

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై జరిగిన అఘాయిత్యంపై పోలీసులు కేసు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. టంగుటూరు మండలంలో ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో పోలీసు నిర్లక్ష్యం ప్రస్ఫుటం అవుతోంది. ఈనెల 5న బాలిక స్కూలుకు వెళ్లింది. తరువాత రెండు రోజులు స్కూలుకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉంది. దీంతో తల్లి ఆరా తీయగా రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించి చిన్నారిని అడిగింది. బాలిక భయంతో పాఠశాలలో జరిగిన విషయం చెప్పింది. ఈమేరకు ఈనెల 7న ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. దీంతో వెంటనే టంగుటూరు పోలీసులకు రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులు సమాచారం ఇచ్చారు. సింగరాయకొండ సీఐ, టంగుటూరు ఎస్ఐ రిమ్స్‌కు వచ్చి బాలిక తల్లిని విచారించి జరిగిన అమానుషం గురించి తెలుసుకున్నారు. అతేకాకుండా రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు ఓ ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు పిలిపించి విచారించి వదిలేశారు. ఘటన 5 తేదీన జరిగితే విచారణ పేరుతో శనివారం వరకు కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. రెండు రోజులుగా వన్‌స్టాప్ సెంటర్‌లో బాధితురాలికి వైద్యం అందిస్తున్నారు. ఈక్రమంలో కేసు నమోదు చేశారు.

పాస్టర్స్ యూనియన్ అభివృద్ధి కృషి

నాగులుప్పలపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్స్ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని మండల పాస్టర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. యూనియన్ సమావేశం అమ్మనబ్రోలులోని షకీనా ప్రార్థనా మందిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో పాస్టర్స్ యూనియన్ కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్, ఎంపీగా తేనేటి కృష్ణప్రసాద్ గెలుపునకు చేసిన కృషి మరువలేనిదన్నారు. యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాస్టర్స్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం మనోజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎరిచర్ల డేవిడ్, కాకి సుధీర్, గడ్డం ఇస్రాయేలు, పారి దావీదు, నంబూరి భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సురేష్, ఇతర నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై అక్కడ ఏర్పాటు చేసిన చెవిరెడ్డి జన్మదినకేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాశి వెంకయ్య, వరికూటి అశోక్‌బాబు, చుండూరి రవిబాబు, కేవీ.రమణారెడ్డి, బొట్లా సుబ్బారావు, వై.వెంకటేశ్వరరావు, కఠారి శంకర్, కేవీవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

మైనంపాడు విద్యార్థుల ప్రతిభ

సంతనూతలపాడు, నంబవరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం డీవీఎల్.నరసింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో మైనంపాడు పాఠశాలకు చెందిన టి.శృతి, చరణ్‌కుమార్ ప్రతిభచూపి రాష్ట్ర జట్టకు ఎంపికయ్యారు. పీఈటీ టి.రవికుమార్, టీచర్లు అభినందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రిమ్స్‌లో బాధితురాలిని పరామర్శించేందుకు వచ్చిన సైదా మీడియాతో మాట్లాడారు. నాయకులు అనిల్‌కుమార్, ఉద్దండి మల్లికార్జునరావు, మన్నం ప్రసన్నరాజు, బొడ్డు సతీష్ పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు గాయపడిన సంఘటన శనివారం గుండ్లాపల్లి ఫ్లైఓవర్ మీద జరిగింది. ఒంగోలు నుంచి మోటార్‌సైకిల్‌పై చిలకలూరిపేట వెళ్తుండగా ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడింది. దీంతో ఒంగోలులోని ఇస్లాంపేటకు చెందిన ఖాదర్‌బాషాకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రుని రిమ్స్‌కు తరలించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఒంగోలు క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎన్‌ఎస్‌యూఐ జాతీయ ప్రధానకార్యదర్శి రాజీవ్‌గాంధీ కోరారు. శనివారం ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ డ్రగ్స్ మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం కోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలచంద్ర నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదా, నాయకులు పాల్గొన్నారు.

112 మందికి వైద్యసేవలు

మద్దిపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇనమనమెళ్లూరులో శనివారం మద్దిపాడు వైద్య ఆరోగ్యశాఖ, కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కిమ్స్ హాస్పిటల్ జనరల్ డాక్టర్ రామాంజనేయులు 112మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొండపి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా శనివారం మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని కె.ఉప్పలపాడు, వెన్నూరు, చోడవరం, ముప్పవరం పెరిదేపి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పి.మురళి, ఎలక్షన్ డీటీ కె.డేవిడ్‌రాజు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.

ఎనిమిది మద్యం సీసాల పట్టివేత

పుల్లలచెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐటీవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గూడూరి సాల్మన్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

● నిర్వాహకుల అరెస్టు

గిద్దలూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకులను, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కొప్పులవారి వీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో అర్బన్ సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో దాడి చేసి నిర్వాహకులు బోయ నాగరాజు, సాలమ్మలతోపాటు ఇద్దరు విటులు, ఇద్దరు బాధితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

హామీల అమలుకు నిధులు కేటాయించాలి

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి కోరారు. శనివారం పొదిలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశ్చిమ ప్రాంతాన్ని కరువు నుంచి శాశ్వతంగా విముక్తి చేయడానికి ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి కేటాయింపులు చేయాలన్నారు. పొదిలి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టులో చేర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గుండ్లకమ్మ, పాలేటిపల్లి, గుండ్లమోటు, మొగిలిగుండాలు, యర్రోఓబనపల్లి, పీబీ చానల్ తదితర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్‌లలో పరిశ్రమల ఏర్పాటుకు తగిన నిధులు మంజూరు చేయాలన్నారు. ఒంగోలు రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నడికుడి రైల్వేలైన్ త్వరితగతిన పూర్తి చేసేందుకు కేంద్రంతో మాట్లాడాలని సూచించారు. ఒంగోలు, చీమకుర్తి, పొదిలి, కనిగిరి, గిద్దలూరు, దర్శి మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు మంత్రి నిధుల కేటాయింపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్, నాయకులు నర్రా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి

గిద్దలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ కు, డ్రైనేజీలో పూడిక తీసేందుకు సమస్యలు కలిగిస్తున్న ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, ఈ నెల 12వ తేదీలోగా స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలన్నారు. లేనిపక్షంలో 13వ తేదీన తమ సిబ్బందితో ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు.

కంభం మార్కెట్‌యార్డు తలరాత మారేనా ?

- అక్కరకు రాని రైతు బంధు
- పథకం అమలుపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం
- ప్రయోజనాలు కోల్పోతున్న రైతులు

కంభం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం అక్కరకు రాకుండా పోతోంది. గత ప్రభుత్వం, అధికారులు రైతుల్లో అవగాహన కల్పించక పోవడం, గోదాములు ఉన్నా వినియోగించుకోక పోవడంతో పథకం మూలకు చేరింది. కంభం వ్యవసాయ మార్కెట్ పరిధిలో గోదాములు ఉన్నా ప్రయోజనం శూన్యం. వీటిలో రైతులెవరూ పంట దిగుబడులను దిగుమతి చేసుకోవడం లేదు. కావున ఈ పథకం ద్వారా వచ్చే ప్రయోజనాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం మార్కెట్‌యార్డులపై దృష్టిసారించింది. నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌యార్డులను గుర్తించి అవి రైతులకు ఉపయోగపడేలా చేస్తామని చెబుతోంది. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని కంభం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ ప్రాంత రైతులు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కంభం వ్యవసాయ మార్కెట్ పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించని పక్షంలో రైతులు పంటలను నిలువ చేసుకునేందుకు కంభంలో రూ.40 లక్షలతో రెండు గోదాములు నిర్మించారు. ఏటా రైతులు తమ ఉత్పత్తులను ఈ గోడౌన్లలో నిల్వ చేసుకోవచ్చు. అయితే వీటి గురించి అధికారులు గాని, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో సివిల్ సప్లై వారు లీజ్‌కు తీసుకుని రేషన్ సరుకులు నిలువ చేసుకుంటున్నారు.

ఇవి ఉపయోగాలు

గోదాములలో నిలువ ఉంచి పంట విలువలో 75 శాతం రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకోవచ్చు. అలాగే గరిష్ఠంగా 50వేల వరకు రుణం పొందే అవకాశం ఉంది. మొదటి 3 నెలల కాలానికి వడ్డీ వర్తించదు. ఆ తరువాత 5వేలకు 5శాతం, 10వేలకు 6శాతం, 15వేలకు 8శాతం, 50వేలు లోపు అయితే 10శాతం వంతున వడ్డీలు చెల్లించాలి. కానీ కంభం ఏఎంసీ పరిధిలో ఈ పథకం అసలు అమలులో లేదు.



కంభంలో అలంకారప్రాయంగా ఉన్న గోదాములు

దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది.

కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తే రైతుల కష్టాలు తీరుతాయి

కంభంలో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వానికి వినతిపత్రాలు అందచేశారు. ఈ ప్రాంత తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన శనగ, మిరప, కంది, పెసర పంటలు పండించుకోవలసి వస్తున్నదని, వాటి గిట్టుబాటు లేని సమయంలో దిగుబడులు నిలువ చేసుకునేందుకు వీలుగా కంభం మార్కెట్‌యార్డులో కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా పంచాయతీ రాజ్ రహదారులు

నిత్యం ఇబ్బంది పడుతున్న కుందంపల్లె గ్రామస్థులు

పుల్లలచెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు మండలంలోని పలు పంచాయతీయరాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వర్షం కురిసినప్పుడు రోడ్లు బురద మాగాణిని తలపిస్తోంది. ప్రధానంగా మండలంలోని రంగనపాలెం-కుందంపల్లి,చాపలమడుగు-సి.కొత్తపల్లి, మానేపల్లి-అయ్యాగానిపల్లి, మానేపల్లి రోడ్డు, రెంటపల్లి పంచాయతీరాజ్ రోడ్డుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

మండలంలోని కుందంపల్లి పంచాయతీ రాజ్ రోడ్డుకు గత టీడీపీ ప్రభుత్వం 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మంజూరు చేసింది. అయితే వెంటనే 2019లో ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఎక్కడి పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి మంత్రి సురేష్ 2020లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆ రోడ్డుకు మట్టి పోసిన పాపన పోలేదు. దీంతో కుందంపల్లి గ్రామస్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో రహదారి అభివృద్ధిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు, కొత్తరోడ్ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తుండడంతో ఈ రహదారిని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు. తక్షణమే శాశ్వత రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చిప్స్ పరిచి వదిలేసిన కుందంపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో మండలాల వారిగా సమావేశమయ్యారు. ఇటీవల మొదలైన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త సభ్యత్వం తీసుకునేలా ముఖ్యనాయకులు పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదులో అనేక ప్రయోజనాలు ఉన్నాయని కార్యకర్తలకు వివరించాలన్నారు. గతంలో కంటే ఎక్కువ శాతం సభ్యత్వ నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆరు మండలాల పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కోటిసోమవారం

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో భాగంగా శనివారం కోటి సోమవారాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు శివాలయాల్లో తెల్లవారుజామునుండే భక్తులు శివ నామ స్మరణతో మారుమ్రోగాయి. ఈసందర్భంగా నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో జమ్మిచెట్టుకు కార్తీక దీపాలు వెలిగించి మహిళలు భక్తిని చాటుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పార్వతీసమేత నిర్మామహేశ్వర స్వామితోపాటు కైలాసనాథుడు, భీమేశ్వర, శ్యామలాదేవి, కామాక్షిదేవి, త్రిపుర సుందరీదేవి, నగరేశ్వరస్వామి, నాగేంద్రస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం మొత్తం మహిళలు, మాలధారణ స్వాములు శివనామస్మరణం మారుమోగింది.



నిర్మమహేశ్వరుడి చెంత దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడు మండల యూటీఎఫ్ నూతన కమిటీని మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బట్టగిరి చెన్నారెడ్డి, ఆర్‌పీటీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా రజనీకాంత్, సహాధ్యక్షురాలుగా రజనీ, కోశాధికారిగా కేపీ శ్రీనివాసులు, మహిళా కమిటీ కన్వీనర్ ఎస్.మహాలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్, నాయకులు వీరారెడ్డి, శ్రీరాములు, పాపయ్య, అబ్దుల్ హై, ఉమామహేశ్వరి, చిన్నస్వామి, బాబునాయక్, చలమయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం స్వామి వారికి ద్వాదశ ఆరాధన, చక్రస్నానం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వందలాది మంది భక్తుల నడుమ రకరకాలపూలతో అభిషేకాలు చేశారు. ఉదయం నుండి స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. పలువురు దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు అధ్యక్షులు శేషగిరి, కార్యదర్శి భాస్కర్, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బాలికల వసతిగృహంలో న్యాయసేవాసదస్సు

పొదిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా శనివారం బీసీ బాలికల వసతిగృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, మండల సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వి.ప్రత్యూష పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలకలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, ఫోక్స్ చట్టం గురించి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే జాతీయ న్యాసేవాధికార సంస్థ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

పాతాళ నాగేశ్వరుడిని దర్శించుకున్న విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు పట్టణంలోని దక్షిణకాశీగా పేరొందిన చారిత్రక పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానాన్ని ఒంగోలుకు చెందిన ఏకేవీకే విద్యార్థులు సందర్శించారు. పాతాళంలో ఉన్న నాగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే పార్వతి అమ్మవారిని సైతం దర్శించుకున్నారు. దేవాలయ ప్రాముఖ్యత గురించి, చారిత్రక విశేషాల గురించి ప్రధాన అర్చకులు అనిల్‌శాస్త్రి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో శ్రీనివాసులు, సమరత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ ఎస్.వి. కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకొనేందుకు హాజరైన విద్యార్థులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుండికానది తీరాన వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి శనివారం మాసకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని అర్చకులు ఏవీకే నరసింహాచార్యులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలు స్వీకరించారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా మొర్రి పిచ్చయ్య

గిద్దలూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా శనివారం పలువురిని ఎంపిక చేసింది. గిద్దలూరు మండలంలోని పొదలకొండపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేశారు. విద్యార్థులకు అత్యాధునిక బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు సొంత నిధులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. మార్కాపురం డివిజనల్ బయోమెట్రిక్ నోడల్ ఆఫీసర్‌గా ఇహెజర్ మండల నోడల్ పర్సన్‌గా, డీసీఆర్ నోడల్ పర్సన్‌గా, మండల మానిటరింగ్ టీమ్ లీడర్‌గా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉంటున్నారు. ఎంతోమంది ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉంటున్నారు. తన వృత్తిధర్మాన్ని పాటిస్తూ సమాజ సేవ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నారు. అవార్డు రావడంపై మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యాబోధనే తనను టీచర్‌గా సామాజిక సేవకునిగా తీర్చిదిద్దిందని తెలిపారు.

ఉర్దూ భాషాభివృద్ధికి సహకరించాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ బాష, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కవి, రచయిత డాక్టర్ మహమ్మద్ ఇక్బాల్ జయంతిని, అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రుటా నాయకులు షేక్ అన్వర్ బాషా, సయ్యద్ సమీవుల్లా, పఠాన్ హిదయతుల్లా, షేక్ గుల్షాన్ పీరా, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు అక్రమం

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆరోపణ

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో గురువారం నిర్వహించిన ఆక్రమణల తొలగింపు అక్రమమని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆరోపించారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన వారి భవనాలను లక్ష్యంగా చేసుకుని ఆక్రమణల తొలగింపు చేపట్టారన్నారు. మురుగు కాలువకు లోపల వున్నా కొన్ని భవనాలను ఎందుకు పగలగొట్టారని అని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి కోసం, ట్రాఫిక్ సమస్య తీర్చడానికి, ఆక్రమణల తొలగింపునకు తాము వ్యతిరేఖంగా కాదన్నారు. కేవలం కొందరిని లక్ష్యంగా చేసుకుని భవనాలను పడగొట్టడం పద్ధతి కాదన్నారు. అంతే కాక ఉపాధి కోల్పోయిన చిన్నపాటి వీధి వ్యాపారు లకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ షంషీర్ అలీబేగ్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్‌గా జీవీ రెడ్డి

● మార్కాపురం ప్రాంతవాసికి అవకాశం

మార్కాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్‌గా జీవీ.రెడ్డి నియమితులయ్యారు. ఈయన స్వగ్రామం మార్కాపురం మండలం బొడిచెర్ల. కూటమి ప్రభుత్వం శనివారం విడుదల చేసిన 59 కార్పొరేషన్ ఛైర్మన్ల జాబితాలో ఆయన చోటు దక్కించుకున్నారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఆడిటర్‌గా పనిచేస్తూ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీవీ డిబేట్‌లలో అధికార పార్టీకి ధీటుగా సామాజిక, రాజకీయ అంశాలపై మాట్లాడారు. అంతేకాక పార్టీకి సంబంధించిన కార్యకలాపాల్లో చురుగ్గా ఉండేవారు. పార్టీ అధిష్టానం జీవీ రెడ్డి ప్రతిభను గుర్తించి కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఛైర్మన్‌గా జీవీ రెడ్డి నియామకం పట్ల పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గొట్టిపాటి రవికుమార్ జన్మదినం



కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, కడియాల రమేష్ తదితరులు

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు కడియాల రమేష్ జన్మదిన వేడులకను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, కడియాల రమేష్ తదితరులు పుట్టినరోజు కేకులను కట్‌చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, పూసల చిన్నయ్య, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, బొట్ల కోటేశ్వరరావు, గొర్రె సుబ్బారెడ్డి, పుల్లలచెరువు చిన్నా, కల్లూరి సుబ్బు, సాని సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

దొనకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తుందని తహసీల్దార్ రమాదేవి చెప్పారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పోలింగ్‌బూత్‌ల వద్ద బీఎల్‌వోల పనితీరును శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారన్నారు. నమోదుకు ఫారం-6, డబుల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లకు సంబందించి ఫారం-7, సవరణల కోసం ఫారం-8 దాఖలు పర్చాలన్నారు. ఈసందర్భంగా బీఎల్‌వోలకు తగు సూచనలు చేశారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కనిగిరి, నవంబరు 9: పట్టణంలోని జీపు స్టాండ్ వద్ద ఉన్న హరిజన పాలెంలో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకుటూరి చెన్నకృష్ణ (40) పదిహేనేళ్ల క్రితం మార్కాపురం నుంచి కనిగిరి వచ్చి నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. ఈక్రమంలో భార్య, పిల్లలు ఇంట్లోలేని సమయంలో మందు టాబెట్లు మింగాడు. గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే అండర్‌పాస్‌తో అగచాట్లు

- నీటిలోనే రాకపోకలు
- మొరాయిస్తున్న వాహనాలు
- మురుగునీటి వ్యవస్థ

సక్రమంగా లేకనే సమస్యలు

కురిచేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగాయపాలెం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన రైల్వే అండర్ పాస్‌తో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. ఇందులో నీరు నిలబడుతుండటంతో వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. గుంటూరు - గుంతకల్ రైల్వే మార్గంలో ప్రమాదాలను తగ్గించేందుకు గేట్‌ల స్థానంలో అండర్ పాస్‌ల నిర్మాణాన్ని రైల్వే శాఖ చేపట్టింది. ఈక్రమంలో వెంగాయపాలెం గ్రామం వద్ద అండర్ పాస్ నిర్మాణం చేశారు. అయితే, మురుగునీరు పోయే వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం, గోడల గుండా నీరు రాకుండా ఆపేలా రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో పక్కన పొలాల్లోని నీరు గోడల గుండా దారగా వస్తున్నాయి. ఆనీరు బయట కు పోయే మార్గంలేక అండర్ పాస్‌లోనే నిలబడిపోతుంది. మోకాళ్ళ లోతు నీటిలో వాహనాలు ఆగిపోతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవు తుండటంతో వేల రూపా యల ఖర్చు అవుతుందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ పనులు పూర్తయ్యాయని చేతులు దులుపుకుంది. తమకు మాత్రం అగచాట్లు తప్పడంలేదని ప్రయాణికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ స్పందించి అండర్ పాస్‌లో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంగాయపాలెం వద్ద రైల్వే అండర్ పాస్



అండర్ పాస్ గోడల నుంచి కా కారుతున్న నీరు

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయాధికారి భరత్‌చంద్ర



వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్న న్యాయాధికారి భరత్‌చంద్ర

కనిగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా, ఏఇతర కారణాల వల్లనైనా వెనుకబడిన వాళ్ళకి న్యాయం అందకుండా ఉండే పరిస్థితులను రూపుమాపడానికి న్యాయ సేవాధికార చట్టాన్ని నవంబరు 9, 1995 లో తీసుకొచ్చినట్టు చెప్పారు. సుప్రింకోర్టు నుంచి దిగువ స్థాయి కోర్టు వరకు న్యాయసేవలు ఉచితంగా పేదవారికి అందిస్తున్నట్టు చెప్పారు. పేదవారికి ఉన్న వివాదాలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం తరుపున ఉచితంగానే న్యాయవాదిని నియమిస్తామన్నారు. సంబంధిత కేసులను న్యాయస్థానంలో నడిపించుకోవటానికి అవకాశం కల్పించారన్నారు. లోక్ అదాలత్, న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు, హెల్ప్‌లైన్ 15100 నెంబర్‌పై అవగాహన కల్పించారు.

సదస్సులో మానవతా సంస్థ ద్వారా పేద దివ్యాంగులకు న్యాయాధికారి చేతులమీదుగా వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది షేక్ అబ్దుల్‌గఫార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్, వైస్ ప్రెసిడెంట్ బాలనారాయణ, న్యాయవాదులు షేక్ మహ్మద్‌వలి, పాశం పిచ్చయ్య, సాదు కొండలరావు, మానవతాసంస్థ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు, టి.శ్రీనివాస్, పసుపులేటి అరుణోదర్, గుడ్‌హెల్ప్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కురిచేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కురిచేడు - దర్శి రోడ్డులో పెనగమూరు సమీపంలో బోదనంపాడు గ్రామం నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని అదేమార్గంలో వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కారు కొద్దీదూరం వెళ్లి రోడ్డుపక్కన గుంతలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పుల్లలచెరువు సత్యనారాయణతో పాటు మరో ఇద్దరికి గాయాలయినట్లు సమాచారం. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో దర్శి సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు.





చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతా!

- రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

ముండ్లమూరు, నవంబరు 9: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తేవటమే కాక నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ చైర్మన్‌గా నియమితులైన మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పార్టీ అధికారంలేని ఐదు సంవత్సరాల కాలంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగిందన్నారు. కార్యకర్త స్థాయి నుంచి నాయకుడు వరకు చంద్రబాబు గుర్తించి పదవులు పంపిణీ చేశారన్నారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ఐటీ శాఖమంత్రి లోకేశ్‌కు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడుకు, బీజేపీ నాయకులకు శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామంలో సంబరాలు

మండలంలోని పూరిమెట్లకు చెందిన తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డికి నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ చైర్మన్‌గా నియమితులు కావటంతో స్వగ్రామంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాణసంచా కాల్చటంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు మాజీ ఎంపీపీ కోడెల మస్తాన్‌రావు పంచి పెట్టారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ఒగూరి నాగేశ్వరరావు, నిడిగంటి నారాయణ, నర్సారెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతపల్లి వెంకటస్వామి, రమణాల ఏడుకొండలు, చొప్పరపు నాగేశ్వరరావు, పయ్యావుల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాలకు, ఆధార్ కార్డుకు ఈకేవైసీ చేయించని లబ్ధిదారుల ఇళ్లవద్దకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వెళ్లి చేయాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం స్థానిక గ్యాస్ ఏజెన్సీని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిలిండర్ల కోసం వచ్చిన మహిళా లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లు విక్రయించుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిలిండర్ పొందిన 48 గంటల్లో ప్రభుత్వం మీ బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేస్తుందన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం ఏజన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిలిండర్ల పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మాచర్ల, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల సమ్మర్ రివిజన్‌కు అందరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్వరరావు

దర్శి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు అందరూ సహకరించాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015 ఓటర్ల జాబితా రివిజన్ కార్యక్రమంలో బాగంగా ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టినట్టు చెప్పారు. శని, ఆదివారాలు రెండు రోజులు బీఎల్‌వోలను పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతీ యువకులందరూ పేర్లు చేర్చుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వివిధపార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు చేస్తున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలిం చారు. బీఎల్‌వోలు అందరూ అందుబాటులో ఉండి ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేలా పనిచేయాలన్నారు.

ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎల్.లోకేశ్వరరావు అన్నారు. శనివారం ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదన్నారు. కార్యక్రమంలో ఇన్ చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ ఎంవీఎస్ఆర్ మూర్తి, వీఆర్వోలు కావూరి దయానందం, బ్రహ్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రామారావు, ఎస్ఐ నాగరాజు

ముండ్లమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని సీఐ వై.రామారావు హెచ్చరించారు. శనివారం శంకరాపురంలో గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థులందరూ కలసిమెలసి జీవించాలన్నారు. ఒకసారి గొడవలు పడి పోలీసుస్టేషన్ వరకు వచ్చి కేసులు పెట్టుకుంటే ఆ గ్రామం ఎంతో నష్టపోతుందన్నారు. చిన్నచిన్న ఆవేశాలతో గొడవలు పడి జైలు పాలు కావద్దన్నారు. రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తులను గుర్తించి వారికి తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం కోసం పాటుపడాలన్నారు. గతంలో ఫ్యాక్షన్ వల్ల ఇబ్బందిపడ్డ గ్రామాలను గుర్తు చేసుకోవాలన్నారు. చిన్నపాటి విషయం జరిగినా బైండోవర్లు పెట్టి కోర్టుల్లో హాజరు పరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.నాగరాజు, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న మల్లేశ్వరస్వామి

తాళ్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ సన్నిధిలోని శ్రీపార్వతీ సమేత మల్లికార్జునస్వామి ప్రథమ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయపూజారి నడిపల్లి సాంబసదాశివప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలోని అత్యంత పర్వదినం, శివునికి ఇష్టమైన రోజు కోటి సోమవారం రోజు వార్షికోత్సవం రావటంతో శివాలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయధర్మకర్త సన్నెబోయిన వీరాంజనేయులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కార్తీక సోమవారం సందర్భంగా లక్కవరం చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో పూజారి నడిపల్లి సాంబసదాశివప్రసాదరావు ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేకపుష్పాలతో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాళ్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లూరు, శివరాంపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు శనివారం పరిశించారు. ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు పరిశీలన నిమిత్తం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రచురితం కాబోయే ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బూత్‌లెవల్ అధికారులకు తగు సూచనలు చేశారు. మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటివరకు 37,736 ఓటర్లు నమోదయినట్లు వెల్లడించారు. అందులో పురుషులు 19,040 మంది, మహిళలు 18696 మంది ఓటర్లుగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లూరు డిప్యూటీ తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

షరీఫ్ నియామకంపై హర్షం

పామూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా ఎంఎం షరీఫ్‌ను నియమించడం పట్ల టీడీపీ పామూరు మైనార్టీ నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. క్యాబినేట్ హోదా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నియమించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వక్తంచేసిన వారిలో టీడీపీ జిల్లా కమిటీ నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, షేక్ షంషూర్, ఆర్‌ఆర్ రఫి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, షేక్ గౌస్‌బాషా, కావేరి రసూల్, ముబినా మౌలాలి, హాజీగౌస్, పులి నాయబా, పత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, షేక్ నాయబ్‌రసూల్, అస్లీం, సయ్యద్ ఖాదర్‌బాష, సుబాని తదితరులు ఉన్నారు.

రాయితీపై సరుకుల అందజేత

పామూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కట్టకిందపల్లి గ్రామంలో రేషన్ షాపు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం, చక్కెర, లాంటి వస్తువులతో పాటు ఆగ్రామ డీలర్, టీడీపీ నాయకుడు అల్లు వెంకటేశ్వర్లు రాయితీపై కంది పప్పు, వంట నూనె అందజేస్తున్నారు. మార్కెట్ ధర కన్నా రూ.10 రాయితీపై కార్డుదారులకు అందజేస్తున్నారు. నవంబరు నెలలో ప్రభుత్వం కార్డు దారులకు బియ్యం, పంచదార తో పాటు కందిపప్పు సరఫరా చేయగా, వంట నూనెను రాయితీతో శనివారం పంపిణీ చేశారు.

వ్యవసాయ కళాశాలలో వైద్య శిబిరం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లె గ్రామంలో గల కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పామూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు నియమ నిబంధనలు పాటించాలని పామూరు సెల్‌పాయింట్ యూనియన్ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఉల్లంఘిస్తే యూనియన్ పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం సెల్ పాయింట్ యూనియన్ సభ్యత్వ నమోదు సమావేశం అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్, కె.మాల్యాద్రి మాట్లాడుతూ యూనియన్ సభ్యులు ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో సభ్యులు విజయ్, శ్రీకాంత్, షబ్బీర్, పవన్, నాగూర్, నరేష్, చైతన్య, ప్రకాష్, మోహన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై సీపీఎం పోరు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం ప్రజాపోరు కార్యక్రమం చేపట్టినట్టు ఆపార్టీ మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకుసంబంధించి సీఎస్‌పురంలో శనివారం కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి, ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేస్తే తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు వలసల నివారణ చేయవచ్చునన్నారు. ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రత్నారెడ్డి, పొదిలి నరసింహులు, బి.పెద్దయ్య, ఏ. నారాయణ, పి.నాగేశ్వరరావు, పి.తిరుపతమ్మ, ఈ.తిరుపతయ్య, వై.నాగమల్లేశ్వరరావు, వి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు హైందవ సదస్సు

పామూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో హైందవ శంఖారావం సన్నాహక సదస్సు ఆదివారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు పామూరు మండలంల నుంచి భారీగా జన సమీకరణ జరిపేందుకు సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని పది బాటిళ్ళను సీజ్ చేసినట్లు దర్శి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలను నిరోధించే క్రమంలో దర్శి ఎక్సైజ్ సీఐ తమ సిబ్బందితో కలసి మండలంలోని పడమర గంగవరం గ్రామంలో శనివారం పరిమిసెట్టి శ్రీను అనే వ్యక్తి షాప్‌పై దాడి చేసి పది క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడులలో ఎస్సై ఆర్.సత్యనారాయణ, కానిస్టేబుళ్ళు శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.





చేర్రెడ్డి మంజులారెడ్డి ఉండవల్లి శ్రీదేవి సజ్జా హేమలత చిలకలపూడి పాపారావు



నైట్ షెల్టర్లు.. నామమాత్రమే

చలికి వణుకుతూ.. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఆకలితో అలమటిస్తూ.. రోగాలతో అల్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాల భయంతో ఎందరో అభాగ్యులు, అనాథలు, దిక్కులేని వారు ఎందరో రోడ్డు పక్కల ఆశ్రయం పొందుతూ ఉంటారు. పగలు ఏదోలా కాలం గడిపినా రాత్రిళ్లు వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆశ్రయం కల్పించి ఆదరించాలి. సుప్రీంకోర్టు కూడా గతంలో నిరాశ్రయుల ఆశ్రయం కోసం ప్రతీ మున్సిపల్ కేంద్రంలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పట్టణాల్లో కొన్ని దగ్గర్ల పేరుకు మాత్రమే నిరాశ్రయుల వసతిగృహాలను ఏర్పాటు చేయగా, కొన్ని దగ్గర్ల అసలు వాటి ఊసే లేదు. మున్సిపాలిటీల్లో కొన్ని దగ్గర్ల మెప్మా ఆధ్వర్యంలో మరికొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నైట్‌షెల్టర్లు కొనసాగుతున్నా అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఇక్కడ ఆశ్రయం పొందే అభాగ్యుల కంటే రోడ్లపై ఉండేవారే వందల్లో ఉంటున్నారు. వారం రోజులుగా వీస్తున్న చలి గాలులకు ఇబ్బందులు పడుతూ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రిళ్లు ఎందరో నిద్రిస్తున్నారు.



సౌకర్యాలు వినియోగించుకునే వారు లేక ఖాళీగా ఉన్న రేపల్లెలోని నిరాశ్రయుల వసతి గృహం

- కనీస సదుపాయాలు కరువు
- నిర్వహణకు నిధుల కొరతని నిర్లక్ష్యం
- రోడ్ల పక్కన, డివైడర్లపై నిరాశ్రయుల ఆశ్రయం
- నిద్రకు.. ఆకలికి అలమటిస్తున్న అభాగ్యులెందరో
- చాలాప్రాంతాల్లో మూత.. కొన్నిచోట్ల పేరుకు మాత్రమే ఏర్పాటు
- సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా పట్టించుకోని పుర పాలకులు, అధికారులు



వినుకొండ రైల్వే స్టేషన్‌లో..

ఖాళీగా దర్శనమిస్తున్న బాపట్ల రైలుపేటలో నైట్‌షెల్టర్



(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

గూడు లేని.. ఆదరించే వారు లేని అభాగ్యుల ఆశ్రయం కోసం పట్టణాల్లో నైట్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఆశ్రయం కోసం వచ్చే వారికి భోజనం అందించడంతో పాటు రాత్రిళ్లు నిద్రించే సౌకర్యాలు కల్పించాలి. అయితే జిల్లాలోని మున్సిపాల్టీల్లో పేరుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పేరుకు నైట్‌షెల్టర్లు ఉన్నా అక్కడ ఆశ్రయం పొందేందుకు అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. సరైన సౌకర్యాలు లేవని, అపరిశుభ్రత తదితర కారణాలతో కొందరు, ఈ తెలియక కొందరు నిరాశ్రయుల వసతిగృహాలకు ఆదరణ తగ్గుతుంది. దీంతో చాలామంది రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లపైనే చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నైట్‌షెల్టర్లపై అవగాహన పెంచి వాటి సేవలను నిర్భాగ్యులందరికీ అందేలా చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యాచకులు, ఆదరించేవారు లేని ఒంటరివారు, ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే వారు దుర్భర పరిస్థితుల మధ్య ఫుట్‌పాత్‌లు, అండర్ పాస్‌ల్లో, పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. దాతలు ఎవరైనా భోజనం అందిస్తూ తింటూ, వారిచ్చే దుప్పట్లు కప్పుకుని రోడ్లపైనే కాలం గడుపుతుంటారు. ప్రతీ మున్సిపాల్టీలోనూ నైట్ షెల్టర్లు కొనసాగాల్సి ఉన్నా అధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి పట్టించుకోవడంలేదు. కొన్ని దగ్గర్ల నిధుల కొరతతో మూసేశారు. షెల్టర్ జోన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలాదగ్గర్ల ఈ వసతిగృహాలు మూతపడ్డాయి. రోడ్లపై ఆశ్రయం పొందేవారు వ్యక్తిగత శుభ్రత లోపించి రోగాల బారిన పడుతున్నారు.

(మిగతా 6వ పేజీలో..)

దాతల ఔదార్యంతో దుప్పట్లు

వర్షాకాలం, చలికాలంలో చలిగాలులకు రోడ్లపై నిద్రించే నిరాశ్రయులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. దోమలతో కంటి మీద కునుకు ఉండదు. రోడ్డు పక్కన చలికి వణుకుతూ కనిపించే వారిని చూసిన వారు మానవత్వంతో స్పందించి ఆహారం, దుప్పట్లు వంటివి అందజేస్తుంటారు. ఇలాంటివారు అందచేసే దుప్పట్లతో చలిగాలులు, దోమల నుంచి రక్షణ పొందుతుంటారు. మళ్లీ కొత్తగా ఎవరైనా దాతలు ఇచ్చే వరకు గతంలో అందజేసిన దుప్పట్లతోనే కాలం వెళ్లదీస్తూ ఉంటారు.

అయ్యో పాపం

గతంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కుల్లో నిర్భాగ్యులు రాత్రిళ్లు ఆశ్రయం పొందేవారు. అధికారులు వీరిని రానీయకుండా కట్టడి చేస్తున్నారు. ఎవరైనా పార్కులు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో నిద్రిస్తున్నా పోలీసులు తరుముకుంటున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీరంతా రోడ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇలా రోడ్లపై ఆశ్రయం పొందే పురుషుల కంటే మహిళలు, బాలికల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నిరాశ్రయుల్లో వృద్ధులు ఎక్కువగా ఉండడంతో వారి యాతన చెప్పనలివి కాకుండా ఉంది.

పదవుల పండుగ

- 3 జిల్లాలు.. 9 మందికి పదవులు
- కష్టానికి, త్యాగానికి అధిష్ఠానం గుర్తింపు
- గుంటూరు నుంచి శ్రీదేవి, డేగల, మన్నవ, చిల్లపల్లిలకు చాన్స్
- పల్నాడు జిల్లా నుంచి మంజులారెడ్డి, గోనుగుంట్లకు అవకాశం
- బాపట్ల నుంచి పాపారావు, రాజశేఖర్‌బాబు, హేమలతలకు అందలం

గుంటూరు, బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న నాయకులు పండుగ చేసు కుంటున్నారు. ఐదు నెలలుగా ఎప్పుడు.. ఎవరికి.. ఎలా పదవులు వస్తాయోనని ఎదురుచూస్తోన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తీపికబురు చెప్పారు. సెప్టెంబరులో ప్రకటించిన తొలి జాబితాలో కొందరికి అవకాశం దక్కగా మిగిలిన వారు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చంద్రబాబు పెద్దసంఖ్యలో నామినేటెడ్ పదవులను ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో తొమ్మిది మందికి పదవుల పందేరం జరిగింది. కష్టనష్టాలకోర్చి, త్యాగాలకు వెనుదీయక పార్టీ కోసం పని చేసిన నేతలు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తగిన గౌరవాన్ని కల్పిస్తోంది. తాజా జాబితాలో గుంటూరు జిల్లా నుంచి తాడికొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, మంగళగిరికి చెందిన జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన టీడీపీ మహిళా నేత మంజులారెడ్డి, నరసరావుపేటకు చెందిన టీడీపీ దివ్యాంగ విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లాలో రేపల్లెకి చెందిన చిలకలపూడి పాపారావు, బాపట్లకు చెందిన టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబు, చీరాలకి చెందిన టీడీపీ నాయకురాలు సజ్జా హేమలతలను పదవులు వరించాయి. కాగా సార్వత్రిక ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల దాడులు, దౌర్జన్యాలకు ఎదురు నిలిచి తీవ్రంగా గాయాలపాలైన మంజులారెడ్డికి చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బాపట్ల ఎంపీ సీటు అభ్యర్థిత్వాన్ని ఆశించిన సలగల రాజశేఖర్‌బాబు కొన్ని సమీకరణాల నేపథ్యంలో పార్టీ ఆయనకు సీటు ఇవ్వలేకపోయింది. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. రెండో జాబితాలో బాపట్ల జిల్లాలో ముగ్గురిని నామినేటెడ్ పోస్టులు వరించగా రెండు టీడీపీ, ఒకటి జనసేన నేతలు దక్కించుకున్నారు. వీరిలో బాపట్లకు చెందిన సీనియర్ టీడీపీ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సలగల రాజశేఖరబాబును కీలకమైన బావుడా చైర్మన్ పదవి వరించింది. చీరాలలో టీడీపీ గెలుపులో తనవంతు సహకారం అందించిన బీసీ(దేవాంగ) సామాజికవర్గానికి చెందిన సజ్జా హేమలతకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చింది. ఇక రేపల్లెకు చెందిన మత్స్యకార సామాజికవర్గానికి చెందిన చిలకలపూడి పాపారావుకు కూడా పదవి దక్కింది. ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పదవి డాక్టర్ పెదపూడి విజయ్‌ను వరించగా ఈయన ప్రస్తుతం పర్చూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కానీ ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో పార్టీ ప్రకటించిన జాబితాలో ఈ పదవిని ఒంగోలు కోటాలో చూపించారు.

ఇప్పటికే పలువురికి పదవులు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక విడతలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించింది. ఆ తర్వాత టీటీడీ పాలక మండలిలో పలువురుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పలువురికి పదవులు దక్కాయి. సెప్టెంబరు 24న తొలివిడుత నామినేటెడ్ పదవుల జాబితాలో పిల్లి మాణిక్యరావుకు ఏపీలిడ్‌క్యాప్ చైర్మన్ పదవి వరించగా, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ పదవి మంగళగిరికి చెందిన నందం అబద్ధయ్యను వరించింది. అమరావతి ఉద్యమంలో కీలకంగా పనిచేసిన రాయపాటి శైలజతోపాటు మంగళగిరికి చెందిన పార్థసారథి, తెనాలికి చెందిన కోటేశ్వరరావులకు తొలి జాబితాలో స్థానం దక్కింది. ఇటీవల విడుదలైన టీటీడీ పాలక మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తుళ్లూరుకు చెందిన నన్నపనేని సదాశివరావులను సభ్యులుగా నియమితులయ్యారు.

వీర వనితకు అందలం



రెంటచింతల: గడచిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల అరాచకాలను పురుషులే తట్టుకోలేకపోయారు. అయితే ఓ మహిళ పోలింగ్ రోజున వైసీపీ మూకల గొడ్డలి దాడితో రక్తం కారుతున్నా వైసీపీ అక్రమాలను అడ్డుకుని వీర వనితగా రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. ఆమే రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చేర్రెడ్డి మంజులరెడ్డి. చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్(హస్తకళాభివృద్ధి) సొసైటీ చైర్మన్ పదవి ఆమెను వరించింది. రెంటాల గ్రామంలో మే 13న జరిగిన పోలింగ్ రోజున వైసీపీ మూకల అరాచకాలకు అడ్డుగా నిలిచి వీరోచితంగా పోరాడి బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్‌గా కూర్చొన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఆమెపై వైసీపీ వర్గీయులు రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో తీవ్రంగా గాయపరిచారు.. అయినా వెనక్కి తగ్గని ఆమె రక్తపు గాయాలతోనే బూత్‌లో కూర్చొని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నారు. మాచర్లలో ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డి గెలవాలి, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పట్టుదలగా నిలిచారు. పోలింగ్ అనంతరమే ఆమె ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. పార్టీ కోసం ఆమె అకుంఠిత దీక్ష, పట్టుదలను చంద్రబాబు గుర్తించి పదవి కట్టబెట్టారు.

పదవులు ఇలా..

- ఉండవల్లి శ్రీదేవి ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్
- డేగల ప్రభాకర్ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- మన్నవ మోహనకృష్ణ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్
- చిల్లపల్లి శ్రీనివాసరావు ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- మంజులారెడ్డి ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ చైర్మన్
- గోనుగుంట్ల కోటేశ్వరరావు ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్
- చిలకలపూడి పాపారావు ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
- సజ్జా హేమలత ఏపీ హ్యాండ్‌లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్
- సలగల రాజశేఖర్‌బాబు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(బావుడా) చైర్మన్



మన్నవ మోహనకృష్ణ డేగల ప్రభాకర్ చిల్లపల్లి శ్రీనివాసరావు సలగల రాజశేఖరబాబు గోనుగుంట్ల కోటేశ్వరరావు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- మూడు జిల్లాల నుంచి పలువురు ఎంపిక
- ఈ నెల 11న విజయవాడలో అవార్డుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 9: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డులు పంపిణీ చేయనున్నారు.

● **పాఠశాల విభాగంలో** : బాపట్ల జిల్లా నుంచి కోట వెంకటశ్రీనివాసరావు(హెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్, చక్రాయపాలెం, అద్దంకి మండలం), గోనేళ్ళ శేషవరలక్ష్మి(స్కూల్ అసిస్టెంట్ జడ్పీహెచ్‌ఎస్ ఈపూరుపాలెం చీరాల), పవని భానుచంద్రమూర్తి(ఏఆర్‌ఎం హైస్కూల్ పేరాల, చీరాల మండలం), కర్పూరపు బిజిలికుమార్ (ఎంపీపీఎస్, బలుసులపాలెం, చెరుకుపల్లి), గుంటూరు జిల్లా నుంచి డాక్టర్ చెన్నంశెట్టి రమేష్(ఎంపీయూపీ స్కూల్, మామిళ్ళపల్లి, పొన్నూరు), పెనుమూడి ముత్యం జయరావు(ఎంపీపీఎస్, కొల్లిపర)

● **ఇంటర్ విద్యలో**: బీ సౌజన్య (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరు), ఆర్‌వీఎస్ ప్రసాద్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల దుర్గి), ఎస్ శేషుకుమారి (ప్రిన్సిపల్, ప్రభుత్వ జూ నియర్ కళాశాల పర్చూ రు).

● **టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో**: పీ నీలిమ (ఎంటీటీఎస్ పాలిటెక్నిక్‌కళాశాల గుంటూరు)

● **ఉన్నత విద్యావిభాగం**: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఆచార్య ఎం తిరుపతిరావు, ఆచార్య అశోక్‌కుమార్, ఆచార్య పూర్ణచంద్రరరావు, డాక్టర్ పద్మజరావు, ఆచార్య డీ రామచంద్రన్, డాక్టర్ బిల్‌క్యూస్, డాక్టర్ ఎస్ విష్ణువర్ధన్, డాక్టర్ జీ మోహన్‌నాయుడు



పవని భానుచంద్రమూర్తి (పేరాల) గోనేళ్ళశేషవరలక్ష్మి (ఈపూరుపాలెం) డాక్టర్ చెన్నంశెట్టి రమేష్ (మామిళ్ళపల్లి)

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు క్రీడా రంగంలో మరింతగా రాణించాలని డీఈవో ఎస్. పురుషోత్తం అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాపట్ల



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. 68వ స్కూల్‌గేమ్స్ కబడ్డీ 14 సంవత్సరాలలోపు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. డీఈవో పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 3శాతం క్రీడా రిజర్వేషన్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రశాంత్‌బాబు, రౌండ్‌టేబుల్ వెంకటేష్, కేర్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, స్టేట్ అబ్జర్వర్ సుధాకర్, పాఠశాల హెచ్‌ఎం షేక్ మహబూబ్ సుభానీ, విద్యా కమిటీ చైర్మన్ డి.లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు. ఈక్రీడలలో 13 బాలుర జట్లు గుంటూరు, విశాఖ పట్టణంపై 57.37, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాపై 43.42, చిత్తూరు, అనంతపురం జిల్లాపై 52.46, కృష్ణా, నెల్లూరు జిల్లాపై 65.47, శ్రీకాకుళం, పశ్చిమగోదావరిజిల్లాపై 87.23తో విజయం సాధించారు. 13 బాలికల జట్లు గుంటూరు, విజయనగరంపై 39.7, అనంతపురం, కడపపై 48.13, పశ్చిమగోదావరి, నెల్లూరుపై 57.37, ప్రకాశం, కర్నూలుపై 74.29, తూర్పుగోదావరి, విశాఖపై 48.28, గుంటూరు, అనంతపురంపై 38.36 విజయం సాధించినట్లు తెలిపారు.

గఘన యానం

- విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్
- పున్నమిఘాట్ వేదికగా అద్భుత విన్యాసాలు
- ట్రయల్ రన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, సాగర్ నుంచి శ్రీశైలం వరకూ..
- సీఎం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరుల ప్రయాణం
- ట్రయల్ రన్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో రంగుల వెలుగులు

"రన్‌వేలు అవసరం లేదు.. విమానాశ్రయాలు అంతకంటే అవసరం లేదు.. నీరుంటే చాలు.. నేరుగా ల్యాండ్ అయిపోతుంది.. టేకాఫ్ అవుతుంది.. ఒక జెట్టీ, వాటర్ డ్రోమ్ ఉంటే చాలు.. రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయి.. అంతే వేగంగా కిందకు దిగిపోతుంది.. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఈ సరికొత్త సీప్లేన్ ట్రయల్ రన్ శనివారం అద్భుతంగా జరిగింది. పున్నమిఘాట్ వేదికగా, సుందరమైన కృష్ణాతీరంలో, ప్రకృతి అందాల నడుమ అటూ ఇటూ తిరిగిన ప్లేన్ విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. పర్యాటకంపై సీఎం చంద్రబాబు ప్రసంగం, సప్తవర్ణాలను విరజిమ్మిన బాణసంచా పేలుళ్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి."



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పున్నమిఘాట్ వద్ద కృష్ణాతీరంలో శనివారం సీప్లేన్ ట్రయల్ రన్ అద్భుతంగా జరిగింది. ఘాట్‌లోని వాటర్ జెట్టీ వద్ద ఉదయం 10.05 గంటలకు సీప్లేన్‌ను నిలిపి ఉంచి, జెట్టీ వెనుక భాగంలో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్దనరెడ్డితో పాటు ఎంపీ కేశినేని చిన్ని, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్, ఐఅండ్‌ఐ రాష్ట్ర, కేంద్ర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమం అయిపోగానే, సందర్శకులు వీక్షించేలా టెంట్ తెరలు తొలగించారు. సరిగ్గా 12.45 గంటలకు సీప్లేన్ సర్వీసు కృష్ణానది నుంచి బయల్దేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ఆహ్వానితులు ప్లేన్‌లోకి ఎక్కారు. ప్లేన్‌లోకి ఎక్కేముందు చంద్రబాబు అభివాదం చేయటంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

గ్రాండ్ వెల్కమ్

సీప్లేన్ డెమో లాంచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభ సూచికగా భవానీ ద్వీపం సమీపంలో కృష్ణానదిపై గ్రాండ్ ఫైర్‌వర్క్స్ జరిపారు. పడవలపై పెద్ద ఎత్తున ధ్వనిచేస్తూ సప్తవర్ణాలను ఆకాశంలోకి విరజిమ్మారు.



సీప్లేన్ సాగిందిలా..

కృష్ణానదిలో తూర్పు వైపునకు కదిలిన సీప్లేన్, ఆ వెంటనే యూటర్న్ తీసుకుని భవానీ ద్వీపం చెంతకు వెళ్లింది. ద్వీపం టవర్ సమీపంగా వెళ్లి, అక్కడి నుంచి వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. ప్రకాశం బ్యారేజీతో పాటు నాగార్జున సాగర్, పులిచింతల డ్యామ్‌ల మీదుగా శ్రీశైలం డ్యామ్ వరకు ఈ సీప్లేన్ వెళ్లింది.




న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశనను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

● పలు అంశాలపై అధ్యయనం ● అక్కడి బీజేపీ నేతల సన్మానం

పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మలు పలు అంశాలపై అధ్యయనం చేశారు. ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు వెళ్లిన ఎమ్మెల్యేలు తెలుగేదేశం పార్టీ విజయోత్సవాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను న్యూజిలాండ్‌లో ఉంటున్న తెలుగువాసులకు వివరించారు. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి పారిశ్రామిక విధానాలను వివరించారు. అదేవిధంగా అక్కడి విద్యుత్ శాఖ మంత్రి సిమియన్ బ్రౌన్‌తో ప్రత్యేక భేటీ అయ్యారు. అక్కడి విద్యుత్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీ న్యూజిలాండ్ నేతలు సోహెన్ మిట్టల్, శేఖర్ అగర్వాల్‌లు శాలువాలతో ఇరువురు ఎమ్మెల్యేలను సత్కరించారు. ఈకార్యక్రమంలో న్యూజిలాండ్ నేషనల్ పార్టీ ప్రతి నిధులు శివ కిలారి, బాలవేణుగోపాల్, టీడీపీ న్యూజిలాండ్ కోఆర్డినేటర్ నిమ్మగడ్డ జితేంద్ర, నేతలు మద్దుకూరి దిలీఫ్, సోమేపల్లి పమ్మి, గోరంట్ల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వాయిదా అన్యాయం

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ వాయిదా వేయడం అన్యాయమని అలాగే వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పలువురు పలువురు మాల సంఘాల నాయకులు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ 9 మంది న్యాయమూర్తులు బెంచ్ తీర్పును ప్రకటిస్తే ఆరుగురు న్యాయమూర్తులు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్ తీర్పును వెలుగులోకి తీసుకురావడం అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు, చప్పిడి వెంగళరావు, మాచవరపు జూలియన్, ప్రకాష్, రవి, శరత్, మంగరాజు, రాజేష్, కొండలరావు పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం పంచాయతీ పరిధిలోని చిన జమ్ములమడకలో ఇటీవల వైసీపీ కార్యకర్త చింతల శ్రీను పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, అద్దంకి పార్టీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, కొమ్మూరి కనకరావు తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు.

దుకాణంలో గ్యాస్‌లీకై చెలరేగిన మంటలు


ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లో కాలిపోతున్న దుకాణం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఈసంఘటన శనివారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లోని ఆకుల జ్ఞానవతి దుకాణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం దుకాణ నిర్వాహకులు గ్యాస్ వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈక్రమంలో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది.


చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలు

పురుగు మందుల ఘాటుకు అపస్మారక స్థితికి కూలీలు

● స్వర్ణలో ఘటన ● హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలింపు ● తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో కూలి పనులకు వచ్చి మందులు వికటించడంతో నలుగురు అపస్మారక స్థితికి చేరారు. దీంతో వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్వర్ణ కొత్త మాలపల్లికి చెందిన నందివెలుగు స్వామియేల్, కొప్పోలు జేమ్స్, దేవరపల్లి రమేష్, మద్దిరాల దావీదు గ్రామ శివారులోని పొలాల్లోకి యూరియా,గుళికలు చల్లేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే సుమారు 12 బస్తాలకు పదార్థాలు కలుపుకున్నారు. 6 బస్తాలకు పైగా చల్లారు. మధ్యలో కొద్దిసేపు టిఫిన్‌చేసి విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం తిరిగి పనులు మొదలు పెట్టగా ఒక్కొక్కరుగా స్పృహ కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో అందరూ వాంతులు కూడా చేసుకున్నారు. విషయం గ్రహించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన నలుగురిని 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మార్ట్‌లో చోరీ

● సరుకుతో ఐదుగురు పరార్ ● ఇద్దరిని పట్టుకున్న నిర్వాహకులు

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ మార్ట్‌లో చోరీకి యత్నించిన ఇరువురు మహిళలను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు మహిళలు ముందుగా మార్ట్‌లోకి ప్రవేశించి పలు వస్తువులను అపహరించి బయటకు వెళ్లిపోయారు. మరో ఇద్దరు చోరీకు పాల్పడి బయటకు వెళుతుండగా మార్ట్ నిర్వాహకులు గ్రహించి పట్టుకున్నారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

24న కమ్మ వారి కార్తీక వన సమారాధన

ఒంగోలు (కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఈ నెల 24న జరుగుతుందని అధ్యక్షులు మండవ మురళీకృష్ణ తెలిపారు. సంఘ సమావేశం శనివారం స్థానిక నిర్మల్‌నగర్‌లోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రాజుపాలెం వద్ద హైవే సిటీ ఆవరణలో వన భోజన మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

నైట్‌షెల్టర్లు.. నామమాత్రమే

5వ పేజీతరువాయి...

స్నానం తదితరాలు లేక, దుస్తులు శుభ్రం చేసుకునే పరిస్థితి లేక మురికిగా కాలం వెళ్లదీస్తుంటారు.

● గుంటూరులోని అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టాభిపురంలో మూడు ప్రాంతాల్లో నైట్‌షెల్టర్లు ఉన్నాయి. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ అపరిశుభ్రతతో అధ్వానంగా ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌ను ఒక్కో స్వచ్ఛంద సంస్థకు అప్పగించినా వాటిని నిర్వహించలేక బాధ్యతల నుంచి ఆయా సంస్థలు వైదొలిగాయి. గత ఐదేళ్లు ఈ కేంద్రాల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో ఆశ్రయం కోసం వచ్చే నిరాశ్రయులకు కనీస సౌకర్యాలు ఇక్కడ ఉండటంలేదు. ఉండటానికి పెద్ద పెద్ద గదులున్నా సరైన బెడ్స్, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు నిరాశ్రయులు, అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. అరండల్‌పేట ఒకటో లైన్‌లోని నైట్‌షెల్టర్ పరిసరాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంది. కొన్ని రోజులుగా ఈ సెంటర్ తాళాలు కూడా తీయడంలేదని సమాచారం. బస్టాండ్ వద్ద ఉన్న కేంద్రానికి విద్యుత్ సరఫరా లేక అరకొర వచ్చే వారు కూడా దోమల బాధ తట్టుకోలేక వెళ్తున్నారు. పట్టాభిపురంలోని సెంటర్లో అయితే ఇద్దరు ముగ్గురు కూడా లేరు. దీంతో జీజీహెచ్ వద్ద అయితే రాత్రిళ్లే కాక పగలు కూడా వందల సంఖ్యలో ఉంటుంటారు. ఎవరైనా ఆహారం తెచ్చి పెడితే తిని అక్కడే ఎండకు, వానకు, చలికి అల్లాడుతుంటారు.

● తెనాలిలో బాలాజీరావుపేటలో గతంలో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్ వైసీపీ హయాంలో మూతపడింది. నందులపేటలోని నైట్‌షెల్టర్‌లో సుమారు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేంద్రాల గురించి తెలియక పెద్దసంఖ్యలో అభాగ్యులు రోడ్లపై ఆశ్రయం పొందుతున్నారు.

● పొన్నూరులో దశాబ్దాలుగా నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బిచ్చగాళ్లు, ఏ ఆశ్రయం లేని వారు పట్టణ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై జీవనం సాగిస్తున్నారు. ఓవర్‌బ్రిడ్జి, రైల్వేప్లాట్‌ఫాంలపై 35 మంది వరకు రాత్రి వేళ సేదతీరుతున్నారు.

● నరసరావుపేటలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణకు నిధుల కొరత నెలకొంది. గుంటూరురోడ్డులోని వసతిగృహాన్ని మూసేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మరో వసతి గృహంలో 25 మంది మహిళలు ఉంటున్నారు. అయితే ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని నిర్వాహకులు తెలిపారు.

● పిడుగురాళ్లలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ కొన్నేళ్లుగా ఉంది. ఇక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. అయితే అక్కడ ఉండేవారికన్నా రోడ్ల మార్జిన్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే అభాగ్యులే అధికం.

● వినుకొండలో ఐదేళ్లుగా నిరాశ్రయులకు వసతిగృహం కొనసాగుతుంది. దాతల సాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే ఇక్కడ అందరికీ కాకుండా కొందరికే ఆశ్రయం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 30 మందికి అవకాశం ఉన్నా కేవలం 14 మందికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ కోరగా ఆశ్రమానికి మున్సిపాలిటికి ఎటువంటి సంబంధంలేదన్నారు.

● చిలకలూరిపేటలో ప్రస్తుతం ఎటువంటి నైట్‌షెల్టర్లు లేవు. కొన్నేళ్ల క్రితం ఏఎంజీ సంస్థ కుమ్మరికాలనీలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. అయితే దీనిని ఉపయోగించుకునే వారు లేకపోవడంతో మూసివేశారు.

● మాచర్లలోని రామాటాకీస్‌లైన్‌లో స్వశక్తి రూరల్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ ఉంది. అయితే దీని గురించి నిరాశ్రయులకు సమాచారం లేదు. ఇక్కడ ఐదుగురికే ఆశ్రయం పొందే అవకాశం ఉంది.

● బాపట్లలోని రైలుపేటలో మెప్మా పర్యవేక్షణలో ఐదేళ్లుగా ఉన్న నైట్‌షెల్టర్‌లో 15 మంది ఉండటానికి అవకాశం ఉంది. అయితే 15 మందికి ఒకే మరుగుదొడ్డితో ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ మరో మూడు మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు కూడా అందజేశారు. నిర్వాహకులకు ఏడాది నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు.

● రేపల్లెలోని ఐదో వార్డులోని నైట్‌షెల్టర్‌లో నామమాత్రపు వసతులు ఉండటంతో బసకు ఎక్కువ మంది రావడంలేదు. గతంలో 40 మందిపైనే ఉండేవారు, ఇప్పుడు 16 మంది మాత్రమే ఉంటున్నారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు

బల్లికురవ మండలానికి రూ. 3.90 కోట్ల నిధుల మంజూరు

కూటమి ప్రభుత్వం రాగానే శరగవేగంగా పనులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలలో అంతర్గత రోడ్లు మురికి కాలువలను అభివృద్ధి పరిచేందుకు బల్లికురవ మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 3.90 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాలలో వారం రోజుల నుంచి సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్లను నాణ్యత ప్రమాణాల మేర ఏర్పాటు చేయాలని, లేకుంటే క్వాలిటీ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామాలలో రోడ్ల పనులను అధికారులు దగ్గర ఉండి కట్టుదిట్టంగా చేయిస్తున్నారు. మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో అగ్రామ టీడీపీ నేత గొట్టిపాటి శంకర్ 235 మీటర్ల మేర సిమెంట్ రోడ్డును బీసీ కాలనీలో నూతనంగా వేయించారు. అదే గ్రామంలో మరో పది లక్షలతో ఎస్సీ కాలనీలో మరో నేత యాగంటి సింగరయ్య సిమెంట్ రోడ్ల పనులను ప్రారంభించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. ఉప్పుమాగులూరు పంచాయతీ పరిధిలోని కోట వారిపాలెంలో రూ. 10 లక్షలతో ఆ గ్రామ టీడీపీ నేత వడ్లమూడి అరవింద్ మురుగు కాలువల నిర్మాణ పనులను చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాలలో రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పూర్తి అయిన రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ


కోటవారిపాలెంలో మురుగు కాలువల పనులను పరిశీలిస్తున్న ఏఈ మాధవ్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు శ్రీనివాసరావు ఎంపిక



అద్దంకిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయలుకు, ప్రధానోపాధ్యాయులకు అవార్డులను ప్రకటించింది. ఈ క్రమంలో బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న కేవీ శ్రీనివాసరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులను ఉపాధ్యాయులకు అందజేయనున్నారు. కేవీ శ్రీనివాసరావు 1996 నవంబరులో తిమ్మాయపాలెం యూపీ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా చేరి, యూపీ, జడ్పీహెచ్‌ఎస్‌గా అప్‌గ్రేడ్ అయిన తరువాత 12 సంవత్సరాల 8 నెలల పాటు పని చేసి పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనంతరం కాకానిపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేసి ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. తరువాత 2016 నవంబరులో తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా 2023 జూన్ వరకు పనిచేసి తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల విద్యార్థుల సంఖ్యను 1023కు పెంచారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధనకు కృషి చేసి పాఠశాల పేరును చర్చించుకునేలా చేశారు. అనేక మంది విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి బహుమతుల సాధనకు కృషి చేశారు. ప్రస్తుతం చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు యూటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

గెలాక్సీ గ్రానైట్ గనుల్లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

చీమకుర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :గెలాక్సీ గ్రానైట్ గనుల్లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రామతీర్థం పరిసర ప్రాంతాల్లోని 31 క్వారీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలచే తనిఖీలు నిర్వహించారు. అంతకుముందు దాదాపు వారం రోజులపాటు ట్రేడ్ పరీక్షలను క్వారీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, ముగింపు సభను ఈనెల 17వతేదీ సాయంత్రం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్నారు. కాగా చివరిరోజు గోల్డెన్ గ్రానైట్ క్వారీలో తనిఖీ బృందాలు పరిశీలించారు. వీరికి మేనేజర్ ఎ.గిరి ఘనస్వాగతం పలికారు. అనంతరం టీంలీడర్ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు.

హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ హేమలత



చీరాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా చీరాలకు చెందిన టీడీపీ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత నియమితులయ్యారు. శనివారం కూటమి ప్రభుత్వం రెండో విడత విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ఆమెకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నేతన్నల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

19 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 19 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా...

పెద్దపూడి విజయ్ కుమార్



పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో పర్చూరు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కింది. ఆయనను కూటమిలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన పెద్దపూడి విజయ్‌కుమార్ హైదారాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. విద్యార్థి దశలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు. 2018 నుంచి జనసేన పార్టీలో ఉండి క్రియాశీలక నాయకునిగా తనదైన శైలిలో ముందుకు సాగుతూ ఆపార్టీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నారు. రాజనీతి శాస్త్ర విభాగం నుంచి సంక్షేమ రాజ్యం, దళితుల విద్య - ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాత్ర అనే అశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. ఉన్నత విద్యతోపాటు, రాజకీయ రంగంలో సానుకూల దృక్పథంతో ప్రజాదరణ పొందుతూ ముందుకు సాగుతున్నారు.


మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో కోటి సోమవారం పూజలు

అద్దంకి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అతి పవిత్రంగా భావించే రోజులలో ఒకటైన కోటి సోమవారం పూజలను శనివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మణికేశ్వరం దేవాలయానికి వెళ్లిన భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. వేకువజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పలువురు భక్తులు శివదీక్ష తీసుకున్నారు. ఈవో వాసుబాబు, ప్రధాన పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమతేశ్వరాలయం తదితర శివాలయాలలో కోటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

ఇంకొల్లు : మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కోటిసోమవారాల సందర్భంగా మహిళలు వేకువజామున స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 365 ఒత్తుల దీపారాధన చేశారు.ఇంకొల్లులోని శివాలయానికి శనివారం వేకువజాము నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలి వెళ్లి పూజలు ఆచరించారు. మండలంలోని చింతలపాలెంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

చట్టాలపై అవగాహన పొందాలి

● న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతీ యువకులు చట్టాలపై అవగాహన పొంది బాధ్యతాయుతమైన పౌరులుగా రాణించాలని చీరాల మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఏ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయాధికారి పోక్సో వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై కమలాకర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నీలాకుమారి, న్యాయవాదులు రమేష్‌బాబు, రామకృష్ణారెడ్డి, ఈశ్వరి, రాజేశ్వరి, రత్నపాప, పీఎల్‌వీలు మథీన్, కృష్ణ, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నాకు న్యాయం జరగదు... చనిపోనివ్వండి..

● బోరున విలపించిన వివాహిత

● పట్టణంలో ఆందోళన ● పోలీసుల కౌన్సెలింగ్

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ' కట్టుకున్న భర్త నిలువున మోసం చేశాడు. చిత్ర హింసలకు గురి చేసి నడిరోడ్డుపై వదిలేశాడు. స్టేషన్‌కు వస్తే న్యాయం జరగడం లేదు. నన్ను చచ్చిపోనివ్వండి' అంటూ ఓ వివాహిత రోదించింది. ఈఘటన చీరాల పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం సుమారు మూడేళ్ల క్రితం వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నంకు చెందిన తిరుపతయ్యతో చిన్నం హారికకు ప్రేమ వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఏడాది పాప. భర్త గతకొంత కాలంగా వేధిస్తుండటంతో వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా తల్లి వద్ద జాండ్రపేటలో ఉంటుండగా తిరిగి మళ్లీ వేధిస్తున్నట్లు భర్తపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఇక్కడ విచారణ జరుగుతోంది. అయితే ఆమె తనకు న్యాయం జరగడం లేదంటూ పట్టణంలో ఆందోళనకు దిగింది. తిరిగి పోలీసులు మళ్లీ వన్‌టౌన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నాకు న్యాయం జరగదని.. చచ్చిపోయేందుకు అనుమతివ్వాలని రోదించింది. పోలీసులు నచ్చచెప్పి తల్లితో పంపించారు.

గేదె కళేబరాన్ని ఢీకొట్టి కారు బోల్తా

మహిళ మృతి


బోల్తా పడిన ఇన్నోవా కారు


మృతి చెందిన పార్వతి

టంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారు ఢీకొని బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సూరారెడ్డిపాలెం- నాయుడుపాలెం మధ్య శుక్రవారం రాత్రి పొద్దుపోయాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుపతి బయల్దేరింది. అందులో 8 మంది ప్రయాణిస్తున్నారు. వీరి కారు సూరారెడ్డిపాలెం- నాయుడుపాలెం మధ్య అప్పటికే గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉన్న గేదెను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒరుసు పార్వతి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగ వెంకటలక్ష్మి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారిణి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారిణి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి అన్నారు. అద్దంకి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి మట్లాడుతూ అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యరమోతు రమేష్ బాబు, న్యాయవాదులు పీఎల్ఎన్ ప్రసాద్, టి.మార్త శ్రీనివాస్, ఎం ప్రకాష్, షేక్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



మూలవిరాట్‌ని అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

లక్ష్మీచెన్నకేశవునికి సూర్యకిరణాభిషేకం

సంతరావూరు(చినగంజాం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామ లక్ష్మీ చెన్నకేశ్వరస్వామి దేవస్థానంలోని మూల విరాట్‌ని శనివారం సూర్యోదయ వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో కోటి సోమవారం నుంచి పౌర్ణమిలోపు, మాఘమాసంలో స్వామి వారిని సూర్యోదయాన భానుడి లేలేత కిరణాలు లక్ష్మీచెన్నకేశ్వరస్వామి మూల విరాట్‌ను అభిషేకిస్తాయని దేవదాయ శాఖ ఈవో పోతిన శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 7.05 గంటల వరకు దేవస్థానంలో స్వామి వారిని భానుని కిరణాలు అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దిట్టకవి కృష్ణామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆధారాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, సీఐ శేషగిరిరావు

వివాదాలతో సమస్యలను కొనితెచ్చుకోవద్దు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు వివాదాలతో సమస్యలు కొనితెచ్చుకోవద్దని, సామరస్యంగా సాగు చేసుకోవాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, రూరల్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలోని వాద పొలాల్లో సాగునీరు విషయమై గతకొంత కాలంగా కొండారెడ్డి అనీల్ మరికొందరు రైతులకు మధ్య వివాదం నడుస్తోంది. ఈక్రమంలో ఓవర్గంలోని రైతులు కలెక్టర్ వెంకట మురళీకి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన రెవెన్యూ, పోలీసులు రెండు వర్గాలకు నచ్చజెప్పి సాగునీటిను విడుదల చేశారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు కార్యాలయానికి పిలిపించి సమస్యను పరిష్కరించారు. దీంతో ఒకింత సానుకూల వాతావరణం నెలకొంది. ఎస్సై చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరికీ ఓటుహక్కు కల్పించాలని తహసీల్దార్ జి.ప్రభాకరరావు బీఎల్వోలకు సూచించారు. మండలంలోని కడవకుదురు, చినగంజాం, రాజుబంగారుపాలెం,మున్నంవారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు. బీఎల్వోలకు పలు సూచనలు అందజేశారు. శని, ఆదివారాల్లో నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తప్పులు లేకుండా మంచి ఓటర్ల జాబితాను తయారు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గొట్టిపాటి జన్మదిన వేడుకలు

ఉత్సాహంగా నిర్వహించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

ప్రజల వెంటే మా కుటుంబం : బాబి

అద్దంకి, నవంబరు9: విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో వలే ఈ ఏడాది కూడా తన పుట్టిన రోజు వేడుకలకు దూరంగా, నిరాడంబరంగా హైదరాబాద్‌లో కుటుంబసభ్యులతో ఉన్నారు. అయితే నియోజకవర్గం మొత్తం టీడీపీ నేతలు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అద్దంకి మండల టీడీపీ నేతల ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని ఒంగోలు రోడ్డులోని సూర్య రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి రవికుమార్ సోదరుని కుమారుడు కమల్‌కిషోర్(బాబి), పలువురు టీడీపీ నేతలతో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ గొట్టిపాటి కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన భిక్షకు అయ్యప్ప, శివ, హనుమాన్, భవానీ, వేంటేశ్వర స్వామి దీక్షలు తీసుకున్న భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, కఠారి నాగేశ్వర రావు, చాగంటి రాజేంద్ర ప్రసాద్, బండారు రాఘవ, దత్, తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి రూరల్ మండల నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేస్తున్న గొట్టిపాటి కమల్‌కిషోర్(బాబి), టీడీపీ నేతలు

మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణీ

మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ లు, అద్దంకి పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ కార్మికులకు దామా హనుమంతరావు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు.మధ్యాహ్నం వేయిస్తంభాల గుడిలో క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్ ఆధ్వర్యంలో దీక్షా భక్తులకు సద్ది ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, నాదెండ్ల సుబ్బారావు, చుండూరి మురళీసుధాకర్, గుంటూరు మాధవరావు, లహరి, గుంజి శ్రీనివాసరావు, గట్టుపల్లి రామారావు, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్ లు అత్తులూరి రమేష్, మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, బొజ్జా వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి సుధీర్, రంగిశెట్టి సుభాషిణి,కొణిజేటి విజయలక్ష్మి, షేక్ జహీరా, అంకం తేజశ్వని, ఏజెండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొట్టిపాటి రవికుమార్ జన్మదినం కేక్‌ను కట్ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ అద్దంకి పట్టణ నేతలు

పంగులూరులో ఘనంగా నిర్వహణ

పంగులూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు కె.వి.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావులు శనివారం స్థానిక నేతలతో కలసి కేక్ కట్ చేశారు. స్థానికంగా ఉన్న బాల, బాలికల వసతి గృహాలలో విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచారు. టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, చింతల సహదేవుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వరపర్ల సుబ్బారావు, పూనాటి రామాంజనేయులు, గుదిబండ్ల ఆదిరెడ్డి, ఉన్నం రవిబాబు, గడ్డం నాదేశ్వరరావు, రావుల సింగరకొండ, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, పచ్చా శీను, బీసీ నాయకులు రౌతు వీరాంజనేయులు, దాసరి హనుమంతరావు, కోటయ్య పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పు తక్కెళ్లపాడులో

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడులో రవికుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం స్థానికులకు పులిహోరతో పాటు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి భానుప్రకాష్, ఎనికపాటి వాయునందనరావు, కూనంనేని వీరయ్య, శృంగారపు బ్రహ్మయ్య, పాలపర్తి జక్రయ్య, పూసల ప్రసాద్, షేక్ హస్సాన్‌వలి, శృంగారపు శ్రీను, పూసల కొండలు, బుల్లిబాబు, బోడాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముప్పవరంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల నేతలు



సంతమాగులూరు మండలంలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సంతమాగులూరులో

సంతమాగులూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు శనివారం సంతమాగులూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని మంత్రి అతిథి గృహంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ మండల స్థాయి నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, సన్నెబోయిన ఏడుకొండలు, చేవూరి వాసిరెడ్డి, నన్నెబోయని గురుబ్రహ్మం, దూపాటి ఏసోబు, దుద్దేల గాలియ్య, అట్లా పెద వెంకటరెడ్డి, గుండపునేని సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ బల్లికురవ మండల కార్యాలయంలో మంత్రి రవికుమార్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న పార్టీ నేతలు

బల్లికురవలో మిఠాయిలు పంచి అన్నదానం

మంత్రికి ఫోనులో శుభాకాంక్షలు తెలిపిన నేతలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను శనివారం బల్లికురవ మండల కేంద్రంలో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. కొందరు మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించగా మరికొందరు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు ఫోనులో మంత్రి రవికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే వైదన గ్రామంలో మంత్రి రవి కుమార్ జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో పార్టీ మండల నేతలు దూళిపాళ్ల రామగోవిందు, గొట్టిపాటి లక్ష్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, దద్దాల అంజయ్య, పుచ్చకాయల వెంకట్రావు, పత్తిపాటి వెంకట్రావు, యాగంటి సింగరయ్య, ఆళ్ల చంద్రమౌళి, గుంజి సుబ్బారావు, పోగుల చంద్రశేఖర్, చింతల అమరనాద్, పందిరి అంజిబాబు, పెంట్రాల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీ యజమానుల శుభాకాంక్షలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలకు చెందిన యజమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కామేపల్లి గ్రానైట్ అండ్ ఎక్స్‌పోర్ట్సు యజమాని కామేపల్లి లక్ష్మీప్రసాద్, కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దూళిపాళ్ల శ్రీకాంత్, పలు క్వారీలకు చెందిన వారు మంత్రికి ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలానే గాయత్రి ఎక్స్‌పోర్ట్సు యజమానులు దేవినేని శ్రీనివాసరావు, వేణుగోపాల్ సాయికృష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని దూళిపాళ్ల వెంకట్రామయ్య, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, పలు శాఖల అధికారులు మంత్రి రవికుమార్‌కు శుభాంక్షలు తెలిపారు.

మంత్రి జన్మదినం సందర్భంగా అన్నదానం

మేదరమెట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో తెలుగు దేశం పార్టీ నాయకులు అన్నదానం నిర్వహించారు. శనివారం రవికుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 500 వందల మంది అయ్యప్ప, శివ స్వాములకు అన్నదానం చేశారు. పలు గ్రామాలలో రవికుమార్ జన్మదినం సందర్భంగా కేక్‌లు కట్ చేసి తెలుగుదేశం నాయకులు వేడుకలు నిర్వహించారు.



పుట్టావారిపాలెంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన టీడీపీ నాయకులు

పుట్టావారిపాలెంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

సంతమాగులూరు, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టావారిపాలెం గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లగా లోవోల్టేజి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టావారిపాలెం గ్రామ పర్యటనకు వచ్చిన సమయంలో గ్రామ ప్రజలందరూ తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో చకచకా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచ్ నన్నెబోయిన గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పదవులకు వన్నెతేవాలి

కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఎంపికైన వారిని అభినందించిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ చైర్మన్ లుగా ఎంపికైన వారందరూ ప్రభుత్వం ప్రతిష్టను పెంచేవిధంగా, ప్రజల నమ్మకాన్ని చూరగొనేవిధంగా పాలన సాగిస్తూ పనిచేయాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూ రి సాంబ శివరావు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు నారా లోకేష్‌లు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ కార్పొరేషన్ చైర్మన్‌లుగా నియమించిన వారిని న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ప్రత్యేకంగా శనివారం ఫోన్‌లో అభినందించారు. వారిలో బాపట్ల అర్బన్ డెవలెప్ మెంట్ అథారిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్ ,ఏపీ హ్యాండ్లూమ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా సజ్జా హేమలత, ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలెప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావులకు ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజానీకానికి, పేద కుటుంబాలకు అండగా ఉండే విధంగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి,సలగల రాజశేఖర్ బాబు (ఫైల్)



తిరుమలలో నటుడు నిఖిల్ , ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య శనివారం తిరుమలలో కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకున్నారు. తన మేనల్లుడు, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కుమారుని పుట్టెంటుకుల చెల్లింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తిరుమల, తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్ బి.ఆర్ నాయుడును ఎమ్మెల్యే కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు చినగంజాం విద్యార్థి



కోకి అంకుల్‌రెడ్డి

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన కోకి అంకుల్‌రెడ్డి 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కోచ్, అధ్యక్షులు మరుప్రోలు గిరిబాబు శనివారం తెలిపారు. ఒంగోలు డీఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ పోటీలలో అండర్-14 కబడ్డీ పోటీలలో అంకుల్‌రెడ్డి ప్రతిభ చూపి జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. స్థానిక సత్యం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతూ బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్‌లో కబడ్డీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన అంకుల్‌రెడ్డిని సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ నున్నా హరనాథ్‌బాబు, బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కోచ్ గిరిబాబు, కార్యదర్శి బి.నాగంజనేయులురెడ్డి, ఉపాధ్యక్షులు బి.శివారెడ్డి, జాయింట్ కార్యదర్శి కె.సతీష్‌రెడ్డి, కోశాధికారి డి. సుబ్బారెడ్డి, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ మధుసూదన్‌రెడ్డి, జీటీ అంకిరెడ్డి, నంగు శ్రీనివాసరెడ్డి, కోమట్ల పవన్‌కళ్యాణ్‌రెడ్డి, నిద్ర శ్రీనివాసరెడ్డిలు అభినందనలు తెలిపారు.

నేడే పలు గ్రామాలలో విద్యుత్ కోత

మేదరమెట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదరమెట్ల, సోమవరప్పాడు, కొరిశపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సమ్మర్ రివిజన్ పరిశీలన

పంగులూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :ఓట్ల చేర్పులు మార్పులకు సంబంధించి పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ పి.సింగారావు శనివారం పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని శని, ఆది వారాలలో బీఎల్‌వోలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని 222, 224 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సింగారావు పరిశీలించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వేటపాలెం(చీరాల), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి, రామన్నపేట పంచాయతీల పరిధిలోని పోలింగ్ బూత్‌లను శనివారం తహసీల్దార్ పార్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఓట్ల మార్పులు చేర్పుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూతన ఓట్లు, మార్పులు, చేర్పుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఓటరు ప్రత్యేక డ్రైవ్ చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆర్డీవో శనివారం చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురం, జాండ్రపేట పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈనెలలో 23, 24 తేదీలలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, బీఎల్‌వోలు సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఓటర్ల స్పెషల్ డే క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండల పరిధిలోని 141, 142, 143, 144, 145, 146 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బ్రహ్మయ్య పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, వీఆర్వో గోవిందరెడ్డి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన అపుస్మా నేతలు


పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా డీఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పురుషోత్తంని అపుస్మా ప్రతినిధులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను డీఈవో దృష్టికి తీసుకుపోయారు. ప్రస్తుతం కొనసాగుతున్న అపార్ ఐడీ గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ అపుస్మా అధ్యక్షులు తేళ్ల వెంకట రాము, జిల్లా గౌరవ అధ్యక్షులు తోటకూర విజయ్ భాస్కర్, అపుస్మా పర్చూరు నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాదెండ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




డీఈవో పురుషోత్తంని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న అపుస్మా ప్రతినిధులు

కార్తీక వన సమారాధన పత్రిక ఆవిష్కరణ

అద్దంకిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఆహ్వాన పత్రికను శనివారం రాత్రి సంఘ నాయకులు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జె. హనుమంతరావు, ఉపాధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఈదర వెంకట శివప్రసాద్, స్వర్ణ సుబ్బారావు, పోలూరు హనుమంతరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.





'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.500 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2600, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

INTERVIEW

నత్రజని ఎరువులు అధికంగా వాడొద్దు!



- విత్తనాల ఎంపిక, శుద్ధి ప్రధానం
- ఎరువుల కొరత రానీయం
- కృత్రిమ కొరత, ధరలు పెంచితే కఠిన చర్యలు
- వ్యక్తిగతంగా యంత్రాలు ఇచ్చే అవకాశం ఉంది
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

"వ్యవసాయంలో ముఖ్యంగా వరిసాగులో నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. లేకుంటే తెగుళ్లు, పురుగులు పైరును ఆశించి, దిగుబడులపై ప్రభావం చూపుతాయి.' అని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) సత్యవాణి అన్నారు. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ద్వారా ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్న ఆమె కృత్రిమ కొరతలు సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. వ్యక్తిగత రుణాలు, యంత్ర పరికరాలు కావాలని చాలాచోట్ల రైతులు అడుగుతున్నారని, ఆ మేరకు తాము ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. త్వరలోనే కర్షకుల కోరిక నెరవేరే సూచనలు ఉన్నాయని అన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

6

• భక్తజన సందోహం



నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవంలో శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖపట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేశారు.

6

జిల్లాలో నలుగురు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు

● రేపు విజయవాడలో అవార్డుల ప్రదానం

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో విశిష్ట సేవలందించిన జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పాఠశాల విభాగంలో పొదలకూరు డీఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఏపీ సుధాకర్, కొడవలూరు మండలం, గండవరం జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ టీచరు గుంజి నాగభూషణం, నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ నగర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు జె.రామమోహన్, బుచ్చిరెడ్డిపాళెం రామచంద్రాపురం ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌బాబులు ఎంపికయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ విభాగంలో కేఏపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్ డాక్టర్ పి.మునిరాజా, ఉన్నత విద్యా విభాగంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు డాక్టర్ విద్యా ప్రభాకర్ కొడాలి రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. ప్రతి ఏడాది జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఈ అవార్డులను అందచేస్తుండగా ఈ ఏడాది విజయవాడలో వరదల కారణంగా ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 11వతేదీన జాతీయ విద్యాదినోత్సవం నాడు విజయవాడలో అవార్డులు అందచేయనున్నట్లు విద్యాశాఖ డైరక్టర్ వి.విజయరామరాజు తెలిపారు.

● ఏపీ ఉర్దూ అకాడమీ అవార్డులు

విద్యారంగంలో ఉర్దూ సేవలందించిన వారికి ఏపీ ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి అవార్డులను ప్రకటించింది. ఉపాధ్యాయుల విభాగంలో ఉదయగిరి నార్త్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు పఠాన్ సంధానీబేగం, ఉదయగిరి బీసీ కాలనీ ఎంపీపీయూపీ ఉపాధ్యాయులు షేక్.సుల్తానాబేగం, ఏఎస్‌పేట జడ్పీపీ ఉపాధ్యాయుడు షేక్.జిలానీబాషాలు రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే విద్యార్థుల విభాగంలో ఆత్మకూరు జడ్పీపీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్.హలీమాసాదియా, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.సానియా, నెల్లూరు జెండావీధి పీఎస్ఎం మునిసిపల్ పాఠశాలకు చెందిన షేక్.అలేఖాజునీరియన్‌లు రాష్ట్ర ఉత్తమ విద్యార్థుల అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలో అవార్డులు అందజేయనున్నారు.



కోటంరెడ్డికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు, అభిమానులు

పేరు	పార్టీలో హోదా	పదవి
కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి	నుడా చైర్మన్
పోలంరెడ్డి దినేష్‌రెడ్డి	టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు	ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్
ఆనం వెంకట్రమణారెడ్డి	టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి	ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్
సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి	కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు	ఆర్టీసీ నెల్లూరు రీజన్ బోర్డు చైర్మన్

విశ్వసనీయులకే పట్టం!

● జిల్లాలో నలుగురిని వరించిన పదవులు ● రెడ్డి సామాజిక వర్గానికి సముచిత స్థానం

నెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల రెండవ జాబితాలో సింహపురికి సముచిత స్థానం లభించింది. జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు కీలక పదవులు వరించాయి. తెలుగుదేశం పార్టీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆనం వెంకట్రమణారెడ్డిలతోపాటు బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి పదవులు దక్కాయి. తొలి విడత జాబితాలో జనసేన నాయకుడు అజయ్‌బాబును హౌసింగ్ బోర్డు చైర్మన్ పదవి వరించగా, ఇప్పుడు బీజేపీకి చెందిన నాయకుడు సురేష్ రెడ్డికి ఆర్టీసీ నెల్లూరు రీజనల్ బోర్డు చైర్మన్ పదవి దక్కింది. దీంతో కూటమిలోని టీడీపీ సహా జనసేన, బీజేపీలకు కూడా జిల్లా నుంచి సముచిత స్థానం లభించినట్లు అయ్యింది. ప్రస్తుతం నామినేటెడ్ పదవులు పొందిన ఈ నలుగురు నాయకులు పార్టీ పట్ల విధేయత, విశ్వసనీయత ప్రదర్శించినవారే. సుదీర్ఘ కాలం ఆయా పార్టీలో కొనసాగిన వారు కొందరు కాగా, పార్టీ ప్రయోజనాల కోసం వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేసినవారు, దీటైన విమర్శలతో అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజల దృష్టిలో దోషులుగా నిలబెట్టిన వారూ ఉన్నారు.



ముచ్చటగా మూడోసారి..

నెల్లూరు నగర ప్రజలకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. సుదీర్ఘ కాలంగా ఈయన తెలుగుదేశం పార్టీలో క్రియాశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వంలో నుడా చైర్మన్‌గా రెండుసార్లు పనిచేశారు. 2019-23 వరకు నెల్లూరు సిటీ టీడీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఐదేళ్ల వైసీపీలో ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలను ధీటుగా ఎదుర్కొన్నారు. పార్టీ కేడర్‌కు అండగా నిలిచారు. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్ ఆశించారు. టికెట్టు దక్కకపోయినా ఎన్నికల్లో శ్రమించారు. నుడా చైర్మన్ పదవికి పలువురు పోటీ పడినా కోటంరెడ్డి పార్టీ పట్ల చూపిన విశ్వసనీయత, నందమూరి బాలకృష్ణ ఆశీస్సుల నేపథ్యంలో ఈయనకు మూడవసారి కీలక నుడా చైర్మన్ పదవి దక్కింది. కాగా, నటుడు నందమూరి బాలకృష్ణ కోటంరెడ్డికి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు.

● పోలంరెడ్డి దినేష్ రెడ్డి



కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి రాజకీయ వారసుడిగా రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఎన్నికల చివరి క్షణం వరకు ఐదేళ్లపాటు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. ఇక టికెట్టు ఇచ్చే సమయానికి రాజకీయ సమీకరణలు మారడంతో పార్టీ ప్రయోజనాల కోసం టికెట్టు విషయంలో రాజీపడ్డారు. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు కోసం శక్తివంచన లేకుండా శ్రమించారు. పార్టీ పట్ల నిబద్ధత, విధేయతల నేపథ్యంలో దినేష్‌రెడ్డికి ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది.

ఆనం వెంకట్రమణారెడ్డి



మాజీ ఎమ్మెల్యే ఆనం భక్తవత్సలరెడ్డి కుమారుడు. 2009లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం తరఫున పోటీ చేశారు. ఆ తరువాత టీడీపీకి దగ్గరయ్యారు. ఆనం కుటుంబం మొత్తం కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీలోకి వెళ్లినా ఈయన మాత్రం టీడీపీలోనే కొనసాగారు. కొంతకాలం సొంత వ్యాపారాలు చేసుకొంటూ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2002 నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. తన వాగ్ధాటితో, విషయ పరిజ్ఞానంతో అతి తక్కువ కాలంలోనే టీడీపీ అగ్రనాయకుల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆ క్రమంలోనే 2023లో పార్టీ ఈయనకు రాష్ట్ర అధికార ప్రతినిధి హోదా ఇచ్చింది. వైసీపీ నేతల కుంభకోణాలను

- మిగతా 6లో..



శుక్రవారం రాత్రికిరాత్రే భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్

కబ్జారాయుళ్ల బరితెగింపు

- ఐదెకరాల భూమిలో రాత్రికిరాత్రే కంచె ఏర్పాటు
- పట్టాదారులపై రౌడీమూకలతో దౌర్జన్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఆక్రమణదారుడు వైసీపీ నేత?

మర్రిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భూ అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ముఖ్యంగా జిల్లా సరిహద్దు మండలమైన మర్రిపాడులో కాసింత జాగా కనిపిస్తే చాలా రాత్రికిరాత్రే కంచె వేసేస్తున్నారు. తాజాగా నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కనే వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఐదెకరాల భూమిని కబ్జా చేశారు. సర్వే నెంబర్లు 1383-2సీ, 1385-1, 1385-2, 1385-3లలో జాతీయ రహదారి పక్కనే ఉన్న సీజేఎఫ్ఎస్ భూములను 15 ఏళ్ల క్రితం ఏడు కుటుంబాలకు సుమారు 24 ఎకరాలను పంపిణీ చేశారు. అయితే, ఈ భూముల్లోకి పట్టాదారులను వెళ్లనివ్వకుండా ఏడేళ్లుగా అక్రమార్కులు అడ్డుకుంటున్నారు. అంతేగాక ఎవరైనా సదరు భూమిలో సాగు చేస్తే పంటను ధ్వంసం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఏడాది క్రితం బాధితులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తామంటూ అధికారులు దీక్షను విరమింప చేశారు. కబ్జాదారులు అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో సన్నిహితులు కావడంతో బాధితులకు న్యాయం జరగలేదు. నాటినుంచి తమకు న్యాయం చేయాలంటూ ప్రతి సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్‌లో

- మిగతా 6లో



పట్టాదారులతో ఘర్షణకు దిగుతున్న బయటి ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు

వారిది అరణ్య రోదనే

- అటవీశాఖలో పదేళ్లగా భర్తీకాని పోస్టులు
- క్షేత్రస్థాయిలో పూర్తిగా ఖాళీలు
- 3,500 హెక్టార్లకు ఒక్కరే పర్యవేక్షణ
- ఉన్నవారిపై అదనపు పనిభారం
- సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల వేడుకోలు
- నేడు రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం



రాపూరు అభయారణ్యంలో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది



నెల్లూరు వెంకటేశ్వరపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పందిళ్లపల్లి శ్రీనివాసులు (ఐఎఫ్ఎస్) 1982లో కర్నాటకలో అటవీ అధికారిగా (డీఎఫ్‌వో) విధులు నిర్వహించేవారు. ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్‌లో మార్పు తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. 1991 నవంబరు 9న 'లొంగి పోతాను.. నువ్వు ఒక్కడివే అడవికి రా'.. అంటూ వీరప్పన్ శ్రీనివాసులుకు కబురు పంపాడు. అది నమ్మి వెళ్లిన శ్రీనివాసులును నవంబరు 10న వీరప్పన్ దారుణంగా హత్య చేశాడు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన శ్రీనివాసులుకు కీర్తిచక్ర బిరుదును ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ అటవీ అమరవీరుల సంస్మరణ దినంను నవంబరు పదవ తేదీన జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీశాఖ ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● సమస్యలు తీర్చేవారేరీ?

అటవీ ఉద్యోగులు కుటుంబాలను వదిలి ఒంటరిగా రోజుల తరబడి తిరుగుతూ అడవులను రక్షిస్తున్నారు. వన్యప్రాణలను రక్షణ కల్పించ డంలో తలెత్తే సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తుంటారు అలాంటి అటవీ ఉద్యోగులు అనేక ఒత్తిళ్లను, సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారుగా 2,82,000 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది.ప్రధానంగా జిల్లా పరిధిలో ఎర్రచందనం రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణను కూడా అటవీ సిబ్బందే చూసుకోవాలి. సుమారు 3500 హెక్టార్ల అడవికి ఒక్కరే రక్షణ కల్పించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం జిల్లాలో ఉన్నాయి. జిల్లాలో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పూర్తిగా లేకుండా పోయారు. దీంతో ఉన్న వారిపై అదనపు పనిభారం పెరిగింది.

● భర్తీకాని పోస్టులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అటవీ ఉద్యో గులు కొరత తీవ్రంగా ఉంది. సుమారుగా పదేళ్ల నుంచి అటవీశాఖలో ఖాళీల భర్తీ జరగలేదు. రెండేళ్ల క్రితం కేవలం నలుగురు సిబ్బందిని మాత్రమే జిల్లాకు కేటాయించారు. పూర్తి స్థాయిలో 250 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 150 మాత్రమే ఉన్నారు. రేంజర్ పోస్టులు 3, బీట్ అధికారులు 120 మందికిగానూ 90 మంది, ఏబీవో(అసిస్టెంట్ బీట్ అధికారులు)లు 70 మందికిగానూ ఒక్కరూ లేరు. ఉన్నవారంతా పదోన్నతులు పొంది బీట్ అధికారులు అయ్యారు. అటవీ సంరక్షణతో పాటు ఇటీవల ఎన్ఆర్ఈజీ ఎస్ ద్వారా పనులు చేయించాల్సి వస్తున్నది.దీంతో తగినంత మంది సిబ్బంది లేక ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల నుంచి రక్షణ కోసం గతంలో తుపాకులు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే అది పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. ఖాళీల భర్తీ కోసం ముందస్తు పదోన్నతులు కల్పించే వీలున్నా ఉన్నతాధికారులు ఆవైపు దృష్టి పెట్టడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అటవీ ఉద్యోగాలను భర్తీచేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

ఖాళీలు భర్తీ చేయాలి



అటవీశాఖలో పదేళ్లగా ఉద్యోగాల భర్తీని ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో కింది స్థాయి సిబ్బంది పూర్తిగా లేకుండా పోయారు. ఏబీవోలు 70 మంది ఉండాల్సి ఉండగా ఒక్కరూ కూడా లేరు. ఈ పరిస్థితిట ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయలి.

- ఎస్. పిచ్చిరెడ్డి, అటవీ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పని ఒత్తిడి లేకుండా చర్యలు



జిల్లాలోని అటవీ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. ఉద్యోగులకు ఎక్కడా పని ఒత్తిడి లేకుంగా చర్యలు తీసుకొంటున్నాం. ఎర్రచందనపై ప్రత్యేక నిఘా పెట్టాం.

- మహబూబ్ బాషా టెరిటోరియల్, డీఎఫ్‌వో

దైవానుగ్రహంతో కార్తీక లక్ష దీపార్చన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దైవానుగ్రహంతోనే కార్తీక మాస లక్ష దీపోత్సవం జరుగుతుందని శ్రీసౌభాగ్య భువనేశ్వరి పీఠం విశాఖపట్నం పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని వీఆర్సీ మైదానంలో శనివారం రెండో రోజు జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను అనుగ్రహిస్తూ ప్రవచనం చేశారు. వీపీఆర్ దంపతులు మంచి సంకల్పంతో 8 ఏళ్లుగా చేస్తున్న మహాశివునికి జరిగే ఈ పూజకు ఆటంకం కలుగకుండా పంచభూతాలు ఈ మైదానంలో కలియ తిరుగుతున్నాయన్నారు. రాజకీయాల్లో ఉంటూ ఆధ్యాత్మిక సేవ చేసే శక్తి, భాగ్యం వేమిరెడ్డి దంపతులకు భగవంతుడు కల్పించిన మంచి అవకాశం అన్నారు. కాశీ, శ్రీశైలం, చిదంబరం, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాల పుణ్యం ఈ కార్తీక మాస లక్ష దీపోత్సవంలో లభిస్తుందన్నారు. కార్తీక మాసంలో ఉసిరికను సేవిస్తే ఆయురారోగ్యాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి స్వహస్తాలలో, కార్తీక లక్ష దీపారాధన, ఆకాశదీపం, బాలరామునికి మల్లెపూలు, తులసీదళాలతో సహస్ర నామార్చనలు చేశారు. ఉదయం విశేష రుద్రహోమం, 108 మంది దంపతులతో ఆంజనేయస్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, ఆకుపూజ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, తదితర ప్రముఖ నాయకులు పాల్గొని పూజలు చేశారు.

రామానంద భారతీ స్వామి

నేటి కార్యక్రమాలు

ఆదివారం ఉదయం 9గంటలకు వీర వెంకటసత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి 7గంటలకు మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామీజీ అనుగ్రహ ప్రవచనం జరుగుతుంది.



కార్తీక దీపోత్సవంలో పూజలు చేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

నాడు కొడుపు కొట్టారు.. నేడు నింపుతున్నారు!

- ఉచిత ఇసుక పాలసీపై కూలీల మనోగతం
- వైసీపీ హయాంలో వలసెళ్లామయ్యా!
- కూటమి ప్రభుత్వంలో పని దొరుకుతోంది!
- రోజుకు రూ.1000 దాకా సంపాదించుకుంటున్నా!
- ఆనందం వ్యక్తం చేస్తున్న పేదలు

నోటికాడ ముద్ద అవినీతి రాబందుల పాలుచేసిన దాష్టీకం గత వైసీపీ ప్రభుత్వానిది. పొట్ట కూటి కోసం పరాయి పంచన చేరి దేహీ అనే పరిస్థితి లేకుండా ఉన్నచోటే ఉపాధి చూపిన మానవత్వం తెలుగుదేశం ప్రభుత్వానిది.

చేతులు కట్టి, కడుపు కొట్టి రాక్షసుల పొట్ట నింపిన ఘనత ఆనాటి ప్రభుత్వానిది. ఊరిపక్కనే పొట్టపోసుకునే అవకాశం కల్పించిన ఉదారత నేటి ప్రభుత్వానిది.

ఇసుక పాలసీ విషయంలో గత వైసీపీ ప్రభుత్వానికి, నేటి కూటమి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఇది. జిల్లా పరిధిలోని వేలాది మంది పేదల మనోగతమిది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు

ఇసుక.. ఊరి ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన ఆస్తి. ఊళ్లు వెలిసినప్పటి నుంచి ఐదేళ్ల క్రితం వరకు ప్రజలు ఇలాగే భావించారు. తమ పరిధిలోని వాగులు, వంకలపై హక్కును అనుభవించారు. అయితే గత పాలకులు ఇసుక నుంచి రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇసుక పాలసీ పేరుతో నదులు, వాగులు, వంకలను గంపగుత్తగా అస్మదీయులకు అప్పగించి ఇసుక విక్రయాల ద్వారా కోట్లు కూడబెట్టుకున్నారు. రీచ్‌ల చుట్టూ ప్రైవేటు సైన్యంతో రక్షణ వలయాలు, ప్రజలు కాదు కదా అధికారులు సైతం అటు వైపు చూడలేని, అడుగుపెట్టలేని విధంగా దాష్టీకాలు నెరపి ఇక్కడి ప్రజలకు ఇసుక అందకుండా చేసి మొత్తం పక్క రాష్ట్రాలకు తరలించారు. ఇసుక రీచ్‌ల్లో లోడింగ్ చేయడమే జీవనాధారంగా బతుకుతున్న పల్లెలను పస్తుల పాలు చేశారు. మనిషి అన్నవాడు ఎవడూ పార చేతపట్టుకొని జిల్లా పరిధిలోని ఏ వాగులోకి వంకలోకి దిగడానికి వీలు లేదు. తట్ట ఇసుక తెచ్చుకోవడానికి వీల్లేదు. అన్నట్లు గుత్తేదారులు వాగులు, వంకలపై సర్వాధికారాలు చెలాయించారు. ఒకటి కాదు.. రెండు కాదు... ఐదేళ్లు ఊరిపక్కన ఉపాధి దొరికే మార్గం ఉన్నా అక్కడికి వెళ్లే అవకాశం లేక పేదలు పొట్ట చేతపట్టుకొని ఇతర పనుల కోసం పక్క ఊళ్లకు వలసవెళ్లారు. పరాయిపంచకు చేరి కాయకష్టం చేసుకునే అవకాశం కోసం దేహీ అన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ ప్రభుత్వానికి పూర్వం శ్రామిక చెమటతో పులకించిన నదులు, వాగులు గత ప్రభుత్వ పుణ్యమా అని కరకు యంత్రాల ఇనుప పళ్లకు గుండెలు పగిలేలా మూగగా రోదించాయి. ప్రకృతి వేదనో.. సహజ వనరుల శాపమో... కారణమేదైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల కళ్లు.. నదీమాతల్లుల గుండెలు ఆనందంతో చెమ్మగిల్లుతున్నాయి.

● ఇసుక మేటల్లో శ్రమ సౌందర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకున్న మానవీయ నిర్ణయాల్లో ఇసుక పాలసీ ఒకటి. ఈ పాలసీ పేద, ధనిక వర్గాలనే తేడా లేకుండా అందరికీ ఆమోదయోగ్యంగా గుర్తించబడింది. కూటమి ప్రభుత్వం కూడా ఇసుక పాలసీ విషయంలో తర్జన భర్జన పడింది. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి ఇసుక ద్వారా ఎంతో కొంత ఆదాయం తెచ్చుకుందామనే ఆలోచనలు చేసింది. అయితే ఆదాయం కన్నా జనహితమే ప్రధానం అనుకున్నారో ఏమో ఉచిత ఇసుక పాలసీ విధానం తెచ్చారు. ప్రజలకు, శ్రామికులకు మేలు చేసే కొత్త ఆలోచన చేశారు. రీచ్‌లో వాహనాల లోడింగ్‌కు శ్రామికులనే ఉపయోగించాలని చట్టం చేశారు. ట్రాక్టర్లు తప్ప టిప్పర్లు రీచ్‌లోకి వెళ్లడానికి వీలులేకుండా చట్టం చేశారు. రీచ్‌లో జేసీబీలు దిగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు ఇసుక వెళ్లకుండా నిషేధం విధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఇసుక లభ్యత ఉన్న అన్ని రీచ్‌లు శ్రామికులతో కళకళలాడుతున్నాయి. ఐదేళ్లపాటు కళ్ల నీళ్లు తెప్పించిన ట్రాక్టరు ఇసుక ధర ఇప్పుడు సామాన్యులు సైతం కొనగలిగే స్థాయికి తగ్గిపోయింది. ముఖ్యంగా వేలాది మంది పేదలకు ఉపాధి లభించింది. పొద్దుపొడవక ముందే రీచ్‌లోకి దిగి సల్లపూటే కూలి సంపాదించుకొంటున్నారు. రోజుకు కనిష్ఠంగా రూ. 500 నుంచి 1000 వరకు కూలి గిట్టుబాటు అవుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'అయ్యా..!! వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు కూలి దొరక్క ఊరూరా తిరిగాం. ఇప్పుడు మా ఊళ్లోనే మాకు ఉపాధి దొరికిందయ్యా.' అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాయకష్టమే పెట్టుబడిగా స్వేదం చిందించే శ్రమజీవుల ఆనందం వారి మాటల్లోనే..

రోజూ పని దొరుకుతోంది



ప్రతీరోజు ఇసుక ట్రాక్టర్లకు లోడింగ్ చేసేందుకు పని దొరుకుతోంది. గత ప్రభుత్వంలో రీచ్‌లో మిషన్లు పెట్టి మా పొట్ట కొట్టారు. ఇప్పుడు కూలీలతోనే రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ చేయాలనే నిబంధనతో మాలాంటి కూలీలు ఆనందంగా ఉన్నాము. రోజుకు కనీసం రూ.1000 నుంచి 1500 గిట్టుబాటు అవుతోంది.

- రవీంద్ర, నెల్లూరు

కడుపునిండా తింటున్నాం



రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ కూలీలతోనే చేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయంతో మా కుటుంబం కడుపునిండా తినగలుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో రీచ్‌ల్లో మిషన్లు పెట్టడంతో పనులు లేక అల్లాడిపోయాము. ఇప్పుడు ప్రతీరోజు పని దొరుకుతోంది. ఈ పద్ధతిని ఇలాగే కొనసాగించాలి

- వెంకట రమణయ్య, నెల్లూరు

చేతినిండా పని దొరికింది



ప్రభుత్వం ఇసుక ఉచితం చేయడం వల్ల ట్రాక్టర్లు ఎక్కువగా ఏట్లోకి వస్తున్నాయి. దీని వల్ల మాకు చేతినిండా పని దొరికింది. మరిగిన్ని డబ్బులు సంపాదించుకోగలుగుతున్నాము. ఉదయం నుంచి ఏట్లోనే ట్రాక్టర్లకు ఇసుక కొడుతున్నాము. చాలా సంతోషంగా ఉంది.

- ఏకుల వెంకయ్య

పనికి బయట ఊర్లకు పోబల్లేదు



ఇంతకముందు పనుల కోసం పొరుగు ఊర్లకు పోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంకో ఊరికి పోవాల్సిన పని లేకుండాపోయింది. పక్కనే పెన్నానది ఉండటంతో ఇక్కడే చేసుకున్నంత పనుంది. మా ఊరికే బయటూరోళ్లు వచ్చి పని చేస్తున్నారు. ఇదే కొనసాగితే మంచిది.

- ఆదిపూడి పోలయ్య

ఉచిత ఇసుక వల్ల కష్టాలు తీరాయి



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక వల్ల మాలాంటి కూలీలకు కడుపునిండా కూడు దొరకడంతోపాటు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల కష్టాలు కూడా తీరాయి. ఇసుక కోసం గత ప్రభుత్వంలో జనాలు ఎంత అల్లాడారో, అలాంటి వారందరికీ ఇప్పుడు ఇసుక సమృద్ధిగా అందుతోంది. మాకు చేతినిండా పని ఉండడంతో రోజు రూ.వెయ్యి వరకు గిట్టుబాటు అవుతుంది. ఈ పని నిరంతరాయంగా ఉంటే మా కష్టాలు తీరినట్టే.

- సీహెచ్.నాగరాజు, విరువూరు

ఇసుక లోడింగ్ పనితో ఉపాధి



సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుకతో పేదల ఇంటి నిర్మాణం, ఉచిత ఇసుకతో బేల్దారులకు పనులతోపాటు మాకు మా ఊర్లోనే మంచి ఉపాధి లభించింది. ఇంతకు ముందు కరువు పని, మామూలు రైతు కూలీ పనులకు వెళ్లేవాళ్లం. వాటికంటే ఇప్పుడు ఆదాయం బాగుంది. ఆరుగురు కలిసి ట్రాక్టర్ ఇసుక లోడింగ్ చేస్తాం. ఒక్కొక్కరికి రోజు రూ.800 నుంచి రూ.వెయ్యి గిట్టుబాటు అవుతుంది.

- ఎస్.అంకయ్య, విరువూరు

చంద్రబాబు పుణ్యం.. ఉపాధి దొరికింది



ముఖ్యమంత్రి చంద్రబాబు పుణ్య మా రోజూ ఏట్లో ట్రాక్టర్లకు ఇసుక లోడుచేసే పనులు దొరుకుతున్నాయి. మా కుటుంబాలను, పిల్లల్ని ఆనందంగా పోషించుకుంటున్నాము. గతంలో యంత్రాలు పెట్టి కూలీలకు పనుల్లేకుండా చేశారు.

- వెంకటరమణమ్మ, జొన్నవాడ

రోజూ పనులున్నాయి!



గతంలో టీడీపీ ప్రభుత్వంలోనూ, ఇప్పుడూ కూటమి ప్రభుత్వంలో సీఎంగా చంద్రబాబుతోనే కూలీల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. ఉచిత ఇసుకతో ట్రాక్టర్లకు, కూలీలకు రోజూ రూ.700 నుంచి వెయ్యి సంపాదిస్తున్నాం.

- తాటిపర్తి నరసయ్య, జొన్నవాడ

రైల్వే అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- నెల్లూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం
- ఓహెచ్ఈ భవనం ప్రారంభం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని విజయవాడ డివిజన్ రీజియన్ మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఏ పాటిల్ ఆదేశించారు. శనివారం నెల్లూరుకు వచ్చిన ఆయన ముందుగా రైల్వే స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ఓహెచ్ఈ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లో ప్రయాణికుల వసతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎస్ఎస్ శివయ్య, పలువురు డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

ఇంటర్వ్యూ

నత్రజని ఎరువులు అధికంగా వాడొద్దు!

- అధిక దిగుబడులకు విత్తనాల ఎంపిక, శుద్ధి ప్రధానం
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

? విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

! విత్తనాల ఎంపికలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. సర్టిఫైడ్ రకాలనే ఎంపిక చేసుకోవాలి. అంతేగాక విత్తనాలకు సంబంధించి బిల్లు, లాట్ నెంబరు, చివరికి సంచి కూడా పంట చేతికొచ్చేదాకా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ఎరువుల కొరత ఉందంటున్నారు

! ఎరువులతోపాటు విత్తనాల విషయంలో రైతులకు సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. ప్రతి నెలా జిల్లాకు జరిగే కేటాయింపులకంటే అధికంగా 20వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అసరమని ఆయా కంపెనీల ప్రతినిధులకు ఇప్పటికే తెలియజేశాం. జిల్లా అవసరాలకు అనుగుణంగా దిగుమతులు చేసుకుంటున్నాం. ఇప్పటికే యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్స్ ఎరువులు దాదాపు 44,843 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. విత్తనాలు దాదాపుగా రైతులు తీసుకున్నారు. ఇంకా 69 వేల క్వింటాళ్లు గోదాముల్లో ఉన్నాయి.

? తెగుళ్లు, పురుగుల నివారణ ఎలా

! నత్రజని ఎరువులను ఎక్కువగా వాడటం వల్లే పంటకు తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్నాయి. ఆ ఎరువుల వాడకం తగ్గించాలి. ఎకరాకు 35 కేజీల చొప్పున మూడుసార్లు 105 కేజీలు వినియోగిస్తే సరిపోతోంది. కానీ రైతులు రెండు నుంచి మూడు బస్తాల ఎరువులను వాడుతున్నారు. ఇది రైతుకు అదనపు పెట్టుబడి. పంటకు నష్టం కూడా. నత్రజని ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

? మంచి దిగుబడులకు మీ సూచనలు

! పంట దిగుబడిలో నాణ్యమైన విత్తన ఎంపికే ప్రధానం. ఆ తరువాత విత్తనశుద్ధి ఎంతో ముఖ్యం. విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్లను నివారిస్తుంది. ఎక్కువ విత్తనాలు మొలకెత్తేందుకు ఉపయోగపడుతుంది. ఒకేరీతిలో మొలకలు వస్తాయి.

? వ్యక్తిగత యంత్రాలు సమకూరుస్తారా

! గ్రామాల్లో మేము తిరిగిన ప్రతిచోటా వ్యక్తిగత పరికరాలు, ట్రాక్టర్లు, టార్పాలిన్ పట్టలు కావాలని రైతులు అడుగుతున్నారు. వాటిని జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. వ్యక్తిగతంగా పరికరాలు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

? వ్యాపారుల దోపిడీకి కళెం వేస్తారా

! మార్కెట్లో ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టంగా, కఠినంగా హెచ్చరించాము. కృత్రిమ డిమాండ్ సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా చెప్పాము. ఆ మేరకు ఆదేశాలు కూడా జారీ చేశాము.

? భూసార పరీక్షల మాటేమిటి

! జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 23,300 మట్టి నమూనాలు సేకరించాము. అందులో ఇప్పటికే 10వేల నమూనాల ఫలితాలు వచ్చాయి. మిగిలినవి డిసెంబరు మొదటి వారంలోగా పూర్తిచేసి రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

రేపు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఈనెల 11వ తేదీ ఉదయం 9.30 గంటలకు తమ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమా శాఖాధికారి, అదనపు జిల్లా వక్ఫ్ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కృష్ణపట్నం పోర్టులో భారీ నౌక

● రికార్డు స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి

ముత్తుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టులో రికార్డు స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి జరుగుతోంది. పోర్టులోని ఐదో నెంబరు బెర్త్‌లో లంగర్ వేసిన భారీ నౌక ఎంవీ మినరల్ వుటమరో నుంచి ఇనుప ఖనిజాన్ని అన్‌లోడ్ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్‌కు మొత్తం 193,402 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ దిగుమతి అవుతున్నది. పోర్టు అధికారులు అద్భుతమైన సాధన సందర్భంగా షిప్ మాస్టర్‌కు మెమొంటోను అందించి సత్కరించారు. 2018 ఫిబ్రవరి 26న జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ లిమిటెడ్ కోసం ఎంవీ సమ్మాన్ ఆగ్రోనాట్ నౌక ద్వారా 192,856 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని రవాణా చేసి నెలకొల్పిన రికార్డును ఈ నౌక అధిగమించింది. కార్యక్రమంలో ఏకేపీఎల్ సీవోవో రాజన్‌బాబు, మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్‌గార్గ్, కెప్టెన్ టీ సాహాహశాస్ మెరైన్, సెక్యూరిటీ హెడ్ మేజర్ వెంకటేష్, భాస్కరన్, పోర్టు కంట్రోల్ మెరైన్ ఇన్‌చార్జ్ జునాద్ షేక్. తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయులకే పట్టం!

(5వ పేజీ తరువాయి)

ఈయన సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ఈయన చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం ఈయనకు ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియమించింది.

సురేష్‌రెడ్డి



ఈయన స్వస్థలం తోటపల్లి గూడూరు మండలం చిన్న చెరుకూరు. నాలుగు దశాబ్దాలుగా బీజేపీలో క్రియాశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. 1984 నుంచి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేపీలలో వివిధ బాధ్యతల్లో పని చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2004లో నెల్లూరు సిటీ నుంచి, 2014లో నెల్లూరు రూరల్ నుంచి, 2019లో నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేశారు. పార్టీకి ఈయన చేసిన సేవలను గుర్తించి బీజేపీ కోటా కింద ఆర్టీసీ నెల్లూరు రీజన్ బోర్డు చైర్మన్‌గా నియమించారు.

12న మంద కృష్ణమాదిగ రాక

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 12న నెల్లూరుకు వస్తున్నారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ చెప్పారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు తరువాత తొలిసారిగా నెల్లూరుకు వస్తున్న మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నేతలు ఎం. పెంచలయ్య, ఎస్. ఉదయ్‌కృష్ణమాదిగ, గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కబ్జారాయుళ్ల బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

బాధితులు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. కానీ అధికారులు మాత్రం చొరవ చూపడం లేదు. తాజాగా శని, ఆదివారాలు సెలవులు కావటంతో అధికారులు అటు వైపు రారనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రికి రాత్రే అక్రమార్కులు బరితెగించారు. పొంగూరు రెవెన్యూలోని సర్వే నెంబర్లు 899-2-2బీ, 899-2-3డీ, 900-1ఏ, 899-2-3ఏలోని ఐదు ఎకరాల భూమిలో ట్రాక్టర్ సహాయంతో డ్రిల్ వేసి చుట్టూ సిమెంట్ స్తంభాలను నాటించి, ఇనుప ముళ్ల కంచెను చుట్టేశారు. విషయం తెలుసుకున్న పట్టాదారులు తెలుసుకుని పొలం వద్దకు పరుగులు తీశారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమను అడ్డగించి, ఘర్షణకు దిగారని బాధితులు వాపోయారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారుల నిర్ణయం మేరకు విచారిస్తామని, అప్పటివరకు ఇరువర్గాలను భూమిలోకి వెళ్ల వద్దని పోలీసులు సూచించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

కావలిరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, కులమతాలకు చిచ్చుపెట్టేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని కావలి ఒకటోపట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. ప్రధాని, సీఎం, ఉప ముఖ్యమంత్రి, కావలి ఎమ్మెల్యేలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన నలుగురిపై శనివారం టీడీపీ నేత జ్యోతి బాబూరావు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు ఆత్మకూరు రాజేష్, సుందరరాజు, సబ్బా ప్రభావతి, దామెర్ల శ్రావణ్‌కుమా ర్‌లపై కేసు నమోదు చేశామ న్నారు.

పీహెచ్‌డీ గ్రహీతకు సన్మానం

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జే ఎన్టీయూఏ అనంతపురం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌తో పీహెచ్‌డీని పొందిన కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకురాలు బృందావనిని శనివారం కళాశాల ఏవో రమణారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి, అన్నివిభాగాల అధ్యాపకులు ఉన్నారు.

రసీదులు లేని సెల్‌ఫోన్లు కొనొద్దు

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తుల వద్ద రసీదులు (బిల్లులు) లేని సెల్‌ఫోన్లు కొనుగోలు చేసి ఇబ్బందులకు పడవద్దని ఎస్‌ఐ భోజ్యా తెలిపారు. బోగోలు మండలం తిప్ప పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన ఈ విషయంపై మాట్లాడారు. తక్కువ ధరకు వస్తున్నాయని సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే అవి చోరీ చేసినవి అయితే ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోటి సోమవారం సందర్భంగా పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయంతో పాటు గండిపాళెం, అప్పసముద్రం, కుర్రపల్లిగడ్డ, లింగాలదొన, అప్పసముద్రం, గుడినరవ తదితర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి అభినందన

ఉదయగిరి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):నార్త్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పీ సందానిబేగం రాష్ట్రస్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు ఉపాధ్యాయులు శనివారం అభినందనలు తెలిపారు. ఈనెల 11న జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుంటారు.

ఆలయ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో ఆదివారం నూతన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి మొక్కులు చెల్లించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కా ర్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశే ఖర్‌రెడ్డిలు పాల్గొంటారన్నారు. కావున మండల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పరీక్ష కేంద్రం, స్పాట్ సెంటర్ 'ప్రైవేటు'కు !

- మంజూరుపై విద్యారంగ నిపుణుల విమర్శలు
- ప్రభుత్వ కళాశాల ఉండగా.. మరి అక్కడెందుకో ?
- 'ఆంధ్రకేసరి' తీరుపై విస్మయం



టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఏర్పాటైన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కళాశాలలను కాదని, అరకొర సదుపాయాలు ఉన్న ప్రైవేటు కళాశాలలకు పరీక్ష కేంద్రాలు, స్పాట్ వాల్యూయేషన్ సెంటర్లు కేటాయించటంపై విద్యా రంగనిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● టీఆర్‌ఆర్‌ను కాదని..

ప్రకాశం, నెల్లూరు జిల్లాలోనేకాక రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన, ఇటీవలే అటానమస్ హోదా సాధించిన టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎగ్జామ్ సెంటర్, స్పాట్ వాల్యూ యేషన్ సెంటర్‌ను రద్దుచేసి యూనివర్సిటీ వీసీ, ఇతర అధికారులు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలకు మంజూరు చేయటం పట్ల అధ్యా పకులు, విద్యావంతులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నం దునే నాక్ ఏ ప్లస్ గుర్తింపును ఇవ్వటమే గాక అటానమస్ హోదా కూడా వచ్చింది. అలాగే కళాశాలలో అనుభవజ్ఞులైన, అత్యున్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఈ కళా శాలలో సుమారు 20మంది వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన అధ్యాపకులు ఉన్నారు. ఇలాంటి కళాశా లను కాదని మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్న, విద్యార్హతలు లేని అధ్యాపకులు పనిచేస్తున్న ప్రైవేటు కళాశాలపై యూనివర్సిటీ అధికారులు మోజు పడటంలోని ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

● అబ్జర్వర్‌గా కారు డ్రైవర్

ప్రస్తుతం డిగ్రీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, ఈ పరీక్షలకు అబ్జర్వర్‌గా అర్హత లేని వ్యక్తిని నియమించారని ప్రభుత్వ అధ్యాపకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. యూనివర్సిటీలోని ఉన్నతాధికారిణి కారు డ్రైవర్‌గా ఉన్న వ్యక్తిని దర్శిలోని ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడిగా బోగస్ సర్టిఫికెట్ సృష్టించి అతడ్ని అబ్జర్వర్‌గా నియమించారని టీఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారుల తీరు పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్‌ను దిగజార్చేలా ఉన్నదని వారు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని వారు కోరుతున్నారు.

సాగునీరు వృథా చేయొద్దు

● సోమశిల దక్షిణ కాలువ ఈఈ మల్లికార్జున



కలువాయి, (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులు నార్లు పోసుకుని నీరు వృథా కాకుండా చూడాలని ఈఈ మల్లికార్జున సూచించారు

? సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల చేశారా.

! మూడురోజుల నుంచి నార్లు పోసుకునేందుకు కాలువకు నీరు విడుదల చేశాం. సీజన్‌లో 42వేల ఎకరాలకు నీరివ్వాలని ప్రతి పాదించాం. 120రోజులు తరువాత అవసరమైతే మరో 20 రోజులు నీరు ఇస్తాం.

? కాలువలు ఎలా ఉన్నాయ్

! ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలన్నీ బాగున్నాయి. చివరి ఆయకట్టుకు నీరం దేలా చూస్తాం.

? రైతులకు ఇచ్చే సూచన ఏమిటి.

! రైతులంతా ఒకేసారి ఆలస్యం చేయకుండా నార్లు పోసుకుంటే చివరిఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందుతుంది. దీనివల్ల నీటి వృథాను కూడా అరికట్టవచ్చు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే విష్ణు జన్మదినం



కేక్ కట్ చేస్తున్న విష్ణు అభిమానులు

అల్లూరు (ఆంధ్రజ్యోతి), నవంబరు 9: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని ఆయన అభిమానులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పాత బస్టాండు కూడలిలోని విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణం రాజు, గోసల గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, సుధాకర్, దండ కృష్ణారెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు శనివారం కావలి ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణంరాజు, గోసల గోపాలరెడ్డి, పద్మనాభరెడ్డి, గోపి కృష్ణం రాజు, నిరంజన్ పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులకు మాజీ ఎమ్మెల్యే వంటేరు సత్కారం



వేమిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను శనివారం మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అనుచరులతో కలిసి నెల్లూరు వెళ్లి గజమాలతో సత్కరించా రు. ఇటీవల ఎంపీని కేంద్ర విదేశీవ్యవహారాల సభ్యుడిగా కేంద్రం నియమించడం, ఎమ్మెల్యేను టీడీపీ సభ్యురాలిగా నియమించడంతో కార్యక్రమం చేపట్టా మన్నారు. వంటేరు వెంట శేషారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నేడు కావలికి రానున్న శాప్ చైర్మన్

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం మధ్యాహ్నం కావలికి వస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంను సందర్శిస్తారన్నారు. అక్కడ స్థానికుల నుంచి సూచనలు స్వీకరించి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సూచనల మేరకు స్టేడియం అభివృద్ధికి అవ సరమైన ప్రణాళికలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

దళిత యువకుడి ఆత్మహత్యాయత్నం



యర్రజొన్న గోవర్ధన్

లింగసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నెబోయినపల్లి ఎస్సీ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు యర్రజొన్న గోవర్ధన్ అనే యువకుడు నాయకులు, పోలీసుల వేధింపులు తాళలేక గురువారం రాత్రి అత్తగారి ఊరు కొండాపురం గ్రామ శివారులో పు రుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, అతని బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోవర్ధన్ కందుకూరు శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన తలతోటి మస్తాన్ అనే బిల్డర్ వద్ద రెండేళ్లుగా పని చేస్తున్నాడు. అయితే గోవర్ధన్ మస్తాన్‌కు కొంత మొత్తం బాకీ పడ్డాడు. తాను పనికి రాలేనని అప్పు నిదానంగా తీరుస్తానని మస్తాన్‌కు చెప్పాడు. రెండురోజుల క్రితం మస్తాన్ గోవర్ధన్‌ను కందుకూరుకు పిలిపించి అనుచరులు తీవ్రంగా బెదిరించి కందుకూరు పోలీసులకు గోవర్ధన్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీ సులు గోవర్ధన్‌ను పోలీస్‌స్టేషన్‌కు పి లిపించి రాత్రి ఒంటిగంట వరకు నిర్బం దించి వేధింపులకు గురి చేశారు. గోవర్ధన్ మస్తాన్‌కు రూ.1.50 లక్షలు మాత్రమే బాకీ ఉంటే రూ.5లక్షలు బాకీ ఉన్నట్లు ఖాళీ పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించారు. ఆ డ బ్బులు ఇవ్వకపోతే చంపేస్తారని, వారి చేతుల్లో చావడం కంటే తానే పురుగు మందు తాగి చని పోతానని సెల్ఫీ వీడియో తీస్తూ తాగి అది తన బంధువులకు పంపించాడు. తనను వేధించిన బిల్డర్ మస్తాన్‌ను, పోలీసులపై చర్య లు తీసుకోవాలని గోవర్ధన్ అందులో కోరాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అత న్ని కావలికి తరలించి ప్రథమ చికిత్స చేయిం చారు. వైద్యం కోసం నెల్లూరు నారాయణ వైద్యశాలకు తరలించి చి కిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి విష మంగా ఉందని తండ్రి వీరయ్య శనివారం రాత్రి తెలిపారు.

జోరుగా బెల్టు అమ్మకాలు

కావలి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మారుమూల గ్రామాల్లో సైతం పుట్టగొడుగుల్లా బెల్టుదుకాణాలు వెలుస్తు న్నాయి. రుద్రకోటలో 15 బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆందోన వ్యక్తం చేస్తున్నారు. అరుంధతీయవాడలో పోటాపోటీగా 3బెల్టు దుకాణాలు నిర్వహిస్తుండగా ఉదయం 6గంటల నుండి రాత్రి 10గంటల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. బెల్టు దుకాణాల్లో మద్యం తాగేందుకు వీలుగా టేబుళ్లు వేసి మరీ ఉంచటం బార్లను తలపిస్తున్నాయని చెబుతున్నారు. రుద్రకోటలోని మద్యం దుకాణం నుండి ఎంఆర్పీ ధర మీద రూ.5లకు అదనంగా తీసుకుని చుట్టు పక్క గ్రామాల్లో బెల్టు దుకాణాలను విక్రయిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి

ఉలవపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాల స్వామి కోనేరులో శనివారం సాయంత్రం 4.30గంటల సమయంలో మతిస్థిమితం లేని యువకుడు (30) పడి మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ అంకమ్మ సిబ్బందితో కలిసి కోనేరు వద్దకు చేరుకున్నారు. నీటిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో తనే స్వయంగా నీటిలోకి దూకి గాలింపు చర్యలు చేపట్టాడు. ఎస్‌ఐకు స్థానికులు మరో ఇద్దరు సహాయపడటంతో ఎట్టకేలకు మృతుదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడు నాలుగు రోజుల క్రితం చాగొల్లు ఇందిరానగర్ కాలనీలో వాటర్ ట్యాంక్ ఎక్కి స్థానికులను కంగారు పెట్టడంతో పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించగా తనది బీహార్ అని మాత్రమే చెప్పాడని మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించనట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా ఉలవపాడు వీధుల్లో తిరుగుతు ఉండటం గమనించినట్లు స్థానికులు చెబుతున్నారు.

మాలకొండ ఆదాయం రూ.11.47లక్షలు

వలేటివారిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం రూ.11.47లక్షలు వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెం పొడపాటి మాలకొండయ్య, రమణమ్మ దంపతులు మనుమళ్లు లక్ష్మీనరసింహం, వెంకటమన్విక్‌ల పుట్టు వెంట్రుకల సందర్భంగా ఆలయంలో భక్తుల అన్నదానానికి రూ.1,30,000అందజేసినట్లు పేర్కొన్నారు.

50మంది విద్యార్థుల ఎంపిక

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ బైక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు 50మంది ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ రాజమోహన్ ఆధ్వర్యంలో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 64మంది ఎంపికల ప్రక్రియకు హాజరైనట్లు పేర్కొన్నారు. వీరు చెన్నైలోని టీవీఎస్ కంపెనీలో జాయిన్ కావాల్సి ఉంటుందన్నారు.

ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలి : సీపీఎం

జలదంకి, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం మోపే ప్రయత్నం చేస్తోందని ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలని సీపీఎం నాయకులు రావి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ విషయంపై శనివారం ఆయన పార్టీ నాయకు లతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయం సురే చెంచురెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న ప్రజావ్యతిరేక విధానాలపై కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో జరిగే ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మేలంగి ఆంథోనీబాబు తాళ్లూరి మాల్యాద్రి పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో వసతులు కల్పించండి

వలేటివారిపాలెం, నవంబరు 9: స్థానిక సమస్యలపై అధికారులు దృష్టి సారించి శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం కార్యదర్శి కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని వడ్డెపాలెంలో పార్టీ నాయకులు నిర్వహించిన ప్రజాపోరులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి తక్షణం ట్రూఆప్ చార్జీల పేరుతో రూ.6400 కోట్లను కూటమి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మాధవరావు, లాజరు, నాగమ్మ, రాములమ్మ, కొండమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అరుంధతివాడలో సీపీఎం ప్రజాపోరు

బిట్రగుంట, నవంబరు. (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ అరుంధతివాడలో శనివారం సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి ప్రజా సమస్యలపై ప్రజాపోరు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెరిగిన నిత్యవసరాలు, విద్యుత్ బిల్లులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ నేత టి.వెంకయ్య, పోతల రమేష్, పోట్లూరి శీనయ్య తదితరులు ఉన్నారు.

టీఆర్‌ఆర్‌లో జాతీయ న్యాయసేవల దినోత్సవం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి

కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.శోభారాణి పాల్గొని పౌరుల రక్షణకు అందుబాటులో ఉన్న వివిధ చట్టాల గురించి వివరించారు. మండల న్యాయసేవాధికార సంఘం అధికారుల పనితీరు, పౌరుల ఉచిత న్యాయ సహాయం కోరే వివిధ మార్గాలను వివరించారు. లోక్ అదాలత్, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ పారా లీగల్ వలంటీర్లతో ఉచిత న్యాయసహాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సంపత్‌కుమార్, ఏజీపీ జీ.హరికోటేశ్వరరావు, అధ్యాపకులు నరేష్‌రాజా, షానాజ్‌బేగం పాల్గొన్నారు.

వసతి గృహంలో విద్యుత్ సామగ్రి ఏర్పాటు

● సొంత నగదుతో వార్డెన్ రామకృష్ణ దాతృత్వం



వసతి గృహంలో వెలుగుతున్న ట్యూబు లైట్లు

లింగసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో లైట్లు, ఫ్యాన్లు, స్విచ్చు బోర్డులను వార్డెన్ రామకృష్ణ రూ.రూ.22,500ల సొంత డబ్బుతో వేయించారు. విద్యార్థుల ఇబ్బందులు గమనించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వసతి గృహంలో 7 కొత్త ఫ్యాన్లు, 13 ట్యూబు లైట్లు, 10 స్విచ్చు బోర్డులు, వసతి గృహం మొత్తం వైరింగ్ ఏర్పాటు చేయించారు. వీటి ఏర్పాటుతో రాత్రి వేళ విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. అలాగే గ్రామ సర్పంచు పులి రాఘవులు కూడా నాలుగు స్టడీ లైట్లు ఉచితంగా ఏర్పాటు చేయించారు.

తూర్పుబోయమడగలలో టీడీపీ సభ్యత్వ నమోదు

వరికుంటపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబోయమడగలలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నెల్లూరు జిల్లా పార్లమెంట్ యువత కార్యదర్శి ఎంఎంకె చౌదరి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ రూ. 5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అజయ్ యాదవ్, నారాయణ యాదవ్, నాదిండ్ల భాస్కర్‌రావు, తోడిండల రత్తయ్య పాల్గొన్నారు.

● ఆత్మకూరు, నవంబరు 9: మున్సిపాల్టీ పరిధిలోని 5వ వార్డులో టీడీపీ నేతలు శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు నలిశెట్టి శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌బాషా, బొబ్బల మల్లికార్జునయాదవ్, నలబోతుల వెంకటేశ్వర్లు, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డి ఎంపిక పట్ల హర్షం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి నాయుడు శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

● వింజమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బీజేపీ నేత లెక్కమనేని రాజేష్‌నాయుడు శనివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉదయగిరి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గేదెను ఢీకొని మోటార్‌బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. నేలటూరు గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి ఉదయగిరి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో సీతారామపురం నుంచి వస్తున్న టెంపో వాహనం సర్వరాబాదు సమీపంలో గేదెలను ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి ఉన్న గేదెలను శ్రీను గమనించక ఢీకొట్టడంతో అ తనికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గుర్తించి శ్రీనును చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కాగా పశువులను ఢీకొన్న టెంపో వాహనం ఆపకుండా వెళ్లిపోయింది.

సమస్యల పరిష్కారానికి కృషి

సంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అఖిల భారత సక్షమ్ దివ్యాంగుల సంస్థ జిల్లా కార్యదర్శి రంగయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఇరిగేషన్ అతిథి భవనం ప్రాంగణంలో మండలస్థాయి దివ్యాంగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సక్షమ్ సంస్థ జిల్లా ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, నాగమణి, రాములమ్మ, రమణయ్య, స్వరూప, సంగం మండల సక్షమ్ ప్రముఖ్ అంజయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే దగుమాటి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

బిట్రగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకూ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట పార్టీ నేత సన్నిగటి వేణును శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం జేపీగూడూరు నాయకుడు పేరం క్రిష్ణారెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నేతలు నాగేశ్వరావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారావు, అంకపునాయుడు, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

● మొక్కుల పంపిణీ

కలిగిరి, నవంబరు 9: ఎరుకలరెడ్డి పాలెంలో స్థానిక టీడీపీ నేత షేక్ ఖాజామస్తాన్, నూర్‌జన్ దంపతుల మనుమడు అజ్జాన్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి మొక్కలు నాటి గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

● గంధోత్సవ కరత్రాల ఆవిష్కరణ

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెండాచెట్టు సమీపంలోని నాగూరు మీరా స్వాముల గంధోత్సవ కరపత్రాలను శనివారం సాయంత్రం కావలిలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఆవిష్కరించారు. డిసెంబరు 11న పట్టణంలో ఈ మహోత్సవంను వైభవంగా నిర్వహిస్తామని మత పెద్దలు ఎమ్మెల్యేకు ఆహ్వానించారు. డిసెంబరు 2న సాయంత్రం చంద్రదర్శనం సందర్భంగా గంధ మహోత్సవ జెండా ఊరేగింపు చేపడతామన్నారు.